సంపుటి: 23
సంచిక: 5

ఫోన్ నెం.
36959

అపరాధ పరిశోధన

డిటెక్టివ్ కథల మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 39 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

జూన్, 1977

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి
అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల
సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. వీ. మోహన్రావ్

జ్ఞానోపదేశం?

వసుంధర

పోస్ట్ అందుకున్న కొడుకువంక ఆత్రుతగా చూసి "ఏమిట్రా అవి" అంది సావిత్రి ఆశగా.

"మూడు రిగ్రెట్ లెటర్స్!" అన్నాడు సోమరాజు ఏడవ లేక నవ్వుతూ.

సావిత్రి నిట్టూర్చి ఏమీ అనకుండా లోపలికి వెళ్ళి పోయింది. ఈ జన్మకు నీ కుద్యోగం దొరుకుతుందా అన్న ప్రశ్న సోమరాజుకు తల్లి కళ్ళలో కనిపించింది.

ఉద్యోగాలకని ఇంటర్వ్యూలకు వెళ్ళడం, రిగ్రెట్ లెటరు, సంపాదించడం సోమరాజుకు కొత్తకాదు. అయితే అతని తల్లి అసంతృప్తికి కారణం వేరు.

సోమరాజీ శతాబ్దంలో పుట్టవలసినవాడు కాదు. సత్ప్రవర్తనకు సంబంధించి అతనికి కొన్ని నీతి, నియమా లున్నాయి. ఏ పరిస్థితుల్లోనూ వాటిని దాటడు. ఎవరికీ లంచా

న్నివ్వడు. రికమెండేషన్‌కోసం తనకు తానై ప్రయత్నిం చడు. అన్నింటికీ స్వయంప్రతిభ మీదనే ఆధారపడతాడు. అతను గొప్పవాడై ఉంటే ఈ లక్షణాలకు చాలా ప్రచారం లభించి ఉండేది. కానీ అతను గొప్పవాడు కావడాని కీలక్ష ణాలే అడ్డువస్తున్నాయి.

సోమరాజు తలిదండ్రులకు ఇద్దరు ఆడపిల్లల తర్వాత కలి గిన మగబిడ్డ. అల్లారు ముద్దుగా పెరిగాడు. అతను లోకం గురించి అట్టే నేర్చుకోలేదు. తలిదండ్రులు చెప్పేవీ, మేష్టర్లు బోధించేవీ బాగా అతనికి తలకెక్కాయి. తన జీవితం అలానే నడపాలనుకున్నాడు. నడుపుతున్నాడు. బియ్యే ప్యాసై రెండేళ్ళయింది. ఇంతవరకూ అతనికి ఉద్యోగం లేదు.

సోమరాజు తండ్రి గుమాస్తా. ఆయనింటి పక్కనే ప్రసాదరావని ఇంకో గుమాస్తా ఉండేవాడు. ఆయన బాగా లంచంపట్టి ఉద్యోగంలోంచి డిస్మిస్ అయిపోయి వ్యాపా రంలోకి దిగి అదృష్టం కలిసిరాగా గొప్పవాడైపోయాడు. దివ్యభవనంగా మారిపోయిన ఆయన పెంకుటిల్లు ఇప్పటికీ సోమరాజు ఇంటి పక్కనే ఉంది.

సోమరాజు తండ్రి, ప్రసాదరావు ప్రాణస్నేహితులు. దృక్పథాలు వేరైనా వారి స్నేహం నిరాటంకంగా కొనసాగి పోయింది. ప్రస్తుతం ఇద్దరూ తమ స్నేహాన్ని స్వర్గంలో కొనసాగిస్తున్నారు.

తన భర్త, ప్రసాదరావును చూసి నేర్చుకుంటాడేమోనని సావిత్రి ఎంతో ఆశపడింది. కూడుపెట్టని సిద్ధాంతాలవల్ల ప్రయోజన మేమిటని ఆవిడ భర్తను నిలదీస్తే, "నీకు అందం ఉంది. దాన్ని బజార్లో నిలబెడితే చాలా సంపాదించ

వచ్చు. ఇష్టమేనా?" అనడిగాడాయన. అవాక్కైపోయిన భార్యను ప్రేమగా దగ్గరకు తీసుకుని "నువ్వు డబ్బుకోసం మానం వదులుకోలేవు. కానీ నన్ను మానాభిమానాలు వదులుకోమంటున్నావు!" అన్నాడు.

భర్తతో వాదించి నెగ్గలేకపోయిన సావిత్రి ఆశలన్నీ కొడుకుమీదనే పెట్టుకుంది.

ప్రసాదరావుకి సోమరాజుకీడైన వెంకట్రావనే కొడుకున్నాడు. వీళ్ళిద్దరూకూడా చిన్నప్పట్నించీ ఎంతో స్నేహంగా ఉంటున్నారు. వెంకట్రావుకూడా తండ్రి అడుగుజాడల్లోనే నడిచి గొప్ప వ్యాపారస్థుడిగా స్థిరపడ్డాడు. దురదృష్టవశాత్తు సోమరాజుక్కూడా తండ్రి పోలికలే వచ్చాయి. అతనూ గుమాస్తా ఉద్యోగంకోసమే ప్రయత్నిస్తున్నాడు.

వీలున్నప్పుడల్లా సావిత్రి వెంకట్రావుని కలుసుకుని, అతని ప్రయోజకత్వాన్ని పొగిడి కొడుకు అప్రయోకజత్వాన్ని నిందించి కొడుకును ప్రయోజకుడిగా చేయవలసిందిగా వెంకట్రావును కోరుతూ ఉండేది. వెంకట్రావుకూ స్నేహితుడిని బాగుచేయాలనుండేది. కానీ ఇద్దరివీ రెండురకాల దారులు. వాటిని కలపడమెలాగ?

ఈరోజు మూడు రిగ్రెట్ లెటర్సు వచ్చేక సావిత్రి మళ్ళీ వెంకట్రావుని కలుసుకుని పరిస్థితి వివరించి ఎలాగో అలా అతను కొడుక్కి సాయపడితీరాలంది.

ఆ రోజు వెంకట్రావు చాలా ఉత్సాహంగా ఉన్నాడు. వ్యాపారంలో అనుకోని లాభాలువచ్చే యతనికి. నాలుగు రోజులు ఇంట్లో తీరికగా విశ్రాంతిగా ఉండదలిచాడు. ఈ సమయంలో సావిత్రి వచ్చి మాట్లాడడంతో ఎలాగో అలా స్నేహితుణ్ణి మార్చాలనిపించిందతనికి. వెంటనే సోమరాజు

కోసం కబురుపెట్టాడు. సోమరాజు వచ్చాడు.

"చూశావా ఇది ఎయిర్‌కండిషన్డ్ గది. వేసవికాలం ఈ గదికిలేదు. డబ్బుతో అన్నింటినీ మార్చేయవచ్చు. ఒప్పు కుంటావా?" అన్నాడు వెంకట్రావు.

సోమరాజు నవ్వి ఊరుకున్నాడు.

"చూడు సోమూ - మనిద్దరం చిన్నప్పట్నించీ కలిపి తిరిగాం. నీ ధోరణి నీదేకానీ ఇప్పుడుకూడా మనమెందుకు కలిసి తిరకూడదు?" అన్నాడు వెంకట్రావు.

"తిరగాలని నాకూ ఉంటుంది. అందుకవసరమైన తీరు బడికూడా నా కిప్పుడుంది. కానీ నీకే లేదు."

"నా ఉద్దేశ్యమదికాదు," అన్నాడు వెంకట్రావు. "నువ్వా నాతో చేతులుకలిపి నాకులాగే డబ్బు సంపాదించాలి...." అన్నాడు వెంకట్రావు.

"అన్ని పనులూ అందరికీ చేతకావు" అన్నాడు సోమ రాజు క్లుప్తంగా.

"ఎందుకు చేతకావు? ప్రయత్నిస్తేకదా ఆ విషయం తెలి సేది! చదువులో ఎప్పుడూ నువ్వే తెలివైనవాడివిగా ఉండే వాడివన్న విషయం నేనెప్పుడూ మరువలేదు."

"అయితే నా జీవనవిధానం సరైనదేనని నువ్వు ఒప్పుకో వాలి. నీకంటె తెలివైనవాడు తీసుకున్న నిర్ణయానికి నువ్వు విలువనివ్వాలి."

వెంకట్రావు నవ్వి, "ఫ్రెండూ లోకజ్ఞానానికీ, చదువుకూ చాలా తేడా ఉంది. నీకు చదువుంది కానీ లోకజ్ఞానంలేదు. అది కలిగించడానికే ఈరోజు నిన్ను పిలిచాను...." అని కాసేపు జ్ఞానోపదేశం చేశాడు వెంకట్రావు.

వెంకట్రావుకు పేద ప్రజలంటే చాలా జాలి అట.

ఆయితే గుమాస్తా ఉద్యోగం చేసి పేదవాళ్ళ నాదుకోవడం సాధ్యపడదుట. అందుకని సమాజానికి పట్టిన చీడపురుగులను బెదిరించి డబ్బులాగి అందులో కొంత పేదలకిస్తున్నాడట. ఆ విషయాన్ని నిరూపించడంకోసం తను విరివిగా ఇచ్చిన విరాళాల వివరాలను చూపించాడతను.

సోమరాజు కళ్ళు తిరిగిపోయాయి. ఈ నెలలో వెంకట్రావిచ్చిన విరాళాల మొత్తం పదివేలు దాటిపోయింది.

"సమాజానికి చీడపురుగులని నీకు తెలిసినప్పుడు వాళ్ళను ఏరివేయవచ్చుగదా" అన్నాడు సోమరాజు.

వెంకట్రావు నవ్వి అక్కడున్న అల్మరా దగ్గరకు వెళ్ళి అందులోంచి కవర్ ఒకటి తీసి మిత్రుడి కందించాడు. సోమరాజు ఆ కవర్ తెరిచి అందులో ఉన్న ఫొటో ఒకటి బయటకు తీశాడు. ఫొటోలో నలుగురు వ్యక్తులు ఒక టేబుల్ చుట్టూ కూర్చుని ఉన్నారు. బల్లమీద విస్కీసీసా. గ్లాసులూ ఉన్నాయి. ముగ్గురు వ్యక్తుల ముఖాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. ఒక వ్యక్తి రాష్ట్ర క్యాబినెట్ మంత్రి!

"మంత్రిగారిని గుర్తుపట్టాను. మిగతావాళ్ళాయన స్నేహితులయుంటారు...." అన్నాడు సోమరాజు.

"అవును. కానీ నలుగురికీ చెప్పుకోగలిగిన స్నేహం కాదది. ఇంటర్నేషనల్ స్మగ్లర్ జాన్ ఫొటోలో మంత్రిగారి కుడిపక్క ఉన్నాడు. చట్టానికీ, దేశానికీ సంరక్షకుడిగా ఉన్న మంత్రిగారి వ్యక్తిగత చరిత్ర ఇది. ఇప్పుడు చెప్పు తెలిసినా చీడపురుగుల్ని ఏరివేయడం మనవల్లవుతుందా?"

సోమరాజు ఆలోచనలో పడ్డాడు.

"ఈ ఒక్క ఫొటోతో ఆయన్ను పదవినుంచి దింపేయవచ్చు. కానీ ఇలాంటివాడే ఇంకొకడు గద్దెనెక్కుతాడు. అది

ఆపడం మనవల్లకాదు. అందుకని ఈ ఫొటోతో డబ్బు సంపాదించి అందులో పీలుపడ్డంత ఆపదలో ఉన్నవారి నాదుకొనడానికి వినియోగించాలి...." అన్నాడు వెంకట్రావు.

సోమరాజేమీ మాట్లాడలేదు.

"నాతో పద. లోకమంటే ఏమిటో చూపిస్తాను. సుఖ పడే విధానం తెలియబరుస్తాను. పేద ప్రజల కడుపు కొట్ట నంతకాలం డబ్బు ఎలా సంపాదించినా ఫరవాలేదు...." అన్నాడు వెంకట్రావు.

మిత్రులిద్దరూ లేచారు. సోమరాజు, వెంకట్రావు ననుస రించాడు.

2

కారు హోటల్ భక్తి ముందాగింది. భక్తిహోటల్లో వెంకట్రావు మేనేజింగ్ పార్ట్నర్ అని సోమరాజుకు తెలుసును.

"ఈ హోటల్ పేరు భక్తి. క్షేత్రయ్య పాటల్లోని మధుర భక్తి ఈ హోటల్లో అనునిత్యం కొనసాగుతూంటుంది. నాతో పద...." అంటూ వెంకట్రావతన్ని రెండో ఫ్లోర్‌లోకి తీసుకుపోయాడు. అక్కడ అతనికోసం ప్రత్యేకించబడిన గది ఉంది. తాళం తీసుకుని లోపలకి వెళ్ళాక తలుపులు వేశాడు వెంకట్రావు.

"ఇది చాలా ముఖ్యమైనది. దీనికి రెండు బాత్రూము లున్నాయి. ఒకటి కుడివైపున, మరొకటి ఎడమవైపున. ఆ బాత్రూముల నానుకుని పక్కగదులుంటాయి. ఆ గదులు రోజులో అన్ని సమయాల్లోనూ బుక్కయుంటాయి. ఎప్పు డైనా వినోదం కావాలనుకుంటే...." అంటూ అతను కుడి వైపు బాత్రూమ్‌లోకి దారితీశాడు. సోమరాజతన్ని అనుస రించాడు.

బాత్రూమ్‌లోని అద్దాన్ని కొంచెం పక్కగా తొలగించాడు వెంకట్రావు. గోడకు కొట్టిఉన్న మేకును ముందుకు లాగగా ఒక చిన్న పలక ఊడివచ్చి, బొటనవేలు పట్టేంత కంత ఏర్పడింది. వెంకట్రావు కంతలోంచీ చూసి, చిరునవ్వు నవ్వి "నువ్వు చూడు" అన్నాడు.

సోమరాజు కుతూహలంగా తొంగి చూశాడు. బహుశా పక్కగది కాబోలు స్పష్టంగా పూర్తిగా కనిపిస్తోంది. గదిలో చక్కని పడక ఏర్పాట్లున్నాయి. గదిలో ఒక యువకుడు, యువతి ఉన్నారు. యువతి నగ్నంగా నీరసంగా మంచం మీద పడుకుని ఉంది. యువకుడు బట్టలు కట్టుకొంటున్నాడు.

సోమరాజు చటుక్కున దృష్టి మరల్చుకోలేకపోయాడు. ఆడదాన్ని అంత స్పష్టంగా, నగ్నంగా అతడెన్నడూ చూడలేదు. ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది.

వెంకట్రావు తన భుజం తట్టగానే సోమరాజు ఉలిక్కిపడి సిగ్గుపడి వెనక్కి వచ్చేశాడు.

"ఎలా ఉంది దృశ్యం?" అన్నాడు వెంకట్రావు.

"అది వాళ్ళ ప్రైవేట్ వ్యవహారం. మనం చూడడం తప్పుకదూ?" అన్నాడు సోమరాజు.

"తప్పుజేసేది వాళ్ళు. అందుకు మనం కేవలం అవకాశం మాత్రం ఇస్తున్నాం. అందుకు ప్రతిఫలంగా డబ్బు తీసుకుంటున్నాం. ఆ అవకాశం మన మివ్వకపోతే మరొకళ్ళిస్తారు, వాళ్ళు తప్పుచేయడం ఎలాగూ మానరు?" అన్నాడు వెంకట్రావు.

"ప్రతి ఒక్కరూ ఇలాగనుకోవడం వల్లనే తప్పు ప్రోత్సహించబడుతోంది."

"నిజమే. ప్రతి ఒక్కరూ ఇలాగే అనుకుంటున్నట్లు

నీలాంటివాడు గుర్తించాలి." వెంకట్రావు నవ్వి "వీళ్ళనిలా చూడ్డంకోసం ఈ బాత్రూంలో ఈ ఏర్పాటు చేయలేదు. ఒకోసారి ఈ గదిలోకి చాలా గొప్పవాళ్ళు వస్తుంటారు. వాళ్ళెంత గొప్పవాళ్ళంటే వాళ్ళ చీకటితప్పు ఏమాత్రమూ బయటకురాదు. అటువంటప్పుడు ఫొటోలు తీసి వాళ్ళను బెదిరించి డబ్బు గుంజడంకోసమని ఈ ఏర్పాటు చేశాం. గదిలో ఉన్నవాళ్ళ కేమాత్రమూ అనుమానంరాదు...." అని "పద పక్క బాత్రూములోకి వెడదాం" అంటూ అక్కడ అన్నీ సరిచేశాడు.

"చూసిన దృశ్యం చాలు...." అన్నాడు సోమరాజు కుతూహలాన్నణచుకుంటూ.

"అది వేరు. ఇది వేరు." అంటూ వెంకట్రావు అతన్ని పక్క బాత్రూంలోకి తీసుకువెళ్ళాడు. ఇక్కడా సరిగ్గా అలాంటి ఏర్పాట్లే ఉన్నాయి. వెంకట్రావు చూసేక సోమ రాజుకూడా ఆ గదిలో ఏముందో చూశాడు.

భయంకరంగా ఉన్న ఒక మహాకాయుడు మంచంమీద వెల్లకితలా పడుకుని నిద్రపోతున్నాడు.

"అతనెవరో తెలుసా?"

"తెలియదు...."

"మనిషిరూపం కంటే కూడా భయంకరమైన చేతలు చేసేవాడు. అతని పేరు రామన్న!" అన్నాడు వెంకట్రావు.

ఉలిక్కిపడ్డాడు సోమరాజు. సరిగ్గా నాలుగు రోజుల క్రితం సినిమాథియేటర్లో ఒక దారుణహత్య జరిగింది. వివ రాలు పేపర్లో పడ్డాయి. ఆ హంతకుడి పేరు రామన్న అని పోలీసులు కనిపెట్టారు. కానీ అతని ఆచూకీ తెలియలేదు.

"ఇక్కడి కెలా వచ్చాడు?"

"స్మగ్లర్సుకీ, హంతకులకీ, పెద్దమనుషులుగా చలామణీ అవుతూ ప్రజలను దోచుకుతినేవారికీ ఇది కూడలిస్థలం. మినిష్టరుగారికి నేనిక్కడే ఫొటో తీశాను. రామన్న కిరాయి హంతకుడు. అతనికి ఊళ్ళో చాలామంది పెద్దలమద్దతు ఉంది. హత్యజరిగేక నేరుగా అతనిక్కడకువచ్చి రక్షణ పొందేటందుకు ఏర్పాట్లుజరిగాయి...."

"ఇన్ని దారుణాలలో నీకు వాటా ఉందన్నమాట!" అన్నాడు సోమరాజు ఆశ్చర్యంగా, బాధగా.

"ఉంది కానీ తప్పదు. ముందు మా నాన్న మంచి ఉద్దేశ్యంతోనే చిన్నహోటల్ పెట్టాడు. దానితో కొంతమంది పార్టనర్స్ కలిసి దీన్ని పెద్దహోటల్ చేశారు. పెద్దహోటల్ కావడంతోనే రకరకాల ఏర్పాట్లుకోసం ఒత్తిడి వచ్చింది. వ్యభిచారాన్ని హోటల్లో ప్రోత్సహిస్తే, దొంగలకు, హంతకులకు హోటల్లో ఆశ్రయమిస్తే అందువల్ల చాలా ప్రమాదాలున్నాయి. మావల్ల సాయంపొందినవారే మమ్మల్ని అపాయంలో ఇరికించవచ్చు. అందుకని వాళ్ళ జుత్తు మా చేతిలో ఉంచుకోవడంకోసం నాన్న ఈఏర్పాట్లుకూడా చేయించాడు."

"చూశావా ఒక తప్పుచేస్తే ఎన్ని బాధలో నాకిలాంటి కష్టాలులేవు" అన్నాడు సోమరాజు.

"కష్టసుఖాలు బొమ్మా, బొరుసూ లాంటివి. ఈ కష్టాలు పడ్డందుకు నాకు వేరే సుఖాలుండనే ఉన్నాయి. నేను పడే లాంటి కష్టాలు నీకు లేకపోవచ్చు. కాని నీకు పూటగడవడమెలాగ అనే ఆలోచనే పెద్ద కష్టం. నేననుభవించేలాంటి సుఖాలు ఊహలోకూడా పొందలేవు నువ్వు" అన్నాడు వెంకట్రావు.

నిజమేనని తలూపాడు సోమరాజు.

"హోటల్ భక్తికి నేను మేనేజింగ్ పార్ట్నర్‌ని. కానీ ఇలాంటి మరో రెండు హోటల్స్‌లో కూడా నాకు వాటా ఉంది. మేనేజిమెంట్ చూసే వాళ్ళుమాత్రం వేరే ఉన్నారు ...." అన్నాడు వెంకట్రావు.

"సరే, ఇదంతా నాకెందుకు చూపిస్తున్నట్లు?" అన్నాడు సోమరాజు.

"స్నేహధర్మం!" అని నవ్వాడు వెంకట్రావు. "ఇవి నా జీవితానికి సంబంధించిన ముఖ్యమైన రహస్యాలు. కానీ ఇవే నా అభ్యున్నతికి సోపానాలు. వీటిని నువ్వు తెలుసుకుని నా స్థాయికి చేరుకుంటావని నా ఆశ. నా ప్రాణ స్నేహితుడు నాకులాగే ఉండాలని నేననుకోవడంలో తప్పు లేదు కదా...."

సోమరాజు కళ్ళు చెమర్చాయి. "నామీద నీకున్న అభిమానానికీ, నమ్మకానికీ చాలా థాంక్స్. అయితే నేనిప్పుడేం చేయాలో చెప్పు. నీ స్థితికి చేరుకోవడానికి నేనేమేం చేయాలి, అన్న విషయాలు కాస్త విపులంగాచెప్పు...."

వెంకట్రావు కళ్ళు ఆనందంలో మెరిశాయి. "నీలో ఇంత త్వరగా మార్పు వస్తుందనుకోలేదు. నా దగ్గర ప్లానంతా సిద్ధంగా ఉంది. ఈ ఊళ్ళో ఉన్న సదానంద స్వాములవారు నీకు తెలుసా?"

"తెలియకేం? ఆయన భగవద్గీతను కాచి వడపోసేశారు. తరచుగా అమెరికావెళ్ళి అక్కడి ప్రజలకు గీతాసారాన్ని వివరించి వస్తూంటారు...."

వెంకట్రావు నవ్వి, "నీకు తెలిసినంతవరకూ తెలిపినదది. ఆయన విదేశాలకు మత్తు పదార్థాలు చేరవేస్తూం

టాడు. అందుకే ఆయనకంత పలుకుబడి. ఆ పదార్థాల నాయనకు సరఫరా చేసేవాళ్ళలో నేనొకడిని. ఈ వ్యాపారంలో పెట్టుబడికి పదిరెట్లు తక్కువ కాకుండా లాభం వస్తూంటుంది. నీ అభ్యున్నతి ఈ వ్యాపారంలో ప్రారంభమవుతుంది—" అన్నాడు.

ఏంచేయాలో సోమరాజుకు వివరించి చెప్పాడు వెంకట్రావు. స్వాములవారు ప్రతిదినమూ సాయం సమయాల్లో గీతాసారాన్ని వేదాంత తత్వజిజ్ఞాసువులకు సులభశైలిలో వివరిస్తూంటారు. అటువంటప్పుడు శ్రోతలకు కలిగిన సందేహాలకాయన సమాధానాలు కూడా ఇస్తారు. కొంతమంది తమ సందేహాలను నలుగురిలో వివరించడానికిష్టపడరు. అటువంటి వారికి ఏకాంతంగా జ్ఞానం కలిగించడానికి ఆయనకో అభ్యంతర స్థలముంది. అక్కడ ఆయన నిరభ్యంతరంగా మత్తుపదార్థాలను గ్రహిస్తారు.

"సదానందస్వామి ఇటువంటి స్మగ్లింగ్ వ్యాపారం చేస్తున్నాడని చూచాయగా కూడా నాకూ, నాకు తెలిసినవాళ్ళెవ్వరికీ-తెలియదు. ఈ రహస్యాలన్నీ నాకు చెప్పేశావు. మనిషి మనిషిని ఇంతగా నమ్మకూడదు. ఇప్పుడు నేను నిన్ను బ్లాక్ మెయిలింగు చేయడం మొదలెట్టేననుకో- ఏంచేస్తావ్?" అన్నాడు సోమరాజు ఏదో ఆలోచిస్తూ.

వెంకట్రావు ఆశ్చర్యంగా మిత్రుడివంక చూసి. "చిన్నతనంనుంచీ నాకు నువ్వు తెలుసు. నాకోసం ప్రాణమైనా ఇవ్వగల స్నేహితుడివి నువ్వు. ధన సంపాదనకు చట్టవిరుద్ధమని అందరూ భావించే పనులుచేసినా నాకే ద్రోహం తలపెడతావని నువ్వు చెప్పినా నేను నమ్మను. నీకు లోకజ్ఞానం కలిగించి పైకి తీసురావాలనుకోవడం నిజమైన

స్నేహితుడి ధర్మం. అదే నేను చేస్తున్నాను. నీ చుట్టూ ఉన్న ప్రపంచం కల్మషంతో నిండి ఉంది. వాళ్ళు భక్తులైనా, తత్వబోధకులైనా, నాయకులైనా-కేవలం మోసం చేసి, బ్రతుకుతున్నారు. అది నువ్వు తెలుసుకోగలిగినప్పుడు నీ జీవిత విధానం ఆటోమేటిక్‌గా మారిపోతుంది...."

"అయితే మోసానికి స్నేహ ధర్మమంటూ ఉండదు. నువ్వు చెప్పిన రహస్యాలన్నీ దాచడానికి బహుశా నువ్వొక లక్షరూపాయలు నాకు చెల్లించాల్సి ఉంటుంది." అన్నాడు సోమరాజు గంభీరంగా.

"రహస్యాలు దాచినా దాచకపోయినా స్నేహితుడిగా లక్షరూపాయలు నీకివ్వడానికి నేనెప్పుడు సిద్ధమే" అన్నాడు వెంకట్రావు నవ్వుతూ.

సోమరాజు మిత్రుడు నవ్వులో జతకలిపి-"నన్ను నువ్వు సరిగ్గా అర్థం చేసుకోలేదనుకుంటాను." అన్నాడు.

3

"ఛీ. నీముఖం నాకు చూపించకు. నమ్మిన స్నేహితుడికి ఇంత ద్రోహంచేసిన నీలాంటివాడి ముఖం చూస్తేనే పాపం." అంది సావిత్రి.

సోమరాజు ఏమీ మాట్లాడలేదు. అతను తిన్నగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లాడు.

ఇన్‌స్పెక్టర్ మోహన్ అతన్ని చూస్తూనే లేచివచ్చి, "మిమ్మల్నెలా అభినందించాలో నాకు తెలియడంలేదు మిస్టర్ సోమరాజూ! ఈ మధ్యకాలంలో మీకులా ప్రభుత్వానికి సాయపడ్డ యువకుణ్ణి చూడలేదు. మీకు ప్రభుత్వంనుంచి బహుమతి ముట్ట చెబుతుంది...." అన్నాడు.

"సంఘ విద్రోహుల ఆచూకీ నాకు తెలిసినప్పుడు ప్రభు

త్వానికి తెలియజెప్పడం నా బాధ్యత. ఇందులో నేనుచేసిన విశేషమేమీలేదు. నా స్నేహితుడు నన్ను బాగుచేయాలనుకుని తన రహస్యాలు నాకు చెప్పాడు. ఆ సమాచారంతో నాలో మార్పువస్తుందనీ, నేను తన విద్రోహ చర్యలలో అతనికి చేదోడువాదోడుగా ఉంటానని అతనాశించాడు తప్పితే అతన్ని పోలీసులకు పట్టిస్తానని కలలోకూడా ఊహించలేదు. మా స్నేహం అలాంటిది...."

"అందుకే నాకు మీమీద గౌరవం పెరిగింది. అటువంటి స్నేహితు డిచ్చిన అవకాశాన్ని మరొకరెవరైనా ఇంకోలా వినియోగించుకుని ఉండేవారు. మీరు నిరుద్యోగులు కూడా అని తెలిసింది. బహుశా పోలీస్ డిపార్టమెంట్లో ఉద్యోగానికి మీ పేరు రికమెండ్ కావచ్చునని నిన్న కమీషనర్ గారన్నారు."

"థాంక్యూ.... నేను ప్రస్తుతం నా స్నేహితుడు వెంకట్రావుని మీటవ్వాలని వచ్చేను." అన్నాడు సోమరాజు.

మోహన్ నవ్వి అతనికి దారి చూపించాడు.

కటకటాల వెనుక వెంకట్రావుని చూసి సోమరాజు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నామూలంగానేకదా నీకీ అవస్థ ప్రాప్తించింది" అన్నాడు బాధగా.

"ఎందుకురా మొసలి కన్నీళ్ళు? నేనేం అపకారం చేశాన్రా నీకు. నాదారి నీకు నచ్చకపోతే నీ మానాన నువ్వు పోయి, నా మానాన నన్ను బ్రతకనివ్వక పోలీసుల కెందుకు చెప్పావురా? నీమూలంగా నేనేకాదు. నాతో సంబంధమున్న ప్రతి ఒక్కరూ జైలు పాలైపోయారు కదురా!" అన్నాడు వెంకట్రావు.

"నాదారికీ నీదారికీ తేడా తెలిసింది కదా. నువ్వు నడిచే దారిలో ఎన్ని సుఖాలు లభించినా అది చీకటిదారి. అందులోకి

రవంత వెలుగు రాగానే నువ్వు కటకటాల వెనుక ఉన్నావు. నా దారిలో సుఖాలు లేకపోవచ్చు. కానీ ఇది వెలుతురులో ఉంది. ఇక్కడ చీకటిలేదు...." అన్నాడు సోమరాజు.

"చీకటి వెలుగులు మనిషి ఆలోచనలనుబట్టి ఉంటాయి. స్నేహితుడివనినమ్మి నాదారి రహశ్యాలు నీకు చెబితే నన్ను జైలు పాలుచేశావు. ఇదేనా స్నేహధర్మం!" అన్నాడు వెంకట్రావు.

సోమరాజు విషాదంగా నవ్వి-"అదే ఆ స్నేహధర్మమే నన్నీపనికి పురిగొల్పి నిన్ను జైలుపాలు చేసింది. మనిద్దరివీ దారులువేరు. నాదారి సరైనదికాదని నీకుతోచినా నువ్వూరుకోలేదు. నన్ను సరైనదారిలోకి మార్చడం నీ ధర్మంగా భావించావు.

నీగురించి పూర్తి నిజాలు తెలియగానే నీదారి ఏమాత్రమూ సరైనదికాదని నాకు తోచింది. నిన్ను నా దారిలోకి మళ్ళించాలనీ-ఇంకా ఇంకా పతనంకాకుండా కాపాడాలనీ నాకుతోచింది. అందులోనూ నీలో నిజమైన స్నేహితుడిని నేను చూడడం-నువ్వు నాకు నీ అంతరంగిక రహస్యాలు చెప్పడంతోనే జరిగింది.

ఇటువంటి స్నేహితుడిని మంచి మనిషిగా మార్చడం స్నేహితుడిగా నా ధర్మమనిపించింది. అందుకే బాధను నొక్కిపట్టి, పోలీసులకు సమాచారం అందించాను. ఈ జైలు శిక్ష నిన్ను పునీతుణ్ణి చేస్తుందనీ-శిక్ష అనంతరం నువ్వు స్వచ్ఛమైన జీవితం గడపగలవనీ ఆశిస్తున్నాను. అందుకు నానుంచి అవసరమైన సహాయం లభిస్తుంది" అన్నాడు.

నవ్వాలో, ఏడవాలో తెలియక మిత్రుడి ముఖంలోకే చూస్తూ ఉండిపోయాడు వెంకట్రావు. □□□

రాధ తొందరపడింది!

కె. రవీంద్రప్రసాద్

రాధ అప్పుడే కాలేజినుండి వచ్చి, విసురుగా పుస్తకాలు మంచంపైకి విసిరేసింది. తన గదిలో నున్న అద్దం లోకి మొఖాన్ని చూసుకొంది. ఎందుకో ఒక్కసారి ఏడ్పు వచ్చేసింది. మంచంపైబడి వెక్కి-వెక్కి ఏడ్వసాగింది.

ఆ గది నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్దమైన గదిలో ఆ వెక్కిళ్ళు-ఓ వింతరకమైన భయంకరమైన శబ్దాన్ని కలుగ జేస్తున్నది.

రాధ కొద్దిగా తెప్పరిల్లింది. తన ఏడుపు తనకే వెగటును కలిగించినట్లు ఫీలయ్యింది.

ఏదో దృఢనిశ్చయం వచ్చినదానికిమల్లె, గబ గబా లేచింది. ఎటాచ్‌డ్ బాత్‌రూంలోకి వెళ్ళి, షవర్ ఆన్ చేసింది. దానిక్రింద నుంచుంది. గుడ్డలు విప్పదీయకుండానే అలా ఆ చన్నీళ్ళు తుంపరులు తుంపరులుగా పడుతూంటే- ఆ చల్లదనానికి మనసు ఆనందిస్తూంది.

రాధ ఆలోచిస్తూంది.

ఎందుకు....తన్ను అలా చూస్తాడు రోజూ!

నిజం! అతని కళ్ళల్లో ఏదో అపూర్వమైన వింత తేజస్సు వున్నది. ఆ తేజస్సే తనని అతనివైపు మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేటట్లు చేస్తున్నది.

ఎప్పటికప్పుడు అతనివైపు చూడగూడదనుకొంటూనే తను చూస్తుంది.

ఆ చూపులే....ఇవ్వాళ ఎంత అవమానాన్ని కలిగించాయి. ఛీ! చచ్చిపోతే బావుండుననిపించింది.

అసలేం జరిగిందంటే....

రోజులాగానే ఈ రోజు కాలేజీ వదలగానే తనూ, సీత, రమ ముగ్గురూ వస్తున్నారు.

సీతా రమ మెయిన్‌రోడ్డు రాగానే కుడివైపు వెళ్ళారు. తను ఎడమవైపు తిరిగి-ఒక అరఫర్లాంగు వస్తేగానీ తమ ఇల్లు రాదు.

మామూలుగానే ఎడమవైపు తిరిగింది. ఎడమవైపు తిరిగిన పదిగజాలకు ఆ కిళ్ళీకొట్టు ఉంటుంది. అక్కడుంటాడు అతను.

రోజూ తనొచ్చేవేళకు — తను కాలేజీకి వెళ్ళేవేళకు అతను తప్పకుండా, విడవకుండా అక్కడుంటాడు.

తను మామూలుగా తల వంచుకుని వచ్చేస్తుంది. ఎందుకో ఆ రోజు యధాలాపంగా అటు చూసింది.

ఆ నవ్వే కళ్ళు, ఆ తళుక్కుమనిపించే స్వరూపం! అలా చూడాలనిపించింది. కానీ సభ్యత కాదనుకొని వెంటనే తల వంచేసుకుని తను ముందుకు నడుస్తూనే ఉంది.

కానీ మనస్సు ఎందుకో....ఎందుకో....మళ్ళీ చూడా

లనిపించింది. వెనక్కి చూసింది. అతనూ తనవంకే చూస్తు న్నాడు. అంతే! గుండె గుభేలుమంది. గబగబా వచ్చేసింది. కానీ ఇంటికి వచ్చిన తర్వాతగూడా గుండె దడ తగ్గలేదు.

ఆ మర్నాటినుండి—అతను అక్కడ! తప్పకుండా ప్రత్యక్షం!

అయితే తను అతన్ని సూటిగా చూడ్డం మానేసింది. అతను అంత దూరంగా ఉన్నప్పుడే చూట్టం—తీరా దగ్గరకు రాగానే చూడనట్లు నటించటం చేయసాగింది.

కానీ!

మా ఇద్దరిమధ్యా ఎందుకీ ఆకర్షణ! ఈ ప్రశ్న లక్షసార్లు ఈ బుర్రలోకి వచ్చింది. అంతుపట్టని ఆల్జీబ్రా ప్రాబ్లమ్ వదిలేసినట్లు వదిలేసింది- జవాబుకై బుర్ర బద్దలు కొట్టు కోవటం ఇష్టంలేక.

ఈ రోజు సంఘటన!

అతను అలాగే నుంచున్నాడు.

ఈ రోజు మరో నల్గురు కుర్రాళ్ళు-నుంచున్నారు. తను ఆ సందులోకి తిరిగిన దగ్గరనుండీ వాళ్ళను గమనిస్తూనే వున్నది. ఏవేవో వెకిలిగా గొంతులు బిగ్గరగా మాట్లాడు కొంటున్నట్లు కన్పడింది. అతను- మామూలుగా దూరంగా నుంచున్నాడు.... అతన్ని తను గమనిస్తూనే వున్నది.

కానీ షడన్‌గా తను దగ్గరయ్యేకొద్దీ.... వాళ్ళ మాటలు తన కర్ణాలకుగూడా సోకటం మొదలెట్టాయి.

"బాగుందిరా పిట్ట...."

"రేటెంతో...."

"ఈమధ్య కాలేజీ అమ్మాయిలకు ఈ వ్యాపారం బావుం దటరా...."

"దేనికి రోష్...."

"టాయ్‌లెట్లకు, సెంట్లకు, చీరలకూ...."

"షటప్! ఇంతకీ అటువంటి సరుకేనా?"

"మర్లా చదువుతున్నారు బి. ఎ.లు....ఆ మాత్రం కన్పెట్ట లేనా?"

"ఎలా కన్పెడతావ్....అదే సరుకని."

"ఆ దొంగ చూపులు....చూడరా...."

అంతే!

అతను! ఆ కరెంటు ఆ విద్యుత్తు....

ఒక్కసారిగా ఆ నల్గురిమీదకీ దూకాడు. వరసపెట్టి అందర్నీ పెటపెటా వాయించసాగాడు.

ఈ హఠాత్పరిణామానికి ఆ నల్గురూ మొదట దిమ్మెర పోయారు. తర్వాతే జరిగింది ఘోరం!

ఆ నల్గురూ కలసి అతనిమీద పడ్డారు. ఆ నల్గురూ, ఆ వెధవలు, ఆ రౌడీలూ, ఆ గుండెలేనివాళ్లు, ఆ కసాయివాళ్ళు అతన్ని నిర్దాక్షిణ్యంగా కొట్టసాగారు.

అక్కడ జనం ఎక్కువ లేరు.

ఆ నల్గురిదే రాజ్యమైంది, అతనే శత్రువయ్యాడు.

కొడ్తున్నారు....కొడ్తున్నారు....

అతను పడిపోయాడు. వంటినిండా దెబ్బలతో, రక్తం చిమ్ముతూ అలా పడిపోయాడు.

తన హృదయం ద్రవించింది.

అతనిదగ్గరకుపోయి—అతన్ని తన వడిలోకి తీసుకుని, గట్టిగా హత్తుకుని, ఆ గాయాలకు మందు రాసి ఉపశమనం కల్గించాలనిపించింది.

కానీ—తను కన్నె!

అతను ఎవరో—

అందుకే అలా నుంచుండిపోయింది, భగవంతుడ్ని ప్రార్థిస్తూ.

ఆ నల్గురూ అంటున్నారు....

"పెద్ద మొగాడు అనుకొంటున్నాడేమో!"

"వెధవ! తిక్క కుదిరింది."

"రాస్కెల్, పోజుకొడ్తామనుకొన్నాడు."

"అది చూడు ఎలా నిలబడిపోయిందో?"

"వీళ్ళిద్దరికీ ఏదో సంబంధం ఉందిరోయ్...."

ఛీ....ఛీ....వాళ్ళేం మాట్లాడుతున్నారో....అతను అలా నేలకు కరుచుకుని వుండిపోయాడు. తనకేం తోచలేదు. ఆ కిల్లీకొట్టు అతనే పాపం....అతన్ని రిక్షాలో ఎక్కించి, తన దగ్గర సైకిళ్ళు బాగుచేసే కుర్రాడిని కూడా ఎక్కించి పంపించాడు.

ఆ నల్గురూ విజయగర్వంగా తనవంకే చూస్తున్నారు.

అంతే!

తనకు ఎక్కడలేని ఏడుపూ వచ్చింది.

పరిగెత్తుకొచ్చి ప్రక్కమీద పడి ఏడ్చింది.

కానీ ఎందుకేడవాలి తను?

2

"అమ్మాయీ! రాధా!" అంటూ పిల్చారు, రాధ తల్లి సుగుణమ్మగారు.

బాత్రూంనుండే "వస్తున్నానే. స్నానం చేస్తున్నా!" అని అరచి, గబగబా స్నానంచేసి, టవల్ చుట్టుకుని తన రూంలోకి వచ్చింది.

గబగబా లంగా, బ్రా, వోణీ జాకెట్టు వేసుకొని, తలకు

గుడ్డ చుట్టుకొని క్రిందకు త్వర త్వరగా వచ్చింది.

సుగుణమ్మగారు వేడివేడి సోమాసాలు, టీ అమర్చి పెట్టింది డైనింగ్ టేబులుమీద. అవి తిని, వేడి టీ త్రాగిం తర్వాత హాయిగా అన్పించింది. తిరిగి మేడపైకి ఎక్కి తన రూంలోకి వెళ్ళి ఈజీచైర్‌లో కూర్చుంది.

ఎందుకో! అతనే పదే పదే జ్ఞాపకం వస్తున్నాడు. బాగా దెబ్బలు తగిలాయి కామోసు! రక్తంకూడా వచ్చింది. స్పృహకూడా లేదు. పాపం! తనకోసం కదా—అతను అలా ఆ నల్గురి దుర్మార్గులమీదకూ పోయిందీ?

ఇంతకీ ఎవరతను?

ఏం చేస్తుంటాడు?

నిజం! అతను నన్ను ప్రేమిస్తున్నాడేమో!

ఐతే తను అతన్ని ప్రేమిస్తున్నదా?

అందం ఉంది, ఆకర్షణ ఉంది, నిజాయితీ ఉంది. కానీ అతను ఏం చేస్తున్నాడో? ఏం చదివాడో?

తన కలల పురుషుడు ఇతడే!

అయితే చదువూ, సంధ్యా లేకుండా—అలా అందం, ఆకర్షణ ఉంటేనే తను అతన్ని చేపట్టజాలదు.

అతను తనను పోషించగలగాలి....తనని రక్షించ గలగాలి.

ఇప్పుడు హాస్పటల్లో ఉంటాడు కామోసు!

ఇలా రాధ ఆలోచనలు పరిపరి విధాలుగా, రకరకాలుగా ఆలోచిస్తున్నది. మనస్సంతా అతనిమీదే కేంద్రీకరించి యున్నది. కన్ను మూపినా కన్ను తెరిచినా అతనే! కుమ్మరి పురుగులా తొలుస్తున్నాడు ఆమె మనస్సుని.

చివరికి తల వేడి ఎక్కింది.

వెంటనే క్రిందకి దిగివచ్చింది. విసుగ్గావుంది. కోపంగా ఉంది. ఏదో అన్ఈజీగా ఉంది.

"ఏమిటే తల్లీ! అలా ఉన్నావ్?" అన్నారు సుగుణమ్మ గారు.

"ఏంలేదు...." అని విసుక్కుని డ్రాయింగ్‌రూంలోకి వెళ్ళింది. అది వాళ్ళ డ్రాయింగ్ రూం. అక్కడ అపన నుండి అన్ని దేశాల పత్రికలూ, రకరకాల పుస్తకాలు ఉంటాయి.

రాధకు రిలీఫ్ కావాలంటే 'అపనే' చదువుతుంది.

అపన తీసి, 'వసుంధర'గారి నవల చదవసాగింది. అందు లోనూ—ప్రేమ వ్యవహారం—హత్యలు....అవే కన్పడే సరికి మరీ భయం అన్పించింది. అపన పత్రిక తీసి కురు మద్దాలి విజయలక్ష్మిగారి కథ చదవసాగింది. అయినా మన స్సంతా, అతనిమీదే.

ఇప్పుడు ఎలా వున్నాడో ఏమో!

రాధ ఒక్కగానొక్క కూతురు రాజారావుగారికి. ఆయన కాంట్రాక్టరు. లక్షలు ఆర్జించాడు. రాధ చాలా అందంగా ఉంటుంది. ఎలా ఉంటుందంటే ఎర్రగా ఉంటుంది. అయి దడుగుల రెండంగుళాలుంటుంది. మొఖంలో అమాయకత ఉంటుంది. ఎర్రని పెదాలతో బుల్లి నోరు, పెద్ద కళ్ళు, చూడంగానే మరోమారు, ఇంకోమారు చూడాలన్పించే అందం రాధది.

రాధకు డ్రస్సులు బోలెడు. రాధ సహజంగా మోజు పోదు. కానీ సుగుణమ్మగారే ఒక్కగా నొక్క కూతురని తనకు కన్పడిందల్లా, తోచిందల్లా కొనేసి తెచ్చి, రాధకు కట్టబెడ్తుంది.

రాధ బెల్స్‌కూడా వేస్తుంది.
రాధ బెల్లులో చాలా బావుంటుంది.

అటువంటి రాధను వరించని మొగవాడు దురదృష్ట వంతుడే.

అతను రాధకు నచ్చాడు.
కానీ అతనెవరో రాధకు తెలియదు.
తనకోసం అతను ఎందుకు అలా చిత్తుగా దెబ్బలు తిన్నాడు? ఎందుకోసం?
రాధకు సడన్‌గా 'సినిమా'లు గుర్తుకొచ్చాయి.
యస్!

ఆ నల్గురూ వాళ్ళ వాళ్ళే. అతను ఆ నల్గురినీ తనమీద అసహ్యంగా మాట్లాడిపించి, తిరిగి తను హీరో ఐనట్లు వాళ్ళను కొట్టి, తనముందు పోజు కొట్టాలి. కానీ ఇదో రక మేమో! తాను దెబ్బలు తిన్నట్లు, తలకు రక్తం ఎలాగో పూయించుకొని—పూయించుకునే బాపతేమో!

ఏమో! ఈ కాలంలో ఎవర్నీ నమ్మటానికి వీలులేదు.
ప్రతిదీ మోసం, దగా.
ప్రేమలో కూడా కత్తీ!
ఛీ....ఛీ....

ఇంతకీ అతను నిజంగా దెబ్బలు తిన్నాడా? లేక అలా నాటకం ఆడించి—తాను క్రింద పడిపోయి తన సాను భూతిని ఎదురుచూస్తున్నాడా?

'ఏమో! రేపు సీతకు, రమకూ ఈ విషయం చెప్పి సంగతి తెల్సుకోవాలి' అని నిర్ణయించుకొని అపన కథ చదవటంలో మునిగిపోయింది.

3

"నిజమా!" అడిగారు యిద్దరూ ఒకేసారి రాధను.

"నిజం!" అంది రాధ.

"అయితే ఇన్నాళ్ళూ ఎందుకు చెప్పలేదీ నిజాన్ని...." నిలదీశారు సీత, రమ.

"ఇందులో చెప్పేదేముందీ? అతను రోజూ నన్ను చూస్తుంటాడు. నాకూ అతన్నే చూడాలనిపిస్తుంటుంది. కానీ చూడలేను. కానీ ఈ రోజు...." అంది రాధ.

"ఏ హాస్పిటల్లో వున్నాడో పాపం....!" అంది జాలిగా సీత.

"అది నిజమో, అబద్ధమో....రాధ అన్నట్లు వాడే ఆ నల్గుర్నీ పిలిచి, తన్ని కొట్టమని చెప్పి, తాను పడిపోయి, రాధ సానుభూతిని, తద్వారా ప్రేమనూ పొందాలనుకొన్నాడేమో!" అంది సీత.

"వీడేం హీరోనే....ఆ నల్గుర్నీ చితకదన్ని, ఛాతీ విప్ప దీసుకొని, నేను నిన్ను క్షమించాను రాధా! ఇక ఈ దుండగులు నిన్నేం చేయలేరు. వీరేకాదు....ఈ లోకంలో మరో మగపురుగు నిన్నేం చేయలేదు....రా....నా హృదయంలో వుంచేస్తా అనాలిగానీ...." అంది రమ.

"ఛా....వూరుకోండి. అసలు విషయం చెప్పాను. అతను ఎటువంటివాడు? ఏమిటీ? అని తెల్సుకోకుండా వూరికే జూయాలజీ లెక్చరరు వాగినట్లు వాగుతారే" అంది రాధ.

"అమ్మా రాధమ్మతల్లీ! ఇది నీ సమస్య. నీకు కాబోయే దొరబాబుగారి సమస్య. అయినా వాడేం మొగాడే. పట్టుమని నల్గుర్ని తన్నలేని వెధవ...." అంది రమ.

"ఛీ—నోరు ముయ్యవే. నీవేదో 'జూడో' నేర్చుకొంటున్నావనీ ...పోజులు కొట్టకు" అంది సీత.

వీళ్ళు బోరు కొడ్తుండేసరికి రాధ విసుగ్గా "ఇప్పుడేం చేద్దామ్రా!" అంది.

"చేసేదేముందీ! వాడు ఇంతకీ ఏ హాస్పటల్లో వున్నాడో కనుక్కుందా...."

"ఎట్లా...."

"ఫోన్లు చేద్దాం...."

"సరే. చెయ్యండి...." అంది రాధ.

సీత, రమ-మొగ గొంతులు మార్చి-వర్సగా గవర్నమెంటు హాస్పటల్, ప్రయివేటు హాస్పటల్....అన్నీ ఫోను చేశారు.

ఆ హాస్పటల్స్‌నుండి నిన్న సాయంకాలం దెబ్బలుతిన్న కుర్రాడెవరూ రాలేదని కబురు వచ్చింది.

రమ సీరియస్‌గా 'మెటర్నిటీ హాస్పటల్'కు రింగ్ చేయసాగింది.

సీత....గట్టిగా...."జోకులకు ఇది తావుకాదు. కర్తవ్యం ఆలోచించండి" అని అరిచింది.

రమ మామూలుగా...."వాడు దొంగేనే," అంది.

"ష్! రమా-ఇది సీరియస్ వ్యవహారం. చూడు రాధ ఎంత బాధ పడ్తుందో, నీకు ఇది చాలా నవ్వులాటిగా ఉంది. అసలు నీకు లవ్ అంటే ఏమిటో తెలియదు."

"సీరియస్‌గా ఆలోచించు రమా! నీకేమయినా అయిడియా తట్తే చెప్పు. అతన్ని ఎలా కనిపెట్టటం."

"అయితే ఓపని చేద్దాం. ఆ కిళ్ళీ కొట్టువాడ్ని అడిగితే."

"వండ్రఫుల్ రమా! నీ బుర్ర ఎక్సరే తీయించి-వీధి

గుమ్మానికి వ్రేలాడతీయాలి....పద....వాడ్ని అడుగుదాం" అంది సీత.

"ఓకేనా....రాధా...." అంది రమ.

4

కిళ్లీకొట్టు బోసిగా ఉంది. అతనులేడు అక్కడ. ఆ నల్గురూ లేరు.

రాధకు నిజంగా అనుమానమేసింది. అతను ఆడింది నాటకమేమోనని.

ముగ్గురూ కిళ్ళీకొట్టు దగ్గరకు వెళ్లారు.

వాడు సంభ్రమంగా వీళ్ళవంక చూశాడు. రూపాయి చాక్లెట్స్ కొని...."నిన్న ఇక్కడ ఒక్కళ్ళని కొట్టారు.... అతన్ని ఏ హాస్పటల్లో జేర్చావూ" అని అడిగింది రమ.

వాడు ఎందు కన్నట్లు చూశాడు.

"ఏంలేదు. ఆ నల్గురూ మా రాధమీద అసహ్యంగా మాట్లాడారు. తను పోలీసు కంప్లయింట్ ఇద్దామనుకొంటున్నది. అతను ఏ హాస్పటల్లో వున్నాడో తెలిస్తే-అతనికి ఆ నలుగురూ తెలిస్తే వారి వివరాలుగూడా పోలీసులకు తెలియజేయాలి" అంది రమ గడుసుగా.

అతనికి రాధ తెలుసు. పెద్ద కంట్రాక్టరుగారి అమ్మాయనీ, ఒక్కతే కూతురని. తను పట్టుపట్టితే నిన్నటి నల్గురూ ఊళ్ళో కూడా ఉండరని.

"నిన్న అతన్ని రిక్షా ఎక్కించి ఎక్కడకు పంపావ్?" అంది సీత.

అతను చెప్పసాగాడు.

"ఆ బాబు అలా స్పృహతప్పి పడిపోగానే, నేనూ మా కుర్రోడు ఆ బాబును రిక్షా ఎక్కించి, హాస్పటల్‌కు తీసుకు

పొమ్మని మా కుఱ్ఱాడ్నిచ్చి పంపాను. కొద్దిదూరం పోయిం తర్వాత ఆ బాబుకు స్పృహ వచ్చిందట. ఏం జరిగిందీ అన్నాట్ట. మావోడు అన్నీ చెప్పేశాట్ట. తనకు ఎక్కువ దెబ్బలు తగలలేదనీ, ఇక నువ్వెళ్ళమనీ-రిక్షా ఆపి, మా కుఱ్ఱోడ్ని తిరిగి వెనక్కి పంపేశాడు. ఆయన మరి ఎక్కడికి వెళ్ళాడో తెలియదు...." అని చెప్పాడు.

రాధ, సీత, రమ ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు.

"ఆ నల్గుర్నీ నువ్వు గుర్తుపట్టగలవా?" అంది రమ, రాధను....

"ఆ...." అంది రాధ.

"ఆ నల్గురూ రోజూ ఇక్కడకు వస్తుంటారా?" అంది రమ.

"రారు" అన్నాడు కొట్టువాడు.

"ఎందుకురారు?" అంది రమ తిరిగి.

ఈ ప్రశ్నకు తల గోక్కున్నాడు వాడు, "నిన్ననే వచ్చారమ్మా వాళ్ళు. అంతకు ముందెప్పుడూ రాలేదు. ఆ బాబు రోజూ వస్తాడు."

"అతనెవరు?"

"తెలియదమ్మా!"

"రోజూ వస్తాడా?"

"ఆ...."

"ఎందుకు."

"రోజూ ఉదయం ఒక ఓత్రీఫైవ్స్. సాయింత్రం ఒక త్రీ ఫైవ్స్ ప్యాకెట్టు కొనుక్కొని, ఓ అరగంట ఉండి వెళ్ళిపోతారమ్మా!"

"ఉదయం ఎన్ని గంటలకి వస్తాడు."

"తొమ్మిదిన్నరకు."

"ఎన్నింటిదాకా ఉంటాడు."

"పదింటిదాకా."

"సాయంత్రం ఎన్నింటికి వస్తాడు?"

"నాల్గున్నరకు."

"ఎన్నింటిదాకా ఉంటాడు."

"ఐదున్నర....ఆరింటిదాకా ఉంటాడు."

"రోజూ సిగిరెట్లు కొంటున్నాడంటే....పొగబోతు.... అయ్యుండాలే....రాధా" అంది రమ దీర్ఘమైన ఇంటర్వ్యూ తీసుకొని.

"ఇక పోదామా అంది...." విసుగ్గా రాధ.

"అసలు పాయింటుకు వద్దాం!"

"అతని ఇల్లు దగ్గర్లోనే ఉండాలి."

"ఎలా!"

"ఈ కొట్టు అతని ఇంటికి దగ్గర్లో ఉండాలి. అందుకే ఇక్కడకు వచ్చి కొనుక్కొని పోతుంటాడు" అంది రమ.

"నీ డిటెక్షన్ బాగానే ఉంది కానీ....పదండి పోదాం" అంది సీత.

రాధ బయలుదేరింది.

5

రాధ ఇంట్లో ముగ్గురూ 'టీ' తాగి తిరిగి చర్చించడం మొదలుపెట్టారు. అతనెవరు? ఆ నల్గురెవ్వరు?

"రాధా నిజంగా అతన్ని ప్రేమిస్తున్నావా?" అంది రమ.

"లేదు...." అంది రాధ సీరియస్‌గా.

"మరి అయితే అతన్ని గురించి నీకెందుకే ఎంక్వయిరీలు?"

"అతను ఎటువంటివాడని. నాకోసం రోజూ వచ్చి అక్కడ ఉదయం, సాయింత్రం నుంచోట మెందుకు? నుంచున్నాడే పో.... నన్ను అలా చూట్టమెందుకు.... చూశాడో పో.... ఇలా నాటకమాట్ట మెందుకు?"

"ఇది నాటకమని నీవెలా నిరూపించగలవ్?" అంది సీత.

"అతనే కావాలని చేసి ఉండొచ్చు."

"మరి ఆతను రావాలిగా...."

"వస్తాడు నాల్గయిదు రోజులకు."

"ఇదేం హీరోనే బాబూ! అందరూ నల్గుర్నీ తన్నేసి ఫోజు పెడ్తే. వీడు తన్నించుకొని హీరోనంటాడు" అంది రమ.

"కొంతమంది వ్యక్తులుంటారు. వారికి సానుభూతి ఇష్టం. ఇతరులు వారిని చూసి జాలిపడటం ఇష్టం. అతనూ అటువంటివాడేనని నా నమ్మకం" అంది సీత.

"నీ స్టేటుమెంటు ఇక ఆపు. ఇప్పుడేం చేద్దాం" అంది రమ.

"చూద్దాం! రాధ నాల్గురోజుల్లో వాడు తిరిగి ప్రత్యక్ష మౌతాడుగా" అంది సీత.

"కాకపోతే!" అంది రమ.

"అప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు అప్పుడు తీసుకుందాం."

"ఇంతకీ ఆ నల్గుర్నీ ఎలా కనిపెట్టడం."

"చూద్దాం ఈ టౌనులో కనబడకుండా పోతారా?"

"అయినా! రాధా! నా కెందుకో అనుమానమోయి! నీవు అతన్ని ప్రేమిస్తున్నావేమోనని" అంది రమ.

రాధ సీరియస్‌గా "ప్రేమిస్తే ప్రేమిస్తా! అదంతా నీ కనవసరం నీకు చెప్పిన పని నీవు చేయి. ఆ నల్గురూ ఎవ్వరు? అతనెవ్వడు - తెలుసుకోవటం - నీపనీ-సీతపనీ" అంది రాధ.

"అంటే మేం డిటెక్టివ్ లంటావా?" అంది సీత.

"యస్! రమ డిటెక్టివ్-నీవు అసిస్టెంట్ - మీ ఇద్దరూ కలిసి-ఈ 'ఆగంతకుడ్ని' పట్టుకోవాలి" అంది రాధ.

"ఓహ్! నేను డిటెక్టివ్‌ని....ఒసేయ్ సీతా. నువ్వు నా అసిస్టెంటువే. ఇక నేను చెప్పినట్లు నీవు వినాలే" అంది రమ.

సీత ఉడుక్కుంది....

రాధ సీరియస్‌గా "ఇక కార్యరంగంలోకి దూకండి!" అంది.

రమ బుర్ర గోక్కొని "ఆ నల్గుర్నీ మేం చూడలేదు. ఆ హీరోగార్ని మేం చూడలేదు. ఎలా కనిపెట్టటం. నీవు చెప్పిన గుర్తులుబట్టి ప్రతి మొగవాడ్నీ అలా తేరిపార చూశామా! అంతే....నల్గురు కలిసి మమ్మల్ని ఎత్తుకుపోయి రేప్‌చేసి పారేస్తారు...." అంది.

"అయితే ఏమిటీ చేయటం?" అంది రాధ.

"నీవూ మాతో ఉండాలి. వాడు యాదృచ్ఛికంగానో, యాంత్రికంగానో ఎక్కడో ఓచోట తగలకమానడు. అంత వరకూ వోపిక పట్టాలి" అంది రమ.

"అలా ఎందుకు. రేపు ఎగ్జిబిషన్‌కు పోదాం. సాధారణంగా ఎగ్జిబిషన్‌లకు పెళ్ళికాని వెధవాయిలు, పనిలేని వెధవలూ చిలిపిపనులకు వస్తుంటారు. అందులో ఆ దుష్ట పంచకం ఉండకపోతుందా?" అంది సీత.

"ఓ బ్రిలియంట్ అయిడియా! రేపు సాయంత్రం ఐదు గంటలకు మనం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉండాలి. రెడీకండి" అంది రమ.

"ఓకే" అంది రాధ.

6

ఎగ్జిబిషన్ కోలాహలంగా వున్నది. ప్రతి స్టాలూ ముందు విపరీతంగా ఆడా మొగా వస్తువులను విరగబడి చూస్తూ వున్నారు.

రాధ, రమ, సీత వరుసగా ఒక్కో స్టాలూ చూసు కొంటూ మొగ పురుగులను దులుపుకొంటూ వస్తున్నారు. ఆ ముగ్గురూ జెయింట్ వీలు దగ్గరకు వచ్చారు. వీలు తిరుగు తూంది.

రాధ ఒక్కసారి "ఒసేయ్!" అని అరిచింది.

రమ, సీత ఒక్కసారి ఉలిక్కిపడి "ఏం!" అన్నారు.

"ఆ తిరుగుతున్న వీల్లో....ఆ నలుగుర్లో ఒకడున్నాడే" అంది రాధ.

రమ సీరియస్‌గా, ఉత్సాహంగా "ఎవడు వాడు చెప్పు నరికేసి పోగులుపెట్టి అమ్ముకుందాం" అంది.

రాధ చూపిస్తుంది....వీలు తిరుగుతూంది.

రమకూ, సీతకూ వాడెవడో తెలియటం లేదు ... వీలు ఆగింది. అప్పుడు చూపింది అతన్ని!

రమ "అతనా!" అంటూ ఆశ్చర్యపోయింది. రమ మొఖం నల్లబడిపోయింది.

సీత సీరియస్‌గా "అతను మీ బావ కాదుకదా!" అంది.

రాధ "చెప్పలేమే! వాడు వెళ్ళిపోతున్నాడు ఎవడే

వాడు....నీకు తెలుసా? ఆ నల్గురులో ఒకడు వీడు...." అంది.

"య్యా!" అంది రమ.

"నిజం!"

"నిజం!"

"అయితే అతను మా కజిన్ బ్రదర్!"

"అంటే?"

"పెద్దమ్మ కొడుకు!"

"ఉత్త బ్రూట్ అన్నమాట...."

"మంచివాడే, అయినా నీ కేసు నాకు వదిలేయ్. నీ రాకుమారుణ్ణి నేను పట్టాగా...." అంది రమ.

ముగ్గురూ మౌనంగా ఇళ్ళకు బయలుదేరారు.

7

"ఏం చెప్పాడు మీ అన్న!" అంది సీత.

"వాడు నిజం చెప్పాడు." అంది రమ.

"ఏమని?" రాధ అడిగింది.

"నీ హీరో నిజంగా హీరోయేనట. మెడిసిన్ చదువుతున్నాట్ట! నీవు నా స్నేహితురాలివి అని తెలియక-మా కజిన్ బ్రదర్, వాడి మిత్రులూ నీమీద ఆశలు పెంచుకున్నార్ట! అయితే నీ హీరో నిన్ను అంత విపరీతంగా ఆరాధించటం చూశ్ళేక-ఈ కోతి మొఖాల్ని నీవు ప్రేమించవని తెలిసే, అతన్ని కావాలని నీముందు చితక్కొట్టారట!"

"ఆ!" అంది రాధ.

"సారీ రాధా! మా కజిన్ ఇటువంటి వెధవైనందుకు నేను బాధపడుతున్నాను. వాడికి చదువూ సంధ్యా అబ్బలేదు. ఊరు ఊరూ జులాయిలా తిరుగుతుంటాడు రోజూ! వాడు

ఒక్కడే కొడుకు పెద్దమ్మకు. అందుకని అతన్నేం అనరు. వాడికి తగ్గట్టి ఆ వెధవలు స్నేహితులుగా చేరారు" అంది రమ.

"ఇప్పుడేం చేద్దాం!" అంది సీత.

"అతనెక్కడున్నాడో" నీరసంగా అంది రాధ.

"అతనిపేరు రవీన్. ఫైనల్ చదువుతున్నాట్ట. వాళ్ళ ఫాదర్‌ది ఈ వూరుకాదు. అతను ఇక్కడే ఎక్కడో రూం తీసుకొని ఉన్నాట్ట" అంది రమ.

"ఈ విషయాన్నీ నీకెట్లా తెలుసు!" అంది సీత.

"ఆ వెధవని పట్టుకొని నాల్గు దులిపేసరికి అన్నీ బయటపడ్డాయి" అంది రమ.

"మరి. అతను....ఇప్పుడు....ఎక్కడ ...ఎలా కలుసుకోవటం" అంది రాధ బేలగా.

రాధ హృదయంనిండా అతనే! అతన్ని ఎప్పుడెప్పుడు కలుసుకోవాలా అని మహాఆతృత పడుతూ వున్నది.

"చూద్దాం! అతని కాలేజీలో విచారిద్దాం" అంది రమ.

"అతని రూం మీ బ్రదర్‌కి తెలియదా."

"తెలియదట!" అంది రమ.

వెంటనే ముగ్గురూ మెడికల్ కాలేజీకి వెళ్లారు. ఫైనల్‌లో రాధకు తెలిసిన జ్యోతిర్మయి ఉంటే ఆమెను అతన్ని గురించి అడిగారు.

"అరె. రవీన్! నాల్గురోజులనుండీ రావటంలేదు. ఊళ్ళో వున్నాడో లేదో....హియీజ్ వెరీ బ్రిలియంట్ బాయ్" అంటూ అతని కబుర్లు బోలెడు చెప్పింది జ్యోతిర్మయి.

దాంతో రాధ హృదయం రవీన్ వైపోయింది. అయితే

ఇప్పుడతడెక్కడున్నట్లు! ఏమైనట్లు? వున్నట్లా? లేక....

రాధ, రమ, సీత అక్కడ వీడ్కోలు తీసుకొని-తమ వీధి వీధి అంతా వెతికారు.

ఉహూ. లాభం లేకపోయింది.

రాధకు బెంగ పట్టుకొంది. ఏ హాస్పటల్‌కూ వెళ్ళలేదు. కాలేజీకీ వెళ్ళలేదు. మరి మనిషి ఏమైనట్లు? ఓవేళ....వూరు పోలేదుకదా? అంత దెబ్బలతో మనిషి ఎలా వెళ్తాడూ?

8

మర్నాడు రాధకు జ్వరం తగులుకొంది.

రాధ తల్లి సుగుణమ్మగారూ, తండ్రీ ఒకటే కంగారు పడ్తున్నారు. రమ, సీత....భయపడ్తున్నారు, రాధ ఏమై పోతుందో అని.

రాధ కలవరిస్తున్నది. "రవీన్! రవీన్!"

ఇక....రమ, సీత, రాధ తండ్రికీ, తల్లికీ పూర్తి అంతా చెప్పేశారు.

అంతే! రాజారావుగారు ఉగ్రుడై పోయి. రమతో "ఊ పద ముందు కారెక్కు" అని ఆజ్ఞాపించారు.

రమ బిత్తరపోయి, అతనితో కారెక్కింది. కారు రమ పెద్దమ్మగారి ఇంటిముందు ఆగింది.

రాజారావుగారు లోపలకి వెళ్ళి, రాధ కజిన్ బ్రదర్ చొక్కా పుచ్చుకొని తీసుకువచ్చి కారులో ఎక్కించారు. తిరిగి సరాసరి ముగ్గురి ఇళ్ళకుపోయి మరో ముగ్గుర్ని ఎక్కించుకొని-పోలీసు స్టేషన్‌కుపోయి-ఆ నల్గుర్ని అక్కడ వొప్పచెప్పారు.

ఇన్‌స్పెక్టర్ కృష్ణశాస్త్రి, ఆ నల్గుర్ని అరెస్టుచేసి, నాల్గు దెబ్బలు వాయించారు. దానితో ఆ నల్గురూ తమ తప్పు

ఒప్పుకొని రవీన్ అడ్రస్సు చెప్పారు.

అంతే! ఇన్‌స్పెక్టర్ కృష్ణశాస్త్రి, రాజారావుగారూ, రమ ఆ అడ్రస్సు తీసుకొని అక్కడకు వెళ్ళారు.

ఇంటికి తాళం! ప్రత్యక్షం!

జీవితంలో ఎన్నడూ ఎప్పుడూ ఫీలుగాని నిరాశను పొందారు రాజారావుగారు. తన ఒక్కగానొక్క కూతురు రాధ కోర్కెను తను తీర్చలేకపోవటమా! ఇన్‌సల్ట్!

ఇంటివార్ని అడిగారు....

"ఏదో యాక్సిడెంట్ అయ్యిందనీ, ఓరోజు దెబ్బలతో ఇంటికివచ్చి, ఆరాత్రే తమవూరు వెళ్తున్నానని వెళ్ళాడు" అని చెప్పారు.

"అడ్రస్సు."

"తెలియదు."

అక్కడే కూలబడిపోయారు రాజారావుగారు, రాధను ఎలా బ్రతికించుకోవడం! రాధ చావు బ్రతుకుల్లో వున్నది. రాధ పూర్తిగా అప్‌సెట్ అయ్యింది. ఇప్పుడేం చేయాలీ?

ఇన్‌స్పెక్టర్ కృష్ణశాస్త్రి-అర్జంటుగా ఎక్కడికో వెళ్ళిపోయారు.

9

"అమ్మా, రాధా! నీ రవీన్ వచ్చాడమ్మా! కళ్ళు తెరు" అంటూ దీనంగా రాజారావుగారూ, సుగుణమ్మ, రమ, సీత అనసాగారు,

మెల్లిగా కళ్ళు తెరిచింది.

ఎదురుగా రవీన్!

తను ప్రేమించిన పురుషుడు.

తనని ప్రేమించిన పురుషుడు.

తలకి కట్టుతో, చేతులకి ప్లాస్టర్‌తో తన రవీన్!

"రవీన్!" అంది మెల్లిగా.

"రాధా....!" అంటూ రాధ ప్రక్కన కూర్చున్నాడు రవీన్!

రాజారావుగారికీ, సుగుణమ్మగారికీ, రమకూ, సీతకూ ఆనందానికి అవధులు లేవు.

ఇన్‌స్పెక్టర్ కృష్ణశాస్త్రి అక్కడే వున్నాడు.

రాధ క్రమేపీ పూర్తి స్పృహలోకి వచ్చింది. చుట్టూ చూపింది. తల్లీ, తండ్రీ, తన స్నేహితురాండ్రూ—తన ప్రియుడు రవీన్—ఇన్‌స్పెక్టర్ కృష్ణశాస్త్రి, ఫ్యామిలీ డాక్టర్ ప్రసాద్.

వెంటనే సిగ్గుతో తల వంచుకొంది. రవీన్ నవ్వి రాధ తల సవరిస్తూ—"నన్ను అంతగా ప్రేమించావా రాధా...." అన్నాడు ప్రేమగా.

రాధ మొఖం దోసిట్లో కప్పుకొంది.

అందరూ నవ్వి "సమయానికి రవీన్‌ని మీరు ఇక్కడ ఉంచకపోయినట్లయితే—రాధ మనకు దక్కక పోయేది సార్. ఎలా సాధించారు ఇన్‌స్పెక్టర్" అని అడిగారు డాక్టర్ ప్రసాద్.

ఇన్‌స్పెక్టర్ నవ్వి "సమయస్ఫూర్తి" అన్నాడు.

"సింపుల్! కాలేజీకి పరిగెత్తాను. రికార్డు చూశాను, అడ్రస్సు దొరికింది. టెలిఫోన్ డైరెక్టరీ తీశాను. ట్రంక్ చేశాను. రాధకోసం అలాగే పరితపిస్తున్న రవీన్ వెంటనే ఆఘమేఘాలమీద టాక్సీలో రాధ ముందు నాల్గు గంటల్లో నాల్గొందలమైళ్ళనుండి దుమికి రాధను రక్షించుకొన్నాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణశాస్త్రి.

"రవీన్ ఎందుకు ఆ వూరు వెళ్ళినట్లు?" అడిగారు సీత, రమ తన స్నేహితురాల్కి కష్టం కలిగించేటట్లు ప్రవర్తించిన రవీన్‌మీద కోపంతో.

రవీన్ నవ్వి "ఈ వూర్లో ప్రతి డాక్టరూ, ప్రతి హాస్పటల్ నాకు తెలుసు. ఎవరిచేతో తన్నించుకొని ట్రీట్ మెంట్‌కి పోతే బావుండదని—ఫస్టు ఎయిడ్ చేసుకొని—వారంలో తిరిగివచ్చి—రాజారావుగారితో మాట్లాడుదామనుకునేంతలో...." అంటుండగా....

"రాధ తొందరపడింది...." అని ఫక్కున నవ్వేరు సీత, రమ.

అందరూ ఆ నవ్వులో శృతి కలిపారు.

రవీన్ రాధలు సిగ్గుపడ్డారు. □□□

"స్వర్గానికి మార్గం?"

ఒక సన్యాసి రైల్వే స్టేషన్ ఎక్కడో తెలియక ఒక కుర్రాడ్ని అడిగాడు. ఆకుర్రాడు శ్రద్ధగా ఆ సన్యాసిని వెంటపెట్టుకుని రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్ళి చూపాడు.

సన్యాసి సంతసించి "మంచిది నాయనా! నీవు ఆశ్రమానికి రా, స్వర్గానికి మార్గం చెపుతా," నన్నాడు.

అందుకా కుర్రాడు నవ్వి, "రైల్వే స్టేషన్‌కే మార్గం తెలియని వాడివి, స్వర్గానికి ఏం చూపుతావ్?" అని అడిగాడు.

—పెందుర్తి మాస్టర్జీ.

ప్రయాణంలో పదనిసలు

కురుమద్దాలి విజయలక్ష్మి

"మీ పేరు"

"కీర్తి కాత్యాయని."

"స్వీట్ నేమ్. మీలాగే మీ పేరు అందంగా వుంది."

అతని నిజమైన పొగడ్తకి నవ్వి వూరుకున్నాను.

"క్షమించండి. మనసులో ఒకటి పైకొకటి మాట్లాడటం నా కలవాటులేదు. ఈ దేశంలో పరాయి ఆడపిల్లని ఓ యువకుడు ముఖమెదుట పొగడటం కాని.... నా బుద్ధి నా మాటవినదే. నన్ను అపార్థం చేసుకోరని ఈ జర్నీలో మనం ఇరువురం కాలక్షేపంగా మాట్లాడటంలో తప్పు లేదని తలుస్తాను. మీ అభిప్రాయం...."

"పెద్దగా ఏమీలేదు" మామూలుగా అన్నాను.

అతను కంగు తిన్నట్లు చూశాడు.

మా మాటలతో నిమిత్తం లేకుండా రైలు ముందుకు పరుగిడుతూనే వుంది.

అతను నేను ఒకే రైలులో, ఒకే కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేస్తున్నాము. నేను అతను ఒకే స్టేషనులో ట్రైన్ ఎక్కాము. నేను రాజమండ్రిలో దిగాలి. అతను ద్వారపూడిలో దిగాలి.

మొదట మా యిరువురికి మాటలు నా చేతిలోవున్న 'అపరాధ పరిశోధన' చూపి యిస్తాననటంలో మొదలయింది. అతను అపన తిరగేసి, అపనపై తన అభిప్రాయం వ్యక్తంచేసి ఆపై నాతో మాటలు పెంచాడు.

"మీపేరు?" ఇంతవరకు నా అంతట నేను అతని గురించి ఏమీ అడగలేదు. మొదటిసారిగా పేరడిగాను.

"చక్రవర్తి" అన్నాడు అతను.

"ఏ దేశానికి చక్రవర్తి?" అని జోక్ చేద్దామనుకుని మానేశాను. "చదువుకుంటున్నారా? జాబ్ చేస్తున్నారా?" అని అడిగాను.

"రెండూ చేయటంలేదు."

"అదేం?"

"బి.కామ్. పూర్తి అయింది. మా ఫాదర్ చేసేది బిజినెస్. ప్రస్తుతం ఫాదర్ దగ్గర బిజినెస్‌లో మెలుకువలు తెల్సుకుంటున్నాను."

"ఐసీ."

"మీరు?"

"బి.ఎ. పూర్తి అయింది. చదివించారుగాని జాబ్ చేయించటం మావాళ్ళ కిష్టంలేదు. ఖాళీగావున్నాను. అప్పుడప్పుడు అంటే తోచనప్పుడు తెల్ల కాగితాలు నలుపు చేస్తుంటాను."

"ఓహో. మీరు రచయిత్రా! మీపేరు."

నేను రచయిత్రి ననంగానే చక్రవర్తి ముఖం ట్యూబ్ లైట్‌లా వెలిగింది. నే యిందాకే నా పేరు చెప్పిన సంగతి మర్చిపోయి మరోసారి నా పేరడిగాడు.

"ఇంతలో నే నా పేరు మర్చిపోయారా? కీర్తికాత్యాయిని."

చక్రవర్తి నావైపు అనుమానంగా చూశాడు.

చక్రవర్తి ఎదుటి సీటులో కూర్చున్న నేను యిబ్బందిగా కదిలాను.

"కీర్తికాత్యాయిని ఈ పేరుగల రచయిత్రి వున్నట్లు వినటంగాని, దేనిలోనయినా పేరు చదవటంగాని ఎరుగను. మరి మీరు....?"

చక్రవర్తి అడగంగానే గతుక్కుమన్నాను. ఒక్కోసారి ఎంత జాగ్రత్త వహించినా పొరపాటుచేయక తప్పదు.

"చక్రవర్తిగారూ, నేనో రైటర్‌నని చెప్పుకోటం నా కిష్టంలేదు. ఆ ప్తులకి అదీ మా యింట్లోను, మరో అరడజను మంది ఫ్రెండ్స్‌కితప్ప నే రాస్తానని ఎవరికీ తెలియదు. ఇప్పుడు మీముందు బైటపడ్డాను. నా పెన్‌నేమ్ సువత్సలా దేవి. ఎస్." నమ్మదగ్గట్లు చెప్పాను.

"ఓ....నా అభిమాన ప్రముఖ రచయిత్రి సువత్సలాదేవి. ఎస్. మీరా? ఈరోజు ఎంతదృష్టం. ఎప్పటినుంచో నా అభిమాన రచయిత్రిని చూడాలని అనుకోటం. ఊరు తెలియదు, అడ్రస్ తెలియదు." చక్రవర్తి నన్ను ఎగాదిగా చూస్తూ అన్నాడు.

"నేను రచయిత్రినని చెప్పుకోటం యిష్టంలేకనేకదా పేరు మార్చుకుంది. నేను మీ అభిమాన రచయిత్రి నయినందుకు మీకంట పడినందుకు మీకు సంతోషంగానే వుండొచ్చు. మీ సంతోషాన్ని మీలోనే దాచుకోండి దయ

చేసి నలుగురితో పంచుకోవద్దు. తెరమరుగున వుండ నివ్వండి. నా అసలుపేరు కీర్తికాత్యాయిని అని ఎవరితో చెప్పవద్దు" కొద్దిగా ముఖం ముడుచుకుని అన్నాను. ఎదుటి వాళ్ళు ముఖం ముడ్చుకుంటే అవతలివాళ్ళు తగ్గుతారని నా అనుభవంలోని విషయం.

"అలాగే మీమాట జవదాటను" అన్నాడు చక్రవర్తి వినయంగా.

వార మాస పత్రికలన్నీ తిరగేసే అలవాటు వుండడం వల్ల ప్రముఖ రచయిత్రిపేరు నా పేరుగా చెప్పుకున్నాను. అబద్ధాలు చెప్పటం మంచి తీర్థం తాగినంత తేలిక నాకు. ఓ అబద్ధం ఆడటం తప్పలేదు నాకు. అలవాటేకదా!

"కొత్తగా ఏం రాస్తున్నారు!" చక్రవర్తి అడిగాడు.

"రెండు నవలలు. మూడు కథలు."

"వాటి పేర్లు?"

"ముందే పేరుపెట్టను."

మా యిరువురి మధ్య ఇలాంటి సంభాషణ పావుగంట నడిచింది.

చక్రవర్తికి పాతికమించి ఏళ్ళు వుండవు. అందంగా హుందాగా ఖరీదైన సూటు బూటుతో సినిమాలో అందమైన అమ్మాయిని అల్లరిపెట్టే హీరోలా వున్నాడు. ప్రేమపెళ్ళి గురించి ఆలోచించే అమ్మాయి అయితే చక్రవర్తిని తన భర్తగా చేయమని ఏడుకొండలవాడికి మొక్కుకునేదే.

కాని, నా బిజినెస్ వేరు. చక్రవర్తిలాంటి వాళ్ళని చాలా మందిని చూశాను. కాబట్టి పెళ్ళిగురించి కలలుకనలేదు. ఈ రోజు యీ వూరు, మరోరోజు మరో వూరు.

నా చూపులు చక్రవర్తి సూట్‌కేసుపై పడ్డాయి. నా

సూట్ కేస్ చక్రవర్తి సూట్ కేస్ ఒకేమోడల్ వి. ఒకే సైజు. ఒకే కంపెనీ. అదృష్టం. కాని నా సూట్ కేసుపై క్లాత్ కాకీది. చక్రవర్తి సూట్ కేసు పై కవరుక్లాతు పూలది.

సూట్ కేసులు సమయంచూసి మార్చితే పై కవర్లు నిజాన్ని నిర్భయంగా వెళ్ళడిస్తాయి. ఎలా?

చక్రవర్తిని చూస్తుంటే డబ్బున్నవాళ్ళబ్బాయి అని తెలుస్తూనే వుంది. సూట్ కేసులో ఎంతో కొంత వుండకపోదు. మరి నా సూట్ కేసులో!

నా సూట్ కేసులో ఏముందోగుర్తుకురాగానే నవ్వొచ్చింది.

"ఏమిటో మీలో మీరు నవ్వుకుంటున్నారు?" చక్రవర్తి అడిగాడు.

"గతంలో ఓ సంఘటన గుర్తుకొచ్చింది."

"ఏమిటో అది, అభ్యంతరం లేకపోతే కాలక్షేపంగా వుంటుంది చెప్పండి."

"ఓసారి ఇలాగే రైలులో ప్రయాణం చేస్తున్నాను. నాచుట్టూ అరడజనుమంది అమ్మాయిలు కూర్చున్నారు. వాళ్ళచేతిలో ఓ వారపత్రిక వుంది. దానిలో నా కథ అచ్చయింది. ఆ కథ చదివి తర్జనభర్జన పడుతున్నారు వాళ్ళు. ఇద్దరేమో కథ చాలా బాగుంది, ఈ రచయిత్రి బాగా రాస్తుంది అనుకుంటున్నారు. ఓ మోస్తరుగా వుంది అంది ఓ అమ్మాయి. ఈ భూమ్మీద ఇంతగొప్ప రచయిత్రి ఇంకొకరు లేరంది మరో అమ్మాయి.

ఆ మాట విని ఇద్దరమ్మాయిలు గయ్యిమని లేచారు. దీని ముఖంరాతలు. ఇదీ ఓ కథేనా, పరమ చత్త. ఎడిటర్ దీని మేనత్తకొడుకేమో వాడి పత్రికలో అచ్చేశాడు, ఇలా నా గురించి నా కథపై వాద ప్రతివాదాలు జరిగాయి."

"మరి మీకు కోపంరాలా?"

"కోపమా? భలేవాలే, కళ ఎవరిలో వుంటుందో వారికి తిట్లు దీవెనలు తప్పవన్న సూక్తి మీరువినలేదా? పొగడ్తకి ఉబ్బిపోయి తెగడ్తకి కుంగిపోయి వాళ్ళేం రచనలు చేయ గలరు?"

"నిజమే. వాళ్ళలా అనుకుంటుంటే మీరు గమ్మున వూరుకున్నారా?"

"ఊహూ!"

"మరి....!"

"వాళ్ళను ఏమీ అనలేదు. వాళ్ళ సంభాషణలో నేను పాల్గొనలేదు. వాళ్ళు దిగే స్టేషనుకన్నా ముందుస్టేషను నాది. స్టేషన్‌లో దిగేటప్పుడు చిన్నచీటీ రాసి ఒకమ్మాయి చేతిలో పెట్టాను. చీటీ చదువుకునేలోపలే ట్రైన్ కదిలిపోయింది."

"చీటీలో ఏం రాశారు?"

"ఏ రచయిత్రిని గురించి మీరు వాదోపవాదాలు చేసుకుంటున్నారో, ఆ రచయిత్రిని నేనే. నన్ను నా కథలను మెచ్చుకున్న మీలో కొందరికి నా థాంక్స్. నన్ను నా రచనలు దుయ్యబట్టిన మిగిలినవారికి నా మెనీ థాంక్స్—అని కింద సువత్సలాదేవి. ఎస్. అని రాశాను."

"భలే భలే" అంటూ చక్రవర్తి విరగబడి నవ్వాడు.

మేమున్న కంపార్ట్‌మెంటులో పదిమంది మించిలేరు. అదీ మేమెక్కింది టుటైర్ కంపార్ట్‌మెంట్. చక్రవర్తి నవ్వు విని కొందరు అతన్ని వింతగా చూశారు.

కాసేపు మా మధ్య ప్రస్తుతం విడుదల అవుతున్న తెలుగు సినిమాలమీద చర్చ జరిగింది.

రాత్రి ఎనిమిదయింది. నెక్ట్స్ స్టేషన్‌లో మీల్స్ తీసు

కునేవారు తీసుకుంటారు.

"మీల్స్‌కి ఆర్డరిచ్చారా?" చక్రవర్తి అడిగాడు.

"ఊహూ! జర్నీలో భోజనం సహించదు. కాఫీ టిఫెన్‌తో కడుపు నింపేసుకుంటాను."

"నా అలవాటే మీదికూడా. స్టేషన్‌లో కాఫీ టిఫిన్ నేను తెచ్చిపెడతాను. నేనూ తీసుకోవాలికదా!"

"అలాగే!"

2

ట్రైన్ ఆగంగానే చక్రవర్తి కాఫీ టిఫిన్ తెచ్చాడు. తిన్నాను. అతను క్యాంటిన్‌వద్ద తినేసి వచ్చాడు.

ట్రైన్ మళ్ళీ బైలుదేరింది.

నిద్ర వస్తుందంటూ నా సీటుమీద మేను వాల్చాను. మాట్లాడుతూ కూర్చుంటే చక్రవర్తి నిద్రపోడు. నా పనికి ఆటంకం. తెల్లవారుఝాముకి ట్రైన్ రాజమండ్రి చేరుతుంది ఆ లోపల నా పని పూర్తి చేసుకోవాలి.

నా ఆవలింతలు చూపి "నిద్రొస్తున్నట్లుంది?" అన్నాడు చక్రవర్తి.

"అవును కళ్ళు కూరుకుపోతున్నాయి" అంటూ కళ్ళు మూసుకు పడుకున్నాను.

నాకూ నిద్రొస్తున్నదంటూ చక్రవర్తి పడుకున్నాడు.

చక్రవర్తి గాఢంగా నిద్రపోతున్నప్పుడే నా పని సవ్యంగా జరుగుతుంది గాబట్టి నిద్ర పట్టినట్లు నటించాను. ఓ గంట అలా నటిస్తే చక్రవర్తి నిద్రపోతాడు. అప్పుడు నా పని మొదలుపెట్టవచ్చు. ఆలోచిస్తూ పడుకున్నాను.

నటిస్తూ పడుకున్న నాకు నిజంగానే నిద్ర ముంచుకు వచ్చింది. చటుక్కున మెలుకువ రావటంతో ఉలిక్కిపడి

లేచాను. చక్రవర్తి గుర్రుపెడుతూ గాఢనిద్రలో వున్నాడు.

వాచీలో టైమ్ చూశాను.

సరీగా ఒంటి గంట.

మరో గంటకి రాజమండ్రి వస్తుంది. ఈ లోపల నా పని పూర్తికావాలి. నిద్రపోయినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను.

నా వద్ద రుమాలు వుంది. అది ముక్కుదగ్గర వుంచితే రుమాలుకి రాసిన మత్తుమందు వాసన పీల్చి ఓ గంట గాఢ నిద్రపోతారు ఎవరైనా.

రుమాలుతో అవసరం లేదనిపించింది. అయినా జాగ్రత్తకోసం చక్రవర్తికి మత్తుమందు వాసన చూపాను.

చక్రవర్తి మొద్దునిద్రపోతున్నాడు.

కంపార్ట్మెంటులో కొందరు నిద్రపోతున్నారు. కొందరు జోగుతున్నారు.

మా యిరువురి సూట్కేసులు ఖాళీగావున్న పై బర్త్మీద వున్నాయి. టుటైర్ త్రీటైర్లో ప్రయాణం చేసేవారు దొంగల గురించి భయపడరు. గుమ్మంలో టి. సి. వుంటాడు. పైగా ఎవరుపడితే వాళ్ళు ఈ కంపార్ట్మెంట్లో ఎక్కరు. అందుకే సాధారణంగా నేను టుటైర్, త్రీటైర్ లోనే ఎక్కి నా పని పూర్తి చేసుకుంటాను.

ఓసారి నలువైపులా పరికించి చూసి తృప్తిగా తల పంకించాను.

గుమ్మంలో టీ. సీ. జోగుతున్నాడు.

చకచక రంగంలోకి దిగాను.

నా సూట్కేసుకున్న కాకీ కవరుక్లాత్ విప్పాను. చక్రవర్తి సూట్కేసుకున్న పూల కవరుక్లాతు విప్పాను.

అవసరాన్నిబట్టి మారు తాళంచెవు ఉపయోగిస్తుంటాను. కాని ఇప్పుడు అవసరంలేదు. పై క్లాతు మారిస్తే చాలు. చాలా క్విక్‌గా కవర్లు మార్చాను. ఆపై సూట్‌కేసులు యధా స్థానంలో వుంచాను.

ఆపై ....

నా వ్యానిటీబ్యాగ్ తెరిచి కాగితం, కలం తీశాను.

"చక్రవర్తిగారికి,

నా పేరు కీర్తి కాత్యాయిని కాదు. నేను రచయిత్రి సువత్సలాదేవి, ఎస్.ని అంతకన్నా కాదు. బ్రతుకుతెరువు కోసం ఈ విద్యని అభ్యసించి దీనిలో ఆరితేరినదాన్ని అంతే. రచనల గురించి, రచయిత్రి గురించి నమ్మదగ్గ నిజం చెప్పటానికి కారణం పుస్తకాల పురుగుని నేను. అంతే. మీ సూట్‌కేస్ కవరు మాత్రమే మీది. గ్రహించ గలరు. శలవ్.

—ఒక అమ్మాయి."

నే రాసిన కాగితం మడతపెట్టి చక్రవర్తి జేబులో పెట్టాను.

రాజమండ్రి స్టేషన్‌లో ట్రైన్ ఆగింది.

చక్రవర్తిని లేపాను. నే దిగుతున్నట్లు చెప్పి అతనివద్ద సెలవు తీసుకుని ట్రైన్ దిగాను.

స్వయంగా తన చేతితో సూట్‌కేసు అందుకుని నా కందించాడు చక్రవర్తి.

కాకీక్లాత్ కవరుగల సూట్‌కేసు అది.

చక్రవర్తికి థాంక్స్ చెప్పి వచ్చేశాను.

నేను చక్రవర్తి ఎక్కివచ్చిన ట్రైన్ వెళ్ళిపోయిందాకా వెయిటింగ్‌రూమ్‌లో ఆగి, విజయవాడవైపు వెళ్ళే ట్రైన్

స్టేషన్‌లో రెడీగా వుంటే టిక్కెట్ తీసుకుని దానిలో ఎక్కాను.

కొద్దిసేపటిలోనే ఎక్కిన ట్రైన్ విజయవాడవైపు బైలు దేరింది.

హాయిగా నిట్టూర్పు విడిచాను.

3

తెల్లవారుఝాము కావటం వల్ల కంపార్ట్‌మెంట్‌లో అందరూ దాదాపు నిద్రలో వున్నారు.

జాకెట్‌లో దాచిన తాళంచెవులులాంటి చిన్న పరికరాలను తీశాను. వాటితో ఎంత గట్టి తాళాన్నయినా తీయవచ్చు. సూట్‌కేసు తాళం తీశాను. సూట్‌కేసు మూత తెరిచిన నేను నా నోరు కూడా "ఆ" అని తెరిచాను.

సూట్‌కేసులో వున్నది నా వస్తువులే అంటే నే పెట్టిన పాత పుస్తకాలు, పీలికలయిన పాతగుడ్డలు, ఇదెలా జరిగింది? స్వయంగా నా చేతులతో కవర్లు మార్చాను. అతని పెట్టె నాకు రావాలి. అలా జరగలేదు. ఏం జరిగుంటుంది?

సూట్‌కేసు మూత వేశాను. దిగాలుపడి నుదుట పట్టిన చెమట తుడుచుకోటానికి వ్యానిటీబ్యాగ్‌లో వున్న కర్‌చీఫ్ తీయబోయాను. దానిలోనుండి ఒక కాగితం జారి క్రింద పడింది. ఆశ్చర్యంతో దానిని తీసి చదివాను.

కాగితంపై ముత్యాలులాంటి అక్షరాలు. అక్షరాల వెంట నా చూపులు పరుగిడుతున్నాయి.

"అందాల అమ్మడూ!

నా పేరు చక్రవర్తి కాదు. నిన్ను చూడగానే డబ్బుగల వారిపిల్లవని, బహుశా ఇంట్లోంచి పారిపోతున్నావేమో అని పించింది.

నీవు రైలు ఎక్కినప్పుడు చూశాను. నీ చేతిలో పెట్టె, నా వద్దనున్న పెట్టె ఒకటే అని. ప్లాన్ వేశాను. నీకు కాఫీ టిఫిన్ ఇచ్చినప్పుడు కాఫీలో నిద్రమాత్ర కలిపాను. అది తాగి నీవు హాయిగా నిద్రపోయావు. సమయం సద్వినియోగం చేసుకున్నాను. నీ పెట్టెకున్న క్లాత్ తీసి నా పెట్టెకి తొడిగి నా పెట్టెకున్న క్లాత్ నీ పెట్టెకు తొడిగాను.

క్షమించు. నా జీవనాధారం, నా వృత్తి అది. వాస్తవం చెప్పకపోతే నాకు నిద్ర పట్టదు. నీ పెట్టెను తీసుకుపోతున్నందుకు మరోసారి క్షమించమని కోరుతూ శలవ్.

—ఒక అబ్బాయి."

అతను రాసింది చదివింతరువాత ఏడ్వాలో, నవ్వాలో తెలియలేదు నాకు. □□□

చరిత్ర మార్పు??

క్లాసులో టీచర్ చరిత్ర పాఠము చెపుతున్నాడు. మధ్యలో—

"హిట్లరు ప్రపంచ చరిత్రనే మార్చివేద్దామనుకున్నాడు కాని, అది అతడికి సాధ్యం కాలేదు. ఎందుచేత?" అడిగాడు వో అబ్బాయిని లేపి.

"పాపం...అప్పుడు పేపర్, బ్లాకులకు కరువొచ్చిందేమో సార్!" ఠకీమని చెప్పాడు విద్యార్థి.

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

Library Pedagogicals (handwritten inscription)

ఎండమావులు?

శశిభూషణ్

"డార్లింగ్! మనం భారతదేశం వదిలెయ్యబోతున్నాం"

సిగరెట్ వెలిగించుకున్నాడు మణిరామ్ బాగ్రి.

"ఈజిప్ట్ విదేశీ మారకస్థితి చాలా అధ్వాన్నంగా వుంది. అటువంటిచోట మనవంటి వాళ్ళు రెండుచేతులా సంపాదించ వచ్చు! అంతేకాదు. కైరోలో నా ప్రాణస్నేహితుడు ఒక డున్నాడు. అతని సహకారంతో మనం కైరోలో స్థిరపడి పోవటం వివేకమైన పని...."

బాగ్రి మాటలకు అడ్డుపడింది - అతని ప్రియురాలు జ్యోతిర్మయి.

"ఈ నిజామాబాద్‌లో మనకేం తక్కువైంది? మన స్మగ్లింగ్ కార్యకలాపాలన్నీ పూనా, బొంబాయి నగరాలలో సాగిపోతున్నాయ్. వాటిని జాగ్రత్తగా నిర్వహించటానికి ఎందరో అనుచరులు మనకు వున్నారు. ఈజిప్ట్ వెళ్ళడం ఎందుకు? అసలేం జరిగింది?"

బలంగా సిగరెట్ దమ్ములాగి పొగ పూర్తిగా మింగే శాడు బాగ్రి.

"ఇప్పటికి ఏమీ జరగలేదు. ఏదైనా జరగడం నా కిష్టం లేదు."

తన ప్రియుడు బాగ్రి మేధావి అని జ్యోతిర్మయికి తెలుసు. ప్రియునిచేయి అందుకుని ముద్దు పెట్టుకుందామె. ఆ సమయంలో ఇద్దరూ సోఫాలో కూర్చునున్నారు. వారి ముందున్న టీపాయ్‌మీద బ్రాంది బుడ్లు, సోడాలు, గ్లాసులు వున్నాయ్. అది పడగ్గది.

రాత్రి ఎనిమిది గంటలు దాటి ఎనిమిది నిమిషాలైంది.

బాగ్రి - జ్యోతిర్మయిల బెడ్‌రూంలో ట్యూబ్‌లైట్ వెలుగుతోంది. దాని కాంతి గది నలుమూలలా సమంగా పడుతూంది.

"మనం ఇండియా వదలకుంటే ఏం జరుగుతుంది?" అడిగింది జ్యోతిర్మయి.

టీపాయ్‌మీదున్న గ్లాసు అందుకుని, దానిలోని ద్రవాన్ని గొంతులో పోసుకున్నాడు బాగ్రి.

"పూర్, డార్లింగ్! ఇది 1967 కాదు-1977. ప్రభుత్వం 'మిసా'ని అమలులోకి తెచ్చి యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌ని ఏరివెయ్యడం ప్రారంభించాక మనం ఎన్నికష్టాలు ఎదుర్కొన్నామో నీకు తెలుసు. గండం గడిస్తే గండం. ప్రతిక్షణం ఈ దేశంలో చచ్చి బ్రతకటంకంటే మరొక దేశంలో హాయిగా జీవించటం మంచిది కాదా?"

"అఫ్‌కోర్స్ మన ప్రయాణ మెప్పుడు?"

"ఈవేళ తారీఖు మూడు. ఈ నెల పదవతేదీ సాయంత్రానికి మనం కైరోలో వుంటాము."

"బాగానే వుంది. ఈజిప్ట్‌కే ఎందుకెళ్ళాలి మనం? ఏ బుడాపెస్ట్ నగరమో ఎందుకు వెళ్ళకూడదు?"

"యు ఆర్ ఎ ఫూల్! బుడాపెస్ట్ వెళితే మనతోకలు కత్తిరింపబడతాయ్. హంగేరియన్స్‌కి విదేశీవస్తువులమీద మోజు తక్కువ. మరొక విషయం ఏమంటే హంగరీ ప్రజాస్వామ్యదేశంకాదు. స్మగ్లర్లు అక్కడ సుఖంగా వ్యాపారాలు సాగించలేరు. అది సోషలిస్ట్ రాజ్యం.

ఈజిప్ట్ విషయం వేరు.

ఈజిప్ట్‌లో డబ్బుని పౌండు అంటారు. ఒక ఈజిప్ట్ పౌండు అధికార రీత్యా దాదాపు రెండున్నర అమెరికన్ డాలర్లకు సమానం. కాని, ఒకటిన్నర డాలర్లకే పౌండు లభ్యమౌతుంది ఈజిప్ట్‌లో.

అంటే ఈజిప్ట్ విదేశీ మారకస్థితి చాలా హీనంగా వుందన్న మాట! మనవంటి పక్షులకు ఈజిప్ట్‌వంటి దేశాలే తగినవి. మరొక సంగతి విను.

ఈజిప్ట్ జనాభా దాదాపు 80 లక్షలు. ఒక్కకైరో జనాభా మాత్రం 60 లక్షలు. అంటే కైరో ఎంతటి జనసమ్మర్దం కలిగిన నగరమో వూహించుకో!

ఈజిప్షియన్స్‌మీద పాశ్చాత్య ప్రభావం అధికంగావుంది. కైరోలో బీదరికం, పడుపువృత్తి కొట్టొచ్చినట్టు కన్పిస్తాయ్. దబాయించి డబ్బుగుంజడం అక్కడ ఎక్కువ. చిన్నపిల్లలుకూడా కూలిపని చేయడం ఆ నగరంలో సాధారణమైన విషయం.

చాలా విషయాలలో కైరోనగరం మనదేశంలోని మహా నగరాలను పోలివుంది.

అధిక జనసమ్మర్దం కలిగిన నగరాలలో స్మగ్లర్లు జీవించ

టానికి వసతులు వుంటాయ్. స్మగ్లర్‌కి ముఖ్యమైనది వ్యాపారంకాదా!"

"ఓ.కే! డు యాజ్ యు లైక్. నీ ఇష్టాల్ని నేనెప్పుడూ కాదనను...." గ్లాసు అందుకుని ఖాళీచేసింది జ్యోతిర్మయి.

2

నిజామాబాద్ శివార్లలోనున్న భవనం అది.

ఇంటిముందు మెయిన్‌రోడ్‌ని ఆనుకుని పెట్రోలుబంక్ వుంది. దాని సొంతదారుడు మణిరామ్ బాగ్రి. కాని, ఈ సంగతి కామత్‌కి జ్యోతిర్మయికితప్ప మరొకరికి తెలియదు.

మణిరామ్ బాగ్రి కుడిభుజం వంటివాడు కామత్. బాడీ గార్డ్‌కూడా. వారిమధ్య కొన్నేళ్ళుగా ఎన్నో రహస్యాలు ప్రపంచానికి తెలియకుండా నలిగిపోతున్నాయ్. అయినా ఆశ్చర్యకరమైన సంగతి ఏమంటే జ్యోతిర్మయికి కామత్‌తో కూడా సంబంధం వుంది!

ఉదయం తొమ్మిదిగంటలుదాటి తొమ్మిదినిమిషాలైంది.

పెట్రోల్ బంక్ వెనుకనున్న కామత్ ఇంటిముందు రిక్షా దిగాడు మణిరామ్ బాగ్రి. చిల్లర ఇచ్చి రిక్షాని పంపేశాడు.

అదే సమయంలో కామత్ ఇంట్లోంచి బయటికి వచ్చాడు. ఆఫ్ఘనీ కుర్దిష్‌జాతీయుని వేషంలోనున్న బాగ్రిని పోల్చుకోలేకపోయాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు.

మందహాసం చేశాడు మణిరామ్ బాగ్రి. జేబులోంచి సిగరెట్ పెట్టె తీశాడు. సిగరెట్‌తీసి పెదవులమధ్య ఇరికించుకుని, ఎడమచేత్తో అగ్గిపుల్ల గీశాడు.

"బాస్ .... మాఫ్‌కర్నా .... మిమ్మల్ని గుర్తించలేక పోయాను...." చేతులు నలుపుకుంటున్నాడు కామత్.

బదులుచెప్పలేదు బాగ్రి. కామత్‌ని తీసుకుని ఇంట్లోకి నడిచాడు. కామత్ చూపించిన కుర్చీలో కూర్చుంటూ సిగరెట్ బట్‌ని గదిమూలకు విసిరాడు.

యజమాని నోటినుంచి బయటికి రాబోయే మాటలు వినటానికే ఒక ప్రక్కగా చేతులు కట్టుకొని నిలబడున్నాడు కామత్. ఆ నిలబడిన తీరులో భయం, భక్తి, వినయం వుట్టిపడుతున్నాయ్.

"కామత్!" బాగ్రి పెదవులు కదిలాయ్. "మనం ఇండియా వదిలి ఈజిప్ట్ చేరుకోబోతున్నాం శాశ్వతంగా. తిరిగి ఈ దేశం రావాల్సిన అవసరం వుండదు."

వెధవ నవ్వు నవ్వాడు కామత్.

అరగంటసేపు ఏవేవో ఆజ్ఞల్ని జారీచేశాడు బాగ్రి.

అన్నింటికీ గంగిరెద్దులా తలూపాడు కామత్.

"జ్యోతిర్మయి అంటే నాకు అసహ్యం కలుగుతోంది. బుద్ధి నిలకడలేని బద్మాష్ అది. అలాంటి దెయ్యాన్ని బ్రతకనివ్వటం కొరివితో తల గోక్కున్నట్టే అవుతుంది. మనం ఈజిప్ట్ వెళ్ళేలోగా జ్యోతిర్మయిని చంపెయ్యాలని వుంది. నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు బాగ్రి.

"జ్యోతిర్మయి మేమ్‌సాబ్ మీద నాకు ఎటువంటి అభిప్రాయమూ లేదు సాబ్! మీ ఇష్టం. మీరు ఏం చెబితే అది చెయ్యగలను సంతోషంగా!" బదులిచ్చాడు కామత్.

"గుడ్! వెరీగుడ్! జ్యోతిర్మయి విషయం తర్వాత ఆలోచిద్దాం. మొదట మిగిలిన పనులు చూడు. సమయాన్ని వృథా చెయ్యకు" లేచి ఆ ఇంట్లోంచి బయటికి వెళ్ళిపోయాడు మణిరామ్ బాగ్రి.

అతను వెళ్ళిన పావుగంటలో జ్యోతిర్మయి ప్రవేశించింది సుడిగాలిలా. వస్తూనే, "కామత్! మనం ఈజిప్ట్ వెళ్ళబోతున్నాం" అంది. అని ముందు గదిలోనే కామత్‌ని తీగలా అల్లుకుపోయింది.

"మనం కాదు—మేము" అన్నాడు కామత్.

అర్థం కానట్టు చూసింది జ్యోతిర్మయి.

తన యజమాని తనతో అన్న మాటల్ని అక్షరం పొల్లుపోకుండా చెప్పాడు కామత్.

అంతా విని, కామత్‌ని అవతలి గదిలోకి లాక్కుపోయింది జ్యోతిర్మయి. అది పడగ్గది. ఇద్దరూ మంచం మీద కూర్చున్నారు.

"ఇంత తొందరగా చావటానికి నేను సిద్ధంగా లేను. బాగ్రినే పంపేద్దాము పైకి. వాడ్డు యు సే, డార్లింగ్?" అడిగింది జ్యోతిర్మయి నవ్వుతూ.

"విత్ ప్లెజర్" అన్నాడు కామత్ నవ్వుతూ.

3

నిజామాబాద్ నుంచి వరంగల్‌కి వెళ్తున్న ట్రంక్ రోడ్ మీద ఏభై కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తున్నదో ట్రక్.

మే నెల. సమయం మిట్టమధ్యాహ్నం.

ఆకాశంలో సూర్యుడు నిప్పులు చెరుగుతూ ప్రచండంగా ప్రకాశిస్తున్నాడు, గాలి వెచ్చగా వీస్తోంది.

ట్రక్ కాబిన్‌లో ముగ్గురు వ్యక్తులు వున్నారు. వారిలో ఒక వ్యక్తి డ్రైవర్. అతను కామత్. మిగిలిన ఇరువురూ మణిరామ్ బాగ్రి, జ్యోతిర్మయిలు.

"వెధవ ట్రక్కు....ఇంతకంటే వేగంగా వెళ్ళదేమిటి?" విసుక్కుంది జ్యోతిర్మయి. "గమ్యం ఇంకెంత దూరం?"

కామత్ బదులు చెప్పలేదు. ట్రక్ వేగాన్ని మరో ఐదు కిలోమీటర్లు పెంచాడు.

"డోంట్ బి హేస్టీ డార్లింగ్'" బాగ్రి అన్నాడు. "జీవితంలో ఒక లక్ష్యంవైపు పురోగమించి, గమ్యాన్ని చేరటానికి ఏకాగ్రత, ఓపిక అవసరం మనిషికి."

'బోడి కొటేషన్స్....' లోలోపలే గొణుక్కుంది జ్యోతిర్మయి.

ట్రక్కు తారురోడ్డుని వదిలి మట్టిరోడ్‌లోకి తిరిగింది. ఈ రోడ్డు చాలా ఘోరంగా వుంది. మిట్టపల్లాలు చెప్పలేనన్ని ఎదురవుతున్నాయ్. ఒక్కచోట రోడ్డుమధ్యనే చిన్న చిన్న గుంటలు దర్శనమిస్తున్నాయ్. బాట కిరువైపులా అడవి!

ట్రక్కు ప్రస్తుతం నెమ్మదిగా ప్రయాణిస్తోంది. దాని కుదుపులకు జ్యోతిర్మయి విసుగు మరింత అధికమౌతూంది.

నలభై నిమిషాలపాటు అలాగే సాగింది ప్రయాణం.

హఠాత్తుగా ట్రక్కు ఆగేసరికి జ్యోతిర్మయి ప్రాణాలు కుదుటబడ్డాయ్.

ఇంజన్ ఆఫ్‌చేసి క్రిందకు దిగాడు కామత్.

మిగిలిన ఇరువురుకూడా ట్రక్కునుండి దిగి ఒళ్ళు విరుచుకున్నారు.

ఎదురుగా పొదల చాటున ఓ హెలికాప్టర్ లాండ్ చెయ్యబడుంది. మెషిన్‌గన్ భుజానికి తగిలించుకున్న వ్యక్తి ఒకడు హెలికాప్టర్ నీడన అటు యిటు తిరుగుతూ సిగార్ కాల్చుకుంటున్నాడు.

ట్రక్కు ఇంజన్ చప్పుడు విన్పించిన వెంటనే ఆ

వ్యక్తి సిగార్ పారేసి ఇటు తిరిగాడు.

కామత్ హెలికాప్టర్ వైపు అడుగులేశాడు.

మరు నిమిషంలో ఓ చావుకేకఅక్కడ ప్రతిధ్వనించింది "ధన్...." మంటూ రివాల్వర్ పేలిన చప్పుడులో కల్సిపోయి.

హెలికాప్టర్‌ని కాపలా కాస్తున్న వ్యక్తి నేలమీదపడి గింజుకుంటున్నాడు — పీక తెగిన కోడిలా. అతనికంఠంలో దూరివున్నది బుల్లెట్. గాయంలోంచి వుధృతంగా వెలుపలికి చిమ్ముతూంది నెత్తురు.

"ఫైన్ జాబ్, కామత్!" జ్యోతిర్మయిని తీసుకొని హెలికాప్టర్ వద్దకొచ్చాడు బాగ్రి.

"సాబ్! మీరు హెలికాప్టర్‌లోకి చేరుకోండి. నేను వెళ్ళి సామాన్లు తీసుకొస్తాను" వినయంగా చెప్పాడు కామత్.

"యస్. డు యువర్ డ్యూటీ ఫస్ట్" బాగ్రి-జ్యోతిర్మయితో సహా హెలికాప్టర్‌లోకి చేరుకున్నాడు.

ట్రక్కులోని సామానుల్ని హెలికాప్టర్‌లోకి చేరవేశాడు కామత్. స్పేర్ పెట్రోల్ టిన్నులు అందుకొని, ట్రక్కు మీద ఇష్టమొచ్చినట్టు పెట్రోల్ చల్లాడు. తాపీగా అగ్గిపుల్ల వెలిగించి ట్రక్కుమీదకు విసిరాడు.

భగ్గున లేచాయి మంటలు.

మరు నిమిషంలో హెలికాప్టర్ కామత్ ఆధ్వర్యంలో గాల్లోకి లేచి అరేబియన్ సీ వైపు ప్రయాణించింది.

4

అర్ధరాత్రి.

'గల్ఫ్ ఆఫ్ సూయజ్'ని దాటి అరేబియన్ డిజర్ట్ మీదకు దూసుకొచ్చింది హెలికాప్టర్.

హెలికాప్టర్ వెనుక ఆకాశంలో "బజ్ జ్...." మంటూ ఏదో చప్పుడు వినిపిస్తోంది. ఆ ధ్వని హెలికాప్టర్‌ని వెన్నంటి తరుముతూనే వుంది—ఐదు నిమిషాలనుంచి.

"సాబ్! ఈజిప్షియన్ వార్ ప్లేన్స్ మన హెలికాప్టర్‌ని తరుముతున్నాయ్" అరిచాడు కామత్. "ఇది మామూలు హెలికాప్టర్ కావటంతో సులభంగా రాడార్ యంత్రాలు దీని వునికిని గుర్తించి వుండాలి!"

మణిరామ్ బాగ్రి ఆలోచనలో పడ్డాడు.

ఇంతలో ఈజిప్షియన్ వార్ ప్లేన్స్ 30 యమ్. యమ్. అడెన్ కానన్స్ ప్రేల్చటం ప్రారంభించాయ్. ఫిరంగి గుళ్ళు హెలికాప్టర్ ప్రక్కలనుంచి దూసుకెళ్తున్నాయ్.

ఇండియన్ క్రూక్స్‌కి ప్రాణభయం పట్టుకుంది.

"కామత్!" అరిచాడు బాగ్రి. "హెలికాప్టర్‌ని సురక్షితంగా లాండ్ చెయ్యటానికి ప్రయత్నించు. ఈజిప్షియన్స్‌కి శత్రుభయం అధికం. మనల్ని శత్రువులుగా భావించి వుంటారు....క్విక్! చెప్పినట్టు చెయ్!"

హెలికాప్టర్‌ని కుడిప్రక్కనుంచి ఏటవాలుగా నడుపుతూ నేలమీదకు దూసుకెళ్ళాడు కామత్. దానివలన ఫిరంగి గుళ్ళు ఫ్యూయల్ టాంక్‌లో దూరే ప్రమాదం వుండదని అతనికి తెలుసు.

బాగా క్రింద ఎగురుతూ హెలికాప్టర్‌ని కూల్చాలని చూస్తున్నాయ్ ఈజిప్షియన్ వార్ ప్లేన్స్.

హెలికాప్టర్‌ని భూమ్మీదకు తీసుకెళ్ళినట్టే తీసుకెళ్ళి గిర్రున వెనక్కు తిప్పాడు కామత్. వెంటనే స్పీడు పెంచి ముందుకు దూసుకెళ్ళాడు కొంతదూరం. అప్పుడు అక్కడ లాండ్ చేశాడు హెలికాప్టర్‌ని.

జరిగిన మోసం అర్థమై వార్ ప్లేన్స్ వెనుదిరిగాయ్. చీకటి కావటంతో ఈజిప్షియన్ ఎయిర్ ఫోర్స్ పైలెట్ ఆఫీసర్లు సులభంగా మోసపోయారు.

నిమిషాల మీద భూమ్మీద లాండ్ చెయ్యబడున్న హెలి కాప్టర్ని ప్లడ్ లైట్స్ కాంతిలో కనుక్కొని బాంబింగ్ ప్రారంభించారు.

భయంకరమైన చప్పుళ్ళతో ప్రేలిపోయింది హెలికాప్టర్ విడి భాగాలు మండుతూ గాల్లో కెగిరాయ్.

బాంబింగ్ పూర్తిచేసిన ఈజిప్షియన్ వార్ ప్లేన్స్ విజయ గర్వంతో వెనుదిరిగి బేస్వైపు ఎగురుకుంటూ వెళ్ళాయ్.

5

హెలికాప్టర్ లాండింగ్ రాడ్స్ భూమిని తాకిన వెంటనే జ్యోతిర్మయి క్రిందకు దూకేసింది- వజ్రాలున్న ఎయిర్ బేగ్ అందుకుని.

మరుక్షణంలో కామత్, మణిరామ్ బాగ్రి హెలికాప్టర్ లోంచి దూకేశారు....బంగారు కడ్డీలున్న సూట్ కేసులు అందుకొని. ఆహారపదార్థాలు, హాట్ డ్రింక్స్ వగైరాలున్న బేగ్లు అందుకోవటానికి వారికి వ్యవధి చాల్లేదు.

వాళ్ళు ముగ్గురూ హెలికాప్టర్ లోంచి బయటికి దూకిన వెంటనే మొదటి బాంబు ఈల ధ్వనిచేస్తూవచ్చి హెలికాప్టర్ మీద పడింది. అటుతర్వాత మరికొన్ని బాంబులు పడ్డాయ్.

ఇసుకలో ఓ చోట బోర్లా పడుకొనున్న క్రూక్స్ ముగ్గురూ బాంబింగ్ పూర్తయి ప్లేన్స్ ఆ ప్రదేశంనుంచి దూరమైన తర్వాత లేచారు, దుస్తుల కంటివున్న ఇసుక దులుపుకున్నారు.

"కామత్! ఇహ మన కొచ్చిన ప్రమాదం ఏం లేదు"

సిగరెట్ వెలిగించు కున్నాడు మణిరామ్ బాగ్రి. "నీ దగ్గర రివాల్వర్ వుందా?"

"వుంది. సాబ్!"

"అచ్ఛా! జ్యోతిర్మయి ఈ ఎడారిలో దిక్కుమాలిన చావు చావబోతున్నది. నీ రివాల్వర్‌తో చంపెయ్!"

ప్రియుని మాటలు విని భయపళ్ళేదు జ్యోతిర్మయి.

"డార్లింగ్....ఏమిటి నువ్వు అంటున్నది? నీ కేమైనా పిచ్చెక్కిందా?" అరిచినట్టు అడిగింది భయం నటిస్తూ.

"నా విల్‌పవర్ మరీ అంత బలహీనమైనది కాదు డార్లింగ్! డోంట్ వర్రీ, నాగురించి బాధపడుతూ ప్రాణాలు వదలొద్దు! ఈ జన్మలో నాకు పిచ్చెక్కదు" నవ్వాడు బాగ్రి.

"నీ వంటి ఆడది జీవించివుండటం మా వంటి మగ వాళ్ళకు మంచిదికాదు. కామత్‌వంటి నమ్మినబంటువున్నంత వరకు ఈ సృష్టిలోని ఏ శక్తులూ నన్నేం చెయ్యలేవు. చావుకి సిద్ధపడు, జ్యోతిర్మయీ!"

బరువుగా ఊపిరి పీల్చి వదిలింది జ్యోతిర్మయి.

భగభగ మండుతున్న హెలికాప్టర్ వెలుగులో ఒకరి ముఖ కవళికలు మరొకరికి స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"సాబ్! చిత్రహింసచేసి చంపమంటారా, ఒకే ఒక బుల్లెట్‌తో ప్రాణాలు లాగేసుకో మంటారా?" అడిగాడు కామత్.

"చిత్రహింస చేసి చంపు" చెప్పాడు బాగ్రి. "మొదట తొడల్లో, తర్వాత జబ్బల్లో, ఆఖరున ముఖంలో దూరాలి బుల్లెట్లు."

బదులు చెప్పలేదు కామత్, జ్యోతిర్మయి, కామత్‌నే చూస్తోంది.

"ధన్...." మంటూ ప్రేలింది కామత్ చేతిలోని రివాల్వర్. మొదటిసారిగా బుల్లెట్ మణిరామ్ బాగ్రి ఎడమ తొడలో దూరింది.

"కుత్తే....ఏమిటది?" బాధగా అరిచాడు బాగ్రి. వెంటనే అతని కుడి తొడలో దూరింది బుల్లెట్.

"నమ్మక్ హరాయ్...." నిలబడలేక మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడు బాగ్రి. అతని మూలుగులు భీకరంగా వినిపిస్తున్నాయి.

కామత్ ప్రక్కకొచ్చి నిల్చుంది జ్యోతిర్మయి. "పాపం బాధ పడుతున్నాడు. ఎంత చెడ్డా ఒకప్పుడు మన యజమాని కదా! ఇహ బాధపెట్టొద్దు, డార్లింగ్! ప్రాణాలు లాగేసుకో!" అంది నవ్వుతూ.

"నో....నో...." అరుస్తున్నాడు బాగ్రి. అతని అరుపుల గురించి పట్టించుకోలేదు కామత్. నిర్దయగా ట్రిగ్గర్ నొక్కేశాడు. ఈసారి బుల్లెట్ బాగ్రి గుండెల్లో దూరింది.

అటుతర్వాత మణిరామ్ బాగ్రి అరవకుండా వెనక్కు వాలిపోయి శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు.

వజ్రాలున్న ఎయిర్ బేగ్ భుజానికి తగిలించుకొంది జ్యోతిర్మయి. బంగారంవున్న సూట్ కేసులు అందుకున్నాడు కామత్. అటుతర్వాత క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా ఇరువురూ ఇసుకలో చకచక నడవటం ప్రారంభించారు.

ప్రయాణం ఎటువైపు సాగుతున్నదో ఇద్దరికీ తెలియదు.

6

సూర్యుడు ఉదయించాడు.

జ్యోతిర్మయి, కామత్ ఆగి, బరువుల్ని నేలపై వుంచారు.

రాత్రంతా ప్రయాణంచెయ్యటంతో ఇరువురికీ నీరసంగా వుంది. పిక్కలు లాగుతున్నాయ్. కండరాలు ఎవరో పట్టి నొక్కుతున్నట్టు అనుభూతి! నిద్రలేమివలన కళ్ళు మండు తున్నాయ్. కళ్ళనిండా ఇసుక వున్నట్టు ఒకటే మంట.

ఇసుకలో చతికిలబడి సిగరెట్ తీసి, ఆఖరు సిగరెట్ వెలిగించుకొని, ఖాళీ సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె అవతల పారేశాడు కామత్. బలంగా సిగరెట్ దమ్ములాగి చూపుల్ని పైకిపోనిచ్చాడు.

నిర్మలంగా కన్పించింది నీలాకాశం.

సిగరెట్ కాల్చుకోవటం అయాక తిరిగి బయలుదేరాడు. కంపాస్ లేకపోవటంతో రాత్రంతా తూర్పుదిక్కువైపు సాగింది ప్రయాణం. అలాగే వెళ్ళివుంటే రెడ్‌సీ ఎదురై వుండేది.

ప్రస్తుతం పడమరదిశగా సాగిపోతున్నారు కామత్, జ్యోతిర్మయిలు. నైల్‌నది తీరప్రాంతాల్లో ఏదో ఒక ఊరు చేరాలని వారి ప్రయత్నం. కెలినా, అస్వాన్, లక్సర్ మొదలైనవి నైల్‌నదిని ఆనుకుని వున్నాయ్. ఏదో ఒక వూరు చేరగలిగితే చాలు!

వేగంగా అడుగులెయ్యకపోతున్నాడు కామత్. కంపాస్ లేదు. ఆహారపదార్థాలు లేవు. చివరికి మంచినీరుకూడా లేదు. తాము....తాము మనుషులమధ్యకు తిరిగి వెళ్ళగలరా?

ఆ ఆలోచన వచ్చిన వెంటనే కామత్ గుండెలు ఒక్క క్షణం ఆగి తిరిగి పనిచెయ్య సాగాయ్.

తనకు తానే ధైర్యం చెప్పుకుని నడకవేగం పెంచాడు. నడుస్తూనే ఓసారి చుట్టూ చూశాడు. కనుచూపు మేరవరకు తళతళలాడుతున్న ఇసుక దిబ్బలు కన్పించాయ్.

ఉదయం పదిగంటలై వుంటుంది.

అప్పుడే వేడి విజృంభిస్తోంది. ఎడారి ప్రాంతం కావటంతో గాలి వెచ్చగా వుంది. పోనుపోను ఎండ తీవ్రత భరించటం కష్టమౌతోంది. గాలికి తెరలు తెరలుగా ఎగిరి వచ్చి ఇరువురి నెత్తిన, కళ్ళలో పడుతోంది—ఇసుక.

వాటి సంగతి ఎలావున్నా మొదట దాహంతీర్చుకోవాలి. జ్యోతిర్మయి అసలే నడువలేని స్థితిలో వుంది. దాహంతో నాలుక పిడచగట్టుకుపోయింది ఆమెకు.

చేసేదిలేక అలాగే అడుగులేస్తున్నారు. ఎక్కడైనా చిన్న ఒయాసిస్సువంటిది కన్పిస్తుందేమోనని లేని పుత్సాహంతో నడుస్తున్నారు.

తము దారితప్పి తిరిగిన ప్రదేశాల్లోనే తిరగటం లేదు కదా? హఠాత్తుగా ప్రాణభయం పట్టుకుంది క్యామత్‌ని. ఎడారుల్లో దారితప్పటం అంటే ప్రాణాలపై ఆశవదులుకోవటమే!

ప్రయాణం మరొక గంట సాగి అప్రయత్నంగా ఆగిపోయింది.

బాగా నీరసించిపోయాడు కామత్. మొదట దాహం తీర్చుకోవాలి! లేకుంటే అడుగు ముందుకు పడదు! జేబుల్లో తడిమి చూసుకున్నాడు. రివాల్వర్ తగిలింది గట్టిగా. నవ్వుకొని సూట్‌కేసుల్లో వెతికాడు. నీరు వుండదని అతనికి తెలుసు.

జ్యోతిర్మయి పరిస్థితి అంతకంటె హీనంగా వుంది. ఇక అడుగుకూడా ముందుకు కదిపే స్థితిలో లేరు.

రెండు సూట్‌కేసుల్లోనూ బంగారుకడ్డీలు వున్నాయ్. వాటిని చూస్తుంటే కోపం వస్తోంది కామత్‌కి. అతి కష్టం మీద తన్నుతాను కంట్రోల్ చేసుకొన్నాడు.

కోట్లు ఖరీదు చేసే సంపద వుంది తనవద్ద. ఎందుకు?

గుక్కెడు మంచినీళ్ళు కావాలి తనకిప్పుడు. ఎవరిస్తారు?

చటుక్కున కత్తితీసి జ్యోతిర్మయి గుండెల్లో పొడిచాడు కామత్. ఊహించని పరిణామానికి అరిచే శక్తికూడా లేక తలవాల్చేసింది జ్యోతిర్మయి. ఒక్కక్షణం ఆమె ముఖం లోకి దీనంగా చూసి, ఆత్రుతగా ఆమె గుండెల్లో స్రవిస్తున్న రక్తంతో పెదవులు తడుపుకోసాగాడు.

7

గాలిలో వేడి క్షణక్షణానికీ అధికమౌతోంది.

కామత్ గుండెల్లో దడ మొదలైంది.

మనుషుల ప్రాణాలు అవలీలగా తియ్యగలిగిన పరమ కసాయివాడు. ఇపుడు తన ప్రాణంగురించి యోచిస్తూ హడలిపోతున్నాడు. అతని ముఖంలో ప్రాణభయం ప్రళయ నృత్యం చేస్తోంది.

తను ఈ ఎడారిలో దిక్కుమాలిన చావు చావక తప్పదా?

ఏడుపు వస్తోంది కామత్‌కి. ఏడ్చి ప్రయోజనంలేదు. అది వినటానికూడా ఎవరూ లేరు. ఎటువంటి భావాలు కలిగినా ఇక తనొక్కడే! అన్నీ తనే అనుభవించాలి! తనలోనే దాచుకోవాలి! ఒంటరిగా చావటంలో.....నో! తను చావడు! చావకూడదు!! అతికష్టంమీద మరొక గంట నడిచాడు.

సూట్‌కేసులు ఇహ మొయ్యలేక నేలమీద పారేశాడు. ఎయిర్‌బేగ్ పారవెయ్యటానికి మనసు అంగీకరించలేదు. క్రింద పడున్న సూట్‌కేసుల్ని కాలితో తన్నాడు. కామత్ మెంటల్ క్షణక్షణానికీ హల్యూసినేషన్ దగ్గరగా వెళ్తోంది.

నిట్టూర్చి అక్కణ్నుంచి కదిలాడు కామత్. పదడుగులు వేశాడో, లేదో మనసు మార్చుకున్నాడు. గిర్రున వెనుదిరిగి సూట్‌కేసుల దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

సూట్‌కేసుల్లోని బంగారు కడ్డీలను ఇసుకలో పడేశాడు. వాటిని చూస్తూ ఏడవాలన్పించింది. ఏడ్చాడు. ఒక్కొక్క కడ్డీనే అందుకొని ఇష్టమొచ్చిన దిక్కుకు విసరిపారేశాడు. ఖాళీ సూట్‌కేసుల్ని బలంగా తన్నాడు.

ఏడుపు దిగమింగుకొని తిరిగి నడక ప్రారంభించాడు.

వెధవ బంగారం. అది పోయినా తను జీవించగలడు. వజ్రాలు చాలు తన జీవితమంతా హాయిగా గడవటానికి.

ఎయిర్ బేగ్‌లోంచి వజ్రాలు తీసి లెక్కపెట్టుకుంటూ నడవసాగాడు కామత్. మొత్తం నూట అరవై వజ్రాలు. రెండు జారి ఇసుకలో పడ్డాయ్. ఒంగి వాటిని అందుకోబోయాడు.

ఇంతలో ఏవో నీడలు అతనిమీది పడ్డాయ్.

ఎడారిలో నీడలా? చటుక్కున తలెత్తి చూశాడు.

ఎగురుతున్న రాబందులు కన్పించాయ్ ఆకాశంలో.

వజ్రాలు బేగ్‌లో పడేసుకున్నాడు. రాబందుల్ని చూడగానే కామత్ ధైర్యం మరింత సన్నగిల్లింది.

రాబందులు వున్నచోట మృత్యువు వుంటుంది. మృత్యువు పొంచివున్న ప్రదేశానికి రాబందులు ముందే వచ్చి చేరుతుంటాయ్!

పిచ్చికోపం వచ్చింది కామత్‌కి. జేబులోంచి రివాల్వర్ తీసి ఆకాశంలో ఎగురుతున్న రాబందుల్ని షూట్‌చేశాడు. బుల్లెట్లు మొత్తం గాల్లోకి దూసుకెళ్ళాయ్. రివాల్వర్ ఖాళీ అయ్యింది.

రివాల్వర్ పారేసి అటు యిటు చూశాడు కామత్. తళతళ మెరుస్తున్న ఎండమావులు కన్పించాయి నాలుగు వైపులా. రాబందుల సంగతి మర్చిపోయి హాయిగా, తృప్తిగా నవ్వుకున్నాడు.

"నీరు.... నీరు...." అరుస్తూ పరుగెత్తాడు.

కామత్‌కి నీరు చిక్కలేదు. ఎండమావులు అందనూ లేదు. మధ్యాహ్నం పన్నెండు గంటలైంది.

అరేబియన్ ఎడారి ఓ అగ్నిగుండంలా తయారై వుంది అప్పటికే. ప్రతి ఇసుక రేణువు, ప్రతి అంగుళం నేల సూర్యుని ప్రతాపానికి వేడెక్కి నిప్పులు కక్కుతున్నాయ్.

ఏం చేయాలో ఒక్కక్షణం పాలుపోలేదు కామత్‌కి. ఆ ఒక్క క్షణంలోనే అతను మెంటల్ హల్యూసినేషన్‌లోకి జారిపోయాడు. ఎడారిలో ఒంటరిగా చిక్కుకొనే నిస్సహాయుని ఆఖరు స్టేజ్ అదే!

ఆకాశంలో ఎగురుతున్న రాబందులు బెదిరేలా భీకరంగా నవ్వాడు కామత్.

వజ్రాలున్న బేగ్ ఎక్కడ జారిపోయిందో అతనికి తెలియదు. ఇంకా నవ్వుతూనే వున్నాడు. రాబందుల నీడలు అతనిమీద కదులుతున్నాయ్.

హఠాత్తుగా నవ్వటం ఆపేసి, ఒంటిమీదున్న బట్టలు చింపుకోవటం ప్రారంభించాడు కామత్. షర్టు, పాంటు, బనియన్.... ఒక్కొక్కటే చిరిగిపోయి ఇసుకలో పడ్డాయ్.

బనియన్ కూడా తీసివేయటంతో ఎండవేడి చుర్రున వీపుకి తగిలింది.

తృళ్ళిపడ్డాడు కామత్. పరుగు అందుకున్నాడు. ఎయిమ్ లెస్‌గా అటు యిటు పరుగులు పెడుతున్నాడు. "మంచినీళ్లు.. మంచినీళ్ళు...." అరుస్తూ ఎండమావుల్ని పట్టుకోవాలని చూస్తున్నాడు.

క్రింద ఇసుకలో కామత్ ఎటువైపు పరుగులు తీస్తుంటే అటువైపు ఎగురుతున్నాయ్ ఆకాశంలో రాబందులు. □□□

మృత్యుకౌగిలి!

వి. ఎస్. తెన్నేటి

సిగరెట్ వెలిగించుకుని గుండెనిండా పొగ పీల్చుకున్నాను.

ఈరోజు నాకు ఉద్రేకం, పగ, కసితోపాటు ఆనందం కూడ కలుగుతోంది. మళ్ళీ సీసా ఎత్తిపెట్టి విస్కీతో గొంతు తడుపుకున్నాను.

నాలుగు నెలలుగా నేను వెదుకుతున్న వ్యక్తి ఈరోజు నా కంటబడ్డాడు. ఆ క్షణంలో నా గుండె ఎంత వేగంగా కొట్టుకుందో, అది తలుచుకుంటే యిప్పుడూ అదే వేగంతో కొట్టుకుంటోంది.

ఈరోజు ఎనిమిది గంటలకు మూన్‌లైట్‌క్లబ్‌లో సెక్స్ బాంబ్ సబీనా కాబెరేడాన్స్ జరిగింది. కాషువల్‌గా చూడ్డానికి వెళ్ళిన నేను ఖరీదైన ఉలెన్ సూట్ ధరించి, క్లబ్‌లోకి ప్రవేశించిన వ్యక్తిని యాదృచ్ఛికంగా చూడటం జరిగింది.

నాకు దగ్గరలో వున్న రౌండ్‌టేబిల్ ముందు కూర్చున్నాడు. బేరర్‌ని పిలిచి బ్రాందీ ఆర్డర్ చేసాడు.

వెంటనే అతన్ని గుర్తు పట్టకపోయినా, పరికించిచూసి, ఉలిక్కిపడ్డాను. వాడే! వాడు నిస్సందేహంగా వినోదే!

కుడి కనుబొమ్మపైన గాటు చూసి గుర్తుపట్టగలిగాను. ఏడేళ్ళ క్రితం స్కూటర్ ఏక్సిడెంట్‌కి గురై, ఆసుపత్రిలో ఎడ్మిట్ అయ్యాడు. అప్పుడు భుజంమీద, కన్నుమీద అయిన గాయాలు తగ్గిపోయినా, మచ్చలింకా మిగిలే వున్నాయి.

లేచివెళ్ళి అమాంతంగా గొంతు నులిమి చంపెయ్యా లనుకున్నాను. కాని, అది తెలివైన పని కాదనిపించింది.

గెడ్డం, మీసం, జుత్తు ఒత్తుగా పెరిగిపోయి, పూర్వం కంటే మారిపోవటంవలన, ఆరు సంవత్సరాలుగా నన్ను చూడకపోవటంవలన, వినోద్ నన్ను గుర్తుపట్టటం అసం భవం!

నేనూ అతన్ని అంత నిశితంగా చూడకపోయి ఉంటే, గుర్తుపట్టగలిగేవాడ్ని కానేమో. మనిషి పూర్వం కంటే లావెక్కి, ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు.

సెక్సబాంబ్ సబీనా డాన్స్ ముగిసిన తర్వాత వినోద్ బిల్ పేచేసి, బైటికి నడిచాడు. నేను అతన్ని అనుసరిం చాను. టాక్సీ పిలిచి ఎక్కగానే, నేనూ వెంటనే మరో టాక్సీ ఎక్కి, అతన్ని వెంబడించాను.

'మేనక హోటల్' ప్రక్క వీధిలోకి మలుపు తిరిగి, ఓ నీలం గేటు ఇంటిముందు ఆపాడు టాక్సీని. నేను హోటల్ దగ్గరే టాక్సీ ఆపించి, దిగాను. వినోద్ గేటు తెరుచుకుని లోనికి వెళ్లాడు.

రెండు టాక్సీలు వెళ్ళిపోయిన తర్వాత—నేను ఇంటి దగ్గర కెళ్ళాను.

'కె. వినోద్‌కుమార్-ప్రొప్రయిటర్-పార్వతీ ప్రింటింగ్ ప్రెస్' అని గేటుకి వ్రేలాడుతున్న బోర్డు చూసి. నివ్వెర పోయాను.

అయితే మొత్తానికి పార్వతిని పెళ్ళి చేసుకున్నాడన్న మాట.

గేటు తెరుచుకుని, విసురుగా లోనికి ప్రవేశించి, వినోద్‌ని కేకేసి. రివాల్వర్‌తో షూట్ చేసి పారెయ్యాలను కున్నాను. కానీ నాలో వున్న దుర్గుణం ఏమిటో నాకు తెలుసు. అదే—ప్రతి విషయంలో తొందరపడటం.

ప్రాణాలు తీసే వ్యవహారాల్లో తొందరపడితే, ఫలితం దక్కదు సరికదా, నా లక్ష్యం నెరవేరదు. నా పగ చల్లారదు!

అందుకే మెల్లిగా వినోద్ ఇంట్లోకి ప్రవేశించి,ముందుగా. కిటికీల్లోంచి చూసాను. మొదటి రెండు గదుల్లో ఎవరూ లేరు. మూడవగది బెడ్‌రూం. మంచంమీద పడుక్కున్న పార్వతి లేచి కూర్చుంది. బూట్లు విప్పి, బట్టలు మార్చు కుంటున్నాడు వినోద్.

"పార్టీ ఎలా జరిగింది?" అడిగింది పార్వతి.

"బాగానే జరిగింది...."

"ఈ రోజు సబీనా డాన్స్ వుంది. క్లబ్‌కి వెళ్తానన్నారు వెళ్ళారా?"

"వెళ్ళాను పారు, అక్కడినుంచే వస్తున్నాను—"

"ఎలా డాన్స్ చేసింది?"

"ఏముంది మామూలే! ఏదైనా నువ్వు డాన్స్ చేసినట్లుం టుందా?"

ఆమె భుజంమీద చెయ్యివేసి దగ్గరికి లాక్కున్నాడు వినోద్.

"మరి నా డాన్స్‌మీద అంత మోజున్నవారు, అక్కడి కెందుకు వెళ్ళారు?"

"వాట్ డు యు మీన్, నాకు భరతనాట్యం ఇష్టం అన్నాను కాని, క్యాబ్రే డాన్స్ ఇష్టలేదనలేదే! జస్ట్ ఫర్ ఎ చేంజ్. ఏం వెళ్ళకూడదా?"

"పోనీ ఓ పని చెయ్యకూడదూ?"

"ఏమిటి?"

"భరతనాట్యతార పార్వతిని వివాహమాడినట్లే, ఆ సెక్స్‌బాంబ్ సబీనాని కూడ పెళ్ళి చేసుకోండి, కావల్సినప్పుడల్లా కన్నులవిందుచేసే నృత్యాలు చూసి ఆనందించవచ్చు" నవ్వుతూ అంది.

"నాన్సెన్స్. నువ్వుండగా మరొకరినా! నెవ్వర్! నీలో వున్న అందం, ఆకర్షణ సబీనాలో ఎక్కడుంది? నేను నిన్ను ప్రేమించటమేకాదు డియర్ ఆరాధిస్తున్నాను...." అంటూ పార్వతిని కౌగిల్లో బిగించాడు. గువ్వలా ఒదిగిపోయింది ముసి ముసి నవ్వులు నవ్వుతూ — వినోద్ కౌగిల్లో.

రాస్కెల్! ఎంత ప్రేమ నటిస్తున్నాడు. పాపం — పార్వతికేం తెలుసు, వాడి కౌగిల్లో ఎంతమంది అమ్మాయిలు కరిగిపోతున్నారో! మాధవిలాంటి అమాయకులు నలిగిపోయారో!

మాధవిని తల్చుకోగానే నాకు పట్టరాని కోపం కలిగింది వినోద్‌పైన, అటువంటి నమ్మకద్రోహికి తగిన శిక్ష విధించకపోతే — నాకు నిద్ర పట్టదు! నా కసి తీరదు!

ఆ క్షణానికి తమాయించుకొని, తిరిగి వచ్చేసాను నా గదికి.

మళ్ళీ సిగరెట్ వెలిగించుకుని రిస్టువాచివైపు చూసుకున్నాను. సమయం పన్నెండుగంటలు దాటింది.

విస్కీసీసా ఎత్తిపెట్టి గటగట తాగేసి, ఖాళీసీసా బల్లమీద పెట్టాను.

నా మాధవి నా కళ్ళముందు కదిలింది. నాకు 'నా' అంటూ ప్రపంచంలో మిగిలిందల్లా నా ముద్దుల చెల్లాయి మాధవి. నా కళ్ళుచెమ్మగిల్లాయి। కుర్చీలో వెనక్కి వాలాను. గతం కళ్ళముందు కదిలింది।

2

నేను, వినోద్ కలిసి జేబు దొంగతనాలు చేసేవాళ్ళం. ఎంతో తెలివిగా అబద్ధం ఆడి, నేను ఉద్యోగంచేసి సంపాదిస్తున్నానని చెల్లాయిని నమ్మించి, చదివించేవాడిని.

సంపాదించిన డబ్బుతో మేడలు కట్టటం అసంభవమని మాకు తెలుసు. సంపాదన ఎక్కువైనరోజు చెల్లాయికి బట్టలు, పువ్వులు కొని తెచ్చేవాడిని. లేకపోతే రొట్టె తిని నిద్రపోయేవాళ్ళం.

ఆ దరిద్రపు జీవితం ఎంతకాలం గడపటం? అందుకే— జేబు దొంగతనాలు మాని కాస్త పెద్ద దొంగతనాలు చెయ్యాలని తల్చుకున్నాం. తత్ఫలితంగా, నాలుగైదు దొంగతనాల్లో విజయం సాధించి, కొంత ఖరీదైన జీవితం గడపగలిగాం.

ఖరీదైన దుస్తుల్లో చెల్లాయి పెళ్ళికూతురిలా కళకళలాడేది. డబ్బుంటే మనిషి విలువ ఏ విధంగా పెరుగుతుందో, తెల్సుకున్న మేము లక్షలు సంపాదించాలని నిశ్చయించుకుని, ఓ చక్కటి పథకం వేసాం. దురాశ మమ్మల్ని మరింత మూర్ఖుల్ని చేసింది.

నగల వర్తకుడు బంగారయ్య ఇంట్లోకి తెలివిగా ప్రవేశించి, నాలుగులక్షలు విలువచేసే నగలు, నోట్లకట్టలు బ్రీఫ్ కేసులో నింపుకున్నాం. కానీ దురదృష్టవశాత్తు గూర్ఖా కంట బడ్డాను. నేను పట్టుబడిపోయినా, వినోద్ ఎవరి కంటబడకుండా జారుకున్నాడు.

జైల్లోవున్న నన్ను వినోద్ కలవటానికి ప్రయత్నించి విఫలుడైయ్యాడు. ఆ తర్వాత వినోద్ మళ్ళీ నా వద్దకు రాలేదు.

ఇంతకాలంగా కారాగారశిక్ష అనుభవించిన నేను— నాలుగు నెలల క్రితమే విడుదలయ్యాను.

చెల్లాయి మాధవి ఎలాగుందో, ఎక్కడుందో తెల్సుకోవాలనే తపనతో నా పాత నివాసం దగ్గరకెళ్ళాను. వినోద్, నాకు ఆప్తమిత్రుడు; నామీద అభిమానంతో మాధవిని జాగ్రత్తగా చూసుకుంటున్నాడని అనుకున్నాను.

కానీ మా పాత ఇంటియజమాని శరభయ్యని అడగగానే గొల్లుమని నవ్వాడు. ఆ వెకిలినవ్వు వెనుక ఎన్నో అర్థాలు, భావాలు గోచరమయ్యాయి.

"ఏమిటీ మాధవా? ఆమె ఇంకా ఇక్కడెందుకుంటుందయ్యా. నువ్వు నమ్ముకున్న నీ ప్రాణమిత్రుడు నువ్వు లేని సమయం అవకాశంగా ఉపయోగించుకుని ... ఆ అమాయకురాలిని మలినం చేశాడు ..."

"శరభయ్యగారూ—" అరిచాను.

"ఎందుకయ్యా గొంతు చించుకుంటావు. నా మాటలు నమ్మకపోతే ఊర్లో పెద్దమనుషుల్ని అడిగిచూడు. నీ ముఖం మీద ఉమ్మేతారు. ఆ పిల్ల బుద్ధిమంతురాలు కాబట్టి ఏమయ్యో గొయ్యో చూసుకునే వుంటుంది. అయినా నీ కదేం

బుద్ధి నాయినా! దొంగతనంచేసి, జైల్లో పడ్డావటగా...."

అంటుండగా, శరభయ్య పెళ్ళాం కాంతం ఇంట్లోంచే అరిచింది-

"ఆ దొంగ వెధవతో మాటలేమిటండి. తలుపు మూసి, లోపలికి రండి!" అంటూ.

ఔను — నేను దొంగనే. ఈ దొంగగారికి అంతకంటే ఏం సన్మానం చేస్తారు?!

అక్కడనుంచి ఆమెను నేను చదివించే స్కూలుకెళ్ళి, లెక్కల మాష్టారు వెంకట్రావుగారిని కలిసి, మాధవి గురించి అడిగాను. ఆయన అదే సమాధానం చెప్పాడు.

"మాస్టారూ-" అని ఏడ్చాను. ఏడిస్తే ప్రయోజనం లేదని-తెలుసుకున్నాను. ఉద్రేకాన్ని, ఆవేశాన్ని, దుఃఖాన్ని గుండెల్లోనే దాచుకుని, వినోద్ కోసం వెదకసాగాను.

వాడు నా కంటబడితే ముక్కలు ముక్కలుగా నరికి పారెయ్యాలనుకున్నాను.

ప్రశాంతమైన వాతావరణంలో అద్దెకు గది తీసుకున్నాను. ఉద్యోగంచేసే అర్హతనాకులేదు. కూలిచేసే ఓపికలేదు.

నాకు బాగా అలవాటైన, సులభమైన వృత్తిని వదల కుండా, ఖరీదైన కోటు జేబుల్లోంచి బరువైన పర్సులు జాగ్రత్తగా దొంగిలించి, ఎవరితోనూ సంబంధం ఏర్పరుచు కోకుండా, కేవలం వినోద్ ని చంపటమే ధ్యేయంగా భావించి, జీవిస్తున్నాను.

హోటల్ మూన్ లైట్ లో సెక్స్ బాంబ్ సబీనా డాన్సు చూడటానికి వెళ్ళిన నాకు, వినోద్ కంటబడగానే, ఆకా శాన్ని అందుకున్నట్లు ఫీలయ్యాను. నా జీవితలక్ష్యం నెర వేర బోతున్నందుకు సంతోషించాను.

మాధవినేంచేసాడో ఒక్కసారి ఊహించుకుంటే, నా రక్తం ప్రతీకారవాంఛతో ఉరకవేస్తోంది। కామాంధకారంతో కళ్లు మూసుకుపోయి, నా ముద్దుల చెల్లెలు మాధవి జీవితాన్నే సర్వనాశనంచేసిన ఆ రాక్షసుడి రక్తం కళ్ళ చూడాలి.

3

రిస్టువాచి చూసుకున్నాను. ఒంటిగంట ఇరవై నిముషాలై య్యింది. 'హోటల్ మేనక' మూసివుంది.

చీకట్లో నిలబడి సిగరెట్ చివరిసారి పీల్చుకుని, క్రింద పడేసాను.

హోటల్ ప్రక్క వీధిలోకి చకచక నడిచాను. నీలం రంగు గేటుమీద బోర్డు మరోసారి చదువుకున్నాను. కోపంతో పళ్ళు పటపట లాడించాను. ఛంగుమని కాంపౌండ్ వాల్ మీదుగా లోనికి దుమికాను।

ముందు కిటికీల్లోంచి జాగ్రత్తగా చూసాను.

మొదటి గదిలో బల్లమీద ఏదో రాసుకుంటున్న వినోద్, పుస్తకంమీదే తలవాల్చి నిద్రపోతున్నాడు. ఏదో ప్రెస్ విషయాలు రాసుకుంటూ, నిద్రపట్టి పడుకుని ఉండాలి. రెండో గదిలో ఎవరూలేరు. మూడో గదిలో-బెడ్ రూంలో పార్వతి-నిద్రపోతోంది.

సాలోచనగా తల పంకించి వీధి తలుపు దగ్గరకొచ్చాను.

కాలింగ్ బెల్ నొక్కకుండా-తలుపు తట్టాను. వినోద్ తెరుస్తాడా, అతని భార్య తెరుస్తుందా? పార్వతే తెరుస్తే ఏంచెయ్యాలి? స్పృహ పోగొట్టాలి।

ఎవరూ కదిలినట్లు లేదు. మళ్ళీ తలుపు చప్పుడుచేసాను.

ఈసారి ఎవరో కదిలిన అలికిడై య్యింది. కాస్సేపటికి

తలుపు తెరుచుకుంది. వినోదే-తలుపు తెరిచాడు.

అమాయకంగా ఓ చిరునవ్వు నవ్వి, నమస్కరించాను.

"సారీ టు డిస్టర్బ్ యు. నాపేరు జయచందర్, నేను 'తార' పత్రిక రిపోర్టర్ని. మీతో పనుండి వచ్చాను" అన్నాను.

"మోస్ట్ వెల్ కం. రండి—" సాదరంగా ఆహ్వానించాడు.

"మీ దగ్గర మహాత్మాగాంధి బ్లాక్ వుందా?—"

"వుంది—" అన్నాడు వినోద్.

"దయచేసి ఆ బ్లాక్ చూపించగలరా—"

"ప్రెస్‌లో వుంది. ఇప్పుడు అర్జెంట్ అయితే—"

"ఇట్సాల్ రైట్. లెటర్‌పాడ్, పెన్ తీసుకురండి దయచేసి" అన్నాను.

"ఇప్పుడే వస్తాను—" అని లోనికి వెళ్ళాడు.

అతను వెనక్కి తిరిగి, లోనికి వెళ్ళగానే గబుక్కున లేచి తలుపు దగ్గర కెళ్ళాను. మెల్లిగా గదిలో ప్రవేశించి, జేబులో కత్తిమీద చెయ్యివేసాను.

బల్ల సొరుగు తెరచి వెదుకుతున్నాడు వినోద్. గభాల్న గదిలోకి దుమికి-కత్తిని కసిగా అతని వీపులోకి దిగేసాను. కిసుక్కుమని.

వినోద్ కెవ్వుమని అరిచాడు. పూర్తిగా కేక పెగలకుండా, నోరు నొక్కేసాను.

"ఏమిండీ-" అరుస్తూ వచ్చింది అతని భార్య పార్వతి.

ఆలస్యం చెయ్యకుండా, మెరుపులా దుమికి, ఆమె జబ్బ పట్టుకుని లోనికి ఈడ్చేసాను. కత్తి చూపించాను హెచ్చరికగా. నాలో పైశాచిక శక్తి చిందులేస్తోంది.

"అరవకు—! నీ ప్రాణాలు కూడ పోతాయి—"కర్క శంగా అన్నాను.

క్రింద పడిన వినోద్ పళ్ళు బిగువున బాధ అణుచుకుంటూ, "ఎవరు నువ్వు? నన్నెందుకు చంపావు?—" అని అడిగాడు.

నా గుండెల్లో ఏదో తెలియని భావం ఉప్పొంగి నన్ను కలవర పెడ్తోంది. అప్పుడు నాలో ఏదో తెలియని ఆనందం కలిగింది. కసిగా, వికటాట్టహాసం చేసాను.

"ఔను వినోద్. నన్ను గుర్తు పట్టలేనంత మారి పోయావు. నువ్వు ఎంతో ఎత్తు ఎదిగిపోయావు! నిజంగా నన్ను గుర్తుపట్టలేదా?" ఆవేశంగా అడిగాను.

"నువ్వా—నువ్వా ప్రశాంత్" నా కంఠం గుర్తుపట్టి, వణుకుతున్న స్వరంతో పలికాడు వినోద్.

"ఏం ఆశ్చర్యపోతున్నావా? నువ్వెక్కడున్నావో ఎలా తెల్సుకున్నానని నివ్వెరపోతున్నావా?"

"లేదు ప్రశాంత్. నువ్వు విడుదలయ్యావని తెలిసుంటే నేనే స్వయంగా వచ్చి, మా ఇంటికి తీసుకువచ్చేవాడ్ని!"

"హుం? అంత గౌరవం వున్నవాడివి-ఒక్కసారైనా నన్ను కలవటానికి జైలుకి రాలేదేం?"

"అబ్బ—" ఏదో చెప్పబోయాడు.

"నా చెల్లాయి మాధవిని నీ కామానికి బలిచేసింది చాలక—"

"ప్రశాంత్!" అరిచాడు వినోద్.

"తెలుసుకున్నాను వినోద్. అందుకే-నాలుగు నెలలుగా నీకోసం ఊరంతా గాలించాను. యింతకాలానికి నాకంట బడ్డావు!"

"ఎంతమాటన్నావు ప్రశాంత్! మాధవి, నీకు చెల్లె

లయితే నాకుమాత్రం కాదా? నీకు-నేనంతటి దుర్మార్గుడిగా కనిపించానా, యింతేనా ప్రశాంత్ నువ్వు నన్నర్థం చేసుకున్నది?"

ఆశ్చర్యపోతూ-"ఏమిటి నువ్వనేది?" అన్నాను.

"చెల్లాయి మాధవి సురక్షితంగానే వుంది ప్రశాంత్!"

"ఆఁ!" నాగుండె గుభిల్లుమంది.

"ఔను ప్రశాంత్! నీ చెల్లాయి మాధవిని డాక్టర్ అమరేంద్రకిచ్చి నేనే స్వయంగా పెళ్ళి చెయ్యించాను."

"వినోద్!!" ఎవరో కొరడాతో నా వీపుమీద ఛెళ్ళుమని చరిచినట్లై అరిచాను.

"ఔను ప్రశాంత్. నిన్ను పోలీసులు ఎరెస్ట్ చేసిన తర్వాత నిన్ను కలటానికి ప్రయత్నించాను. కలవనివ్వలేదు. నేను ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిలో చేరాను. చెల్లెమ్మ చదువుకి భంగం కలగనివ్వలేదు.

ప్రశాంత్! నాకు పార్వతిపైన ఎంత అభిమానమో నీకు తెలుసు. ఆమె భరతనాట్యం ఎక్కడ జరిగినా, తప్పక చూసేవాడ్ని. అందుకే ఆమెవెనుక తిరిగీ తిరిగి, ఒకనాడు ధైర్యంచేసి, నా మనసులో మాట చెప్పాను. తను పవిత్రమైనది కాదని, తనకి పెళ్ళికాకుండానే ఓ బిడ్డపుట్టి పోయాడని చెప్పింది. అయినా నేను పెళ్ళికి వెనుకాడలేదు. పార్వతి నా సొంత మయ్యింది.

ఇక-చెల్లెమ్మ భవిష్యత్తు బంగారుబాట కావాలంటే-ఆమె అన్నయ్య దొంగ అని, జైల్లో వున్నాడని తెలియకూడదని, నిన్ను కలిసే ప్రయత్నం చెయ్యలేదు. భరతనాట్యం ద్వారా పార్వతి సంపాదించిన డబ్బుతో ఓ ప్రింటింగ్ ప్రెస్ తెరిచాను. మాధవిని మెడిసిన్‌లో చేర్పించాను.

అదృష్టం బాగుండి, పార్వతి స్నేహితురాలి ద్వారా-

మాధవికి మంచి సంబంధం కుదిరింది. డాక్టర్ అమరేంద్రతో వివాహం జరిగిపోయి మూడు సంవత్సరాలై య్యింది. అబ్బ!" మళ్ళీ బాధగా మూల్గాడు వినోద్.

"ఆమెకు ఇప్పుడు ఇద్దరు పిల్లలు. ఒక కొడుకు-ఒక కూతురు-" వినోద్ కంఠస్వరం క్షీణించిపోతోంది.

జీవితంలో నేను మళ్ళీ మరోసారి తొందరపడి భయంకరమైన తప్పటడుగువేసాను. ఘోరమైన అపరాధం చేసాను!

"నేను మహాపాపిని వినోద్! శరభయ్య మాటలు నమ్మి నిన్ను అపార్థం చేసుకున్నాను. నిన్ను చంపటానికి సిద్ధపడ్డాను" నా గొంతు జీరబోయింది.

నీరసంగా నవ్వాడు వినోద్-"మాధవిని బలవంతం చెయ్యబోయిన శరభయ్యను చితకతన్ని, అతనికి దూరంగా తీసుకుపోయినందుకు-ఆ పెద్దమనిషి నా గురించి-అవిధంగా ప్రచారంచేసాడు ప్రశాంత్! ఆ మాటలు నువ్వు నమ్ముతావని కలలో కూడ అనుకోలేదు-పార్వతీ! నేను వెళ్ళిపోతున్నాను పార్వతీ___"

నూతిలోంచి వస్తున్నట్లున్నాయి వినోద్ మాటలు.

"ఏమండి-" వెక్కి వెక్కి ఏడుస్తోంది పార్వతి.

జలపాతంలా వర్షిస్తున్న ఆమె కళ్ళవైపు, వణుకుతున్న ఆమె పెదాలవైపు చూడగానే-పగ, కసి. ఉద్రేకం కలిగింది నామీద నాకే! కన్నీళ్ళు ఉప్పొంగి బైటికొచ్చాయి-నా కళ్ళల్లోంచి!

"ఏడవకు. మన చిన్నతనపు రోజులు తల్చుకుని-ఆనందంగా కళ్ళు మూస్తాను. కానీ ఒకటి-డాక్టర్ అమరేంద్రకి మాత్రం, మాధవి అన్నయ్య ఒక దొంగ అని, ఓ హంతకుడని-తెలియనివ్వకు పార్వతీ!" అంటూ ఆమె

కన్నీరు తుడిచాడు.

"ఏడ్చి ప్రయోజనంలేదు....జరిగేది....జరిగిపోతాయి."

అతని ముఖం ఎరుపెక్కింది. అతని పెదాలు కదిలాయి. స్పష్టంగా మాటలు పలకలేదు. అది చివరిక్షణపు పెనుగులాట. ఠక్కున తలవాల్చేసాడు వినోద్.

"ఏమండీ-" వినోద్ గుండెలపైన తలవాల్చి ఏడుస్తున్న పార్వతిని చూడగానే నాగుండె చెరువైపోయింది.

"అమ్మా పార్వతి! నేను మహాపాపిని! నిన్ను క్షమించమని కోరే అర్హత నాకులేదు. నేను పరమ కిరాతకుడ్ని-" నా మనసులో చెలరేగుతున్న బాధను మాటల రూపంలో వ్యక్తం చెయ్యటానికి, అంతకంటే ఏంచెయ్యాలో ఆ క్షణంలో నాకు తోచలేదు.

4

"ఏమో నాకుతెలీదు ఇన్‌స్పెక్టర్. ఆయన రాత్రి సమయాల్లో ప్రెస్‌కు సంబంధించిన విషయాలు రాసుకుంటూ ఉంటారు. అర్ధరాత్రి కేక వినిపించేసరికి లేచి గదిలో కొచ్చాను. అప్పటికే హంతకుడు పారిపోయాడు...." అంది పార్వతి.

వినోద్ శవాన్ని పోలీసులు పరీక్షిస్తుంటే, నేను ఎవరికి కనిపించకుండా రహస్యంగా నిల్చున్నాను.

అదేక్షణంలో ఫైట కారు ఆగిన చప్పుడు వినిపించింది. కాస్సేపటికి మాధవి, ఆమె ప్రక్కనే మరో యువకుడు-లోనికి వచ్చారు.

నా గుండె ఆనందంగా కొట్టుకుంది. మాధవి ఎంత మారిపోయింది. వినోద్ ఆమె జీవితాన్ని బంగారు బాటలోకి మళ్ళించినందుకు, నేను చేసిన మేలు, చూపిన కృతజ్ఞత ఇదన్నమాట.

మాధవి ప్రక్కనున్నది డాక్టర్ అమరేంద్ర. వాళ్ళిద్దరూ కంగారుగా వినోద్ శవం దగ్గర కెళ్ళారు.

"అన్నయ్యా—" అంటూ వినోద్ కాళ్ళ దగ్గర కూర్చుని ఏడుస్తోంది మాధవి. 'అన్నయ్యా' అని పిలిచింది నన్నుకాదు, వినోద్‌ని! నాకు ఆ అదృష్టంలేదు!

"ఎవరు చేసారు పార్వతీ ఈ దారుణం? ఎవడా రాక్షసుడు??" అంది మాధవి.

'నేనేనమ్మా' అని ఎలా చెప్పను? నామీద నాకే అసహ్యం వేసింది.

చెల్లాయిని చూసాను. నా కోరిక తీరింది. ఆమె క్షేమంగావుంది, అంతేచాలు. యిక నేను అక్కడుండ కూడదు. ఆమె ఏడుస్తుంటే-నేను చూడలేను.

రహస్యంగా పెరటివైపుకి జారుకున్నాను. తలుపు తెరుచుకుని బైటికి పరుగెత్తాను!

* * *

నా గది తలుపులు దగ్గరకు వేసివున్నాయి. రిస్టువాచి చూసుకున్నాను. మూడు గంటలు దాటుతోంది.

నిముషాలు గడిచిపోతున్నాయి.

పోలీస్ యిన్‌స్పెక్టర్ లోనికివచ్చాడు.

"వచ్చారా ఇన్‌స్పెక్టర్. వెల్‌కం. మీకు టెలిఫోన్ చేసింది నేనే—" ముద్ద ముద్దగా వున్నాయి నా మాటలు.

"వ్వాట్?" ఆశ్చర్యంగా చూసాడు ఇన్‌స్పెక్టర్.

"ఔను. నా బాల్యమిత్రుడు వినోద్ ప్రాణంతీసిన కిరాతకుడ్ని నేనే. ఒకసారి నన్ను దొంగగా ఖైదుచేసారు. ఈసారి నన్ను హంతకుడిగా ఖైదు చేస్తారా?" నా మాటలు నాకు స్పష్టంగా వినిపించలేదు.

ఇన్‌స్పెక్టర్ చేతిలో రివాల్వర్ వైపుచూసి, వెటకారంగా

నవ్వుతున్నాను. పాపం అమాయకుడు! అతనికేం తెలుసు, నేను మృత్యు కౌగిలిలో వాలిపోతున్నానని!!

నన్ను ఎరెస్టు చేద్దామని ముందుకొచ్చిన ఇన్‌స్పెక్టర్ వైపు మూసుకుపోతున్న కళ్ళతో చూస్తూ పిడికిలి విప్పాను.

నా చేతిలోంచి చిన్న 'పాయిజన్' సీసా జారిపడింది. ఆ క్షణంలో ఇన్‌స్పెక్టర్ ముఖ కవళికలు ఏవిధంగా మారాయో గమనించే శక్తిలేదు నాలో. ప్రశాంతంగా కళ్లు మూసుకున్నాను. □□□

ముద్దులకోసం....

బాబు నిద్రపోతున్నాడు. బాగా ముద్దొస్తున్నాడు. బాబును ఊరికే ముద్దులు పెట్టుకుంటుంది మేనక.

"ఎందుకు వాడ్ని అలా చీటికీ మాటికీ ముద్దులు పెట్టుకుంటావ్. ఆముద్దు లేవో నాకు పెట్టకూడదా_" అని దెప్పిరించాడు భర్త సుధాకరం.

మేనక నవ్వి, "వాడు చూడండీ_నిద్రలోకూడా ఎంత ముద్దొస్తున్నాడో..." అంది.

"అయితే, నే రావడంలేదా_"

"మీరు నిద్రపోతుంటే ఆమడదూరం పరిగెత్తి పోవాలనిపిస్తుంటుంది. ఇక ఇప్పుడైతే సిగరెట్ కంపు..." అంది ముక్కు మూసుకుంటూ.

అంతే! అప్పట్నించి సిగరెట్లు మానేసి, నోట్లో వేలేసుకొని బుద్ధిమంతుడిలా నిద్రపోసాగాడు సుధాకరం.

—కె. రవీంద్రప్రసాద్.

పాత కబుర్లు - కొత్త వ్యక్తి

జొన్నలగడ్డ రామలక్ష్మి

"వసూ!" అన్నాడు రాజారావు.

వసుంధర నవ్వింది—"ఇంకా బాబి నిద్రపోలేదు."

"వెధవవాడికెప్పుడూ వెంటనే నిద్రరాదు—" అని "వాడిని జోకొడుతూ ఏమైనా కబుర్లు చెప్పు" అన్నాడు రాజారావు.

"ఏం కబుర్లు చెప్పను?"

"పెళ్ళయిన కొత్తలో మరపురాని అనుభూతులేవైనా గుర్తుచేయి...."

వసుంధర చిరాకునటించి — "పాతవి గుర్తుచేసుకోవడమంటే నాకు మహచిరాకు" అంది.

"అలా అనకు. అందులోనే ఎంతో మాధుర్యముంది."

"లేదని నేననను కానీ నాకో భయముంది. ప్రతి విషయంలోనూ మీరు పాతనే కోరుకుంటారు. సినిమాలు వస్తే పాతవే బాగుంటాయని కొత్తవి వదలిపెట్టి పాతవి

చూస్తారు. పాటలు విందామంటే ఈ పేపురికార్డర్లో ఎప్పుడూ పాతపాటలున్న టేపులే వింటారు. పుస్తకాల విషయం లోనూ అంతే. చదివినవే మళ్ళీమళ్ళీ పాతవే చదువుతారు కానీ కొత్తవి నచ్చవు మీకు...."

"మగవాడలాగుండడం ఆడవాళ్ళ అదృష్టమే అంటాను. లేకపోతే పెళ్ళాం పాతబడిపోయిందని...." అర్థోక్తిలో ఆగి పోయాడు రాజారావు.

వసుంధరనవ్వి — "మనుషులు ప్రవహించే నదులవంటి వారు. నిత్యనూతన్న భావోద్రేకాలతో-పాతబడని నదీ జలా ల్లాగే వాళ్ళు పాతబడరు. ఎటొచ్చీ మీబోటివాళ్ళతో నేతంటా. పాతబడితేగానీ ఏదీ నచ్చదు...." అంది.

"అదికాదు వసూ—మన పెళ్ళి మేనెల రెండోవారంలో కాబోలు జరిగింది. తర్వాత నువ్వు మనుగుడుపులకు మా ఊరు వచ్చావు. ఎంత అందమైనది మా పల్లెటూరు! మన మిద్దరం షికారుగా కాలవకు బయల్దేరాం. అప్పుడు కాలవ కట్టేశారేమో-సరదాగా ఆ ఇసకలోంచీ నడుచుకుంటూ గట్టు అవతలవైపునున్న రాజవరం వెళ్లాం. అప్పుడు...."

"ఆపండి బాబూ మీ పాత కబుర్లు" అంది వసుంధర.

"ఏం నచ్చలేదా?"

"నచ్చకకాదు. బాబికూడా నిద్రపోయాడు."

రాజారావు చటుక్కున వసుంధర పక్కగా జరిగి— "అయితే పిల్లలందరూ నిద్రపోయారన్నమాట. మరి పాత కబుర్లు మాని కొత్త కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు. వసుంధరకూడా భర్తకు మరింత దగ్గరగా జరిగి చటుక్కున వెనక్కు వెళ్ళిపోయింది. ఎవరో తలుపుతట్టారు.

విసుక్కుంటూ లేచి నిలబడ్డాడు రాజారావు. పైము

చూసుకుని "పదింపావు. ఇంతరాత్రివేళ ఇప్పుడొచ్చిన అతిథి ఎవరో?" అనుకుంటూ వెళ్ళి తలుపుతీశాడు.

"నా పేరు కృష్ణశాస్త్రి" అన్నాడు తలుపుతట్టిన ఆ ఆగంతకుడు.

రాజారావు మాట్లాడకుండా ప్రశ్నార్థకంగా ఆగంతకుని వంక చూశాడు. ఆగంతకుడి రూపమూ. పేరుకూడా అతనికి అపరిచితాలే.

తానందించిన సమాచారం చాలదని గుర్తించిన ఆగంతకుడు "నేను పేరవరంనుంచి వస్తున్నాను. నా దా ఊరు కాదనుకోండి. కానీ ఏదో పనిమీద మా చుట్టాలింటికా ఊరు వెళ్ళి పదిరోజులున్నాను. నేనిక్కడికి బయల్దేరుతున్నానని తెలిపి మీ నాన్నగారో కబురు పంపించారు. రేపు మీరు అర్జంటుగా బయల్దేరి పేరవరం వెళ్ళాలి. ఆయన మీకో ఉత్తరంకూడా ఇచ్చారు" అంటూ జేబులోనికి చేయిపోనిచ్చి ఓ కవరు తీసి రాజారావుకి అందించాడు.

రాజారావా కవరు అందుకున్నాడు "కొంచెం ముందుగా సమాచారమందించడం మంచిదని ఇలా సమయంకాని సమయంలో వచ్చాను. రేపు నేను తిరిగి పేరవరం వెడుతున్నాను. అభ్యంతరం లేకపోతే నా కార్లో రావచ్చు" అన్నా డాగంతకుడు.

"మీ మకాం ఎక్కడ?"

"రాజమహల్ హోటల్లో!"

"కావాలనుకుంటే ఈ రాత్రికిక్కడే విశ్రాంతి తీసోకవచ్చు" అన్నాడు రాజారావు.

"వద్దులెండి. ఉదయం మళ్ళీవస్తాను" అన్నాడు ఆగంతకుడు కదలడానికి సిద్ధపడుతూ.

"పేరవరంలో మీ బంధువులన్నారు—ఎవరు?"

"రామచంద్రంగారు" అన్నాడు ఆగంతకుడు.

"సరేలెండి. రాత్రి కిక్కడుండడం కుదరదంటున్నారు కాబట్టి ఉదయమే బయల్దేరి కాఫీకి మా యింటికి వచ్చేయండి. కాసేపు మాట్లాడుకుందాం. మీకోసం ఎదురుచూస్తూంటాను" అన్నాడు రాజారావు.

2

ఆగంతకుడు వెళ్ళిపోయేక రాజారావు కవరుచింపి చూశాడు. లోపల ఒక ఉత్తరముంది.

అందులో మొదటివాక్యం తండ్రి అతన్ని ఆశీర్వదిస్తూ వ్రాశాడు. కానీ రాజారావు తర్వాత వాక్యాలు చదవలేదు. ఆ దస్తూరీ తండ్రిదికాదు. అతను మరి ఉత్తరాన్ని చదవకుండా భార్యకందించి "ఇది మా నాన్నగారి దస్తూరీయేనంటావా?" అనడిగాడు.

మామగారి దస్తూరీ వసుంధరకు బాగా తెలుసును. ముత్యాలకోవలాంటి ఆయన దస్తూరీకీ వంకరటింకరగా అక్షరాలున్న ఈ దస్తూరీకీ ఏమీ సంబంధం లేదు.

ఆమె గబగబా ఉత్తరం చదివి "ఊరికే అనవసరంగా కంగారుపడతారేం. మామగారి కుడిచేతికి దెబ్బతగిలి ఈ ఉత్తరం కృష్ణశాస్త్రిగారిచేతే రాయించారట. ఆమాట ఆఖరున రాశారు" అంది.

రాజారావు తనూ గబగబా ఉత్తరం చదివాడు. తను అర్జంటుగా బయల్దేరి ఇంటికి వెళ్ళాలి. పేరవరంలో భూములు చవగ్గా అమ్మకానికి వచ్చేయట. రామచంద్రాపురానికి కాస్తఅవతల వాళ్ళకున్న మెట్టభూమికి కూడా హఠాత్తుగా మంచి ధర పలికిందట. అది అమ్మేసి—ఇవి కొను

క్కుండామనీ—ఈ వ్యవహారం పైసలు చేయడానికి రాజారావు అర్జంటుగా బయల్దేరి రావాల్సి ఉందనీ ఆలశ్యం చేస్తే అవకాశం చేయిజారిబోయే ప్రమాదమున్నదనీ ఆయన రాశాడు.

అనుకోని అదృష్టంగా కృష్ణశాస్త్రి స్వంత కార్లో భువనేశ్వర్ బయల్దేరడంలో ఈ ఉత్తరం అతనిచేతనే రాయించి అతని ద్వారానే పంపారు. పేరవరానికి టెలిగ్రాఫ్ ఆఫీసు లేదు. గోదావరి దాటి రాజమండ్రీ అయినా, ధవళేశ్వరమైనా వెళ్ళాలి. లేదా ఆరుమైళ్ళదూరంలో ఉన్న ఆత్రేయపురం వెళ్ళాలి.

రాజారావు ఉత్తరం చదివి "ఈ కృష్ణశాస్త్రి ఎవడో నాకు అంతుబట్టకుండా ఉంది. మా ఊళ్ళో ఉన్న బ్రాహ్మణ కొంపలే తక్కువ. రామచంద్రంగారు నాకు బాగా తెలుసును. ఆయన చాలా పేదవాడు. స్వంత కారున్న బంధువులాయన కుండడం ఆశ్చర్యంగానే ఉంది...." అన్నాడు.

"బాగుంది. పేదవాళ్ళకు గొప్పవాళ్ళు బంధువులుగా ఉండకూడదా ఏమిటి? మీరు కృష్ణశాస్త్రిగారి గురించి ఆలోచించడం మాని, ఈ వ్యవహారం సంగతి చూడండి. మన భూములన్నీ స్వంత ఊరిలోనే ఉండడం అన్నివిధాలా మంచిది. అంచేత మీరు వెళ్ళి ఈ వ్యవహారం తేల్చుకు వచ్చేయండి...." అంది వసుంధర.

"ఇలాంటి అవకాశంకోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నాం. ఇన్నాళ్ళకు వెతుక్కుంటూ వచ్చింది...." అన్నాడు రాజారావు.

ఆనందంలో ఆ రాత్రి అతనికి చాలాసేపు నిద్రపట్టలేదు. తెల్లవారుఝామున ఎప్పుడో మంచి కునుకు పట్టింది. ఆ కునుకు ఉదయం ఎనిమిది గంటలకు వసుంధర తట్టి లేపే

వరకూ కొనసాగింది.

"చూడండి—కృష్ణశాస్త్రిగారు వచ్చారు...." అంది వసుంధర.

రాజారావు మత్తు విడిపోయింది. అతను గబగబా లేచి తల దువ్వుకుని డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాడు. కృష్ణశాస్త్రి అతన్ని చూసి "మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్లున్నాను...." అన్నాడు.

"నా సెటాల్—ఇలా లేటుగా లేవడం నాకు అలవాటే లెండి—మీ ప్రోగ్రాం చెప్పండి" అన్నాడు.

"మధ్యాహ్నం పన్నెండు గంటలకు నేను తిరిగి పేర వరం బయల్దేరుతున్నాను. రాదల్చుకుంటే మీరు నాతో రావచ్చు...." అన్నాడు కృష్ణశాస్త్రి.

రాజారావు కుతూహలంగా "రామచంద్రంగారు నాకు బాగా తెలుసు. మిమ్మల్నెప్పుడు నేను మా ఊళ్ళో చూడ లేదు. ఇదివరలో ఎన్నడూ మీరు మా ఊరు రాలేదా?" అనడిగాడు.

కృష్ణశాస్త్రి నవ్వి "నిజం చెప్పాలంటే—ఇదే మొదటి సారి నేనా ఊరువెళ్ళడం. వివరాలు సేకరించి అక్కడికి వెళ్ళిన రోజున రామచంద్రంగా రింట్లో లేరు. ఏదో పౌరో హిత్యం పనిమీద రాజవరం వెళ్ళారని తెలిసింది. వెంటనే కారు మాత్రం ఆయన ఇంటిముందాపి నడుచుకుంటూ కాలవ గట్టుదగ్గరకు వచ్చి బల్లకట్టు ప్రయాణంచేసి రాజవరం వెళ్ళి రామచంద్రంగారిని కలుసుకున్నాను. ఆయన్ను చూసేదాకా నాకు కాస్త బెదురుగానే ఉంది—నేననుకున్న మనిషి దొరుకుతాడా అని...." అన్నాడు.

"ఇంతకీ మా ఊళ్ళో మీకు పనేమిటండీ—" అన్నాడు రాజారావు కుతూహలంగా.

"అరటిపళ్ళ వ్యాపారం లెండి. భువనేశ్వర్ కూడా ఆ పనిమీదనే వచ్చాను."

పేరవరంనుంచి అరటిపళ్ళు లారీల్లో భువనేశ్వర్ వస్తూం టాయి. ఈ సంగతి రాజారావుకు తెలుసును. పేరవరం అరటిపళ్ళకు రాజమండ్రి ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. ఆ సందర్భంగా చాలామంది వ్యాపారస్తులు పేరవరం వచ్చి పోతూంటారు. ఈ కృష్ణశాస్త్రి కొత్తగా వ్యాపారంలో దిగి ఉంటాడు. మకాంకోసం రామచంద్రం బంధుత్వాన్ని గుర్తు చేసుకుని ఉంటాడు. అవసరంలో తప్ప రామచంద్రం లాంటి బంధువులను కృష్ణశాస్త్రిలాంటివాళ్లు గుర్తుంచుకోరు.

"ఇంతకీ మీరు పేరవరం ఎప్పుడు వెళ్ళేనన్నారు?" అన్నాడు రాజారావు.

"మే రెండవ తేదీన.'' అన్నాడు కృష్ణశాస్త్రి నవ్వుతూ- "బహుశా మీతోపాటు బయల్దేరి ఇంకా రెండ్రోజులుంటా నేమో-ఒక అరటితోట బేరానికి వచ్చింది. కొనేద్దామను కుంటున్నాను."

"మీ కార్లో మా ఫామిలీ రావడానికి వీలుపడుతుందా?'' అన్నాడు రాజారావు ఏదో ఆలోచిస్తూ.

"ఫామిలీతో బయల్దేర్తారా ఏం?'' అన్నాడు కృష్ణశాస్త్రి.

''అవునండి. మే రెండునించే పిల్లలకు సెలవు లిచ్చే శారు. జూన్ ఆఖరివారం దాకా కాన్వెంట్ తెరవరు. ఈసారి యింటికి వెళ్ళకూడదనుకున్నాను. కానీ నేనెలాగు బయల్దేరవలసివచ్చింది. పెద్ద సెలవు తీసుకుని-బయల్దేర దామా అనిపిస్తోంది" అన్నాడు రాజారావు.

''నా కభ్యంతరం లేదనుకోండి. పిల్లలతో మీరు ప్రయాణం ఇబ్బంది కాకుండా ఉందనుకుంటే చాలు. పన్నెండు గంటలకు నేను మళ్ళీ వస్తాను." అని కృష్ణశాస్త్రి

అంటూండగా అక్కడకు ప్లేట్లో ఇడ్లీలుపెట్టి-వసుంధర అతని ముందుంచింది.

"మరి మీరు...." అని కృష్ణశాస్త్రి అనబోతూండగా-

"మీరు తీసుకోండి. నేనింకా ముఖం కడుక్కోవాలి" అన్నాడు రాజారావు.

కృష్ణశాస్త్రి గబగబా టిఫిన్‌తిని కాఫీతాగి వెళ్ళిపోయాడు.

రాజారావు ఆఫీసుకువెళ్ళి ఓ ఇరవై రోజులపాటు సెలవు మీద తను-ఇంటికి వెళ్ళబోతున్నట్లు బాస్‌కి చెప్పి. అప్లికేషన్ ఫారం నింపి ఆయన కిచ్చేశాడు.

"చెప్పవలసినవీ, అప్పగించవలసినవీ నీ కొలీగ్‌కు చెప్పడం మరిచిపోకు...." అంటూ హెచ్చరించాడు బాస్.

వసంతరావు, రాజారావు కొలీగ్. ఇద్దరూ కలిసి జాయింటుగా కొన్ని ప్రాజెక్టు మీద వర్కుచేస్తున్నారు. ఇద్దరిలోకీ రాజారావు సీనియర్. వీళ్ళిద్దరూ కలిపి చూస్తున్న చిన్న టెస్టింగ్ లాబరేటరీ ఉంది. అందువల్ల వసంతరావుకు రాజారావు కొన్ని అప్పగింతలు చేయాల్సి ఉంది.

అన్నీ పూర్తయ్యేసరికి పదయింది.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?" అన్నాడు వసంతరావు.

"ఓ మూడు వారాల తర్వాత" అన్నాడు రాజారావు.

అతను ఇంటికి వెళ్ళేసరికి వసుంధర ఇటు ప్రయాణానికి సామాను సర్దుతూనే అటు వంట చేసేస్తోంది.

రాజారావు వచ్చేక పెట్టె సర్దడం బాధ్యత అతను తీసుకున్నాడు. మరో అరగంటలో అన్నీ పూర్తయ్యాయి.

"ఆకలిలేదు కానీ భోజనాలు కానిచ్చేద్దాం...." అన్నాడు రాజారావు. త్వరగా తెమలరని-పిల్లలిద్దరికీ కలిసి పెట్టేశారిద్దరూ-తము తింటూనే. కార్లో ప్రయాణంకాబట్టి దారిలో తినడానికంటూ వేరే ప్రత్యేకంగా ఏమీ చేయలేనంది వసుం

ధర. పిల్లలు తినడానికి బిస్కట్లున్నాయి.

"ప్రయాణంలో పక్కన నువ్వుంటే ఆకలుండదు ... దాహముండదు...." అన్నాడు రాజారావు.

"పక్కన నేనెందుకులెండి? ఆ కృష్ణశాస్త్రి పక్కన కూర్చుని పెళ్ళైన కొత్తలో అంటూ పాత అనుభవాలు నెమరువేసుకోడం మొదలెట్టారంటే-మీకు ఆకలీ, దాహమే కాదు రోజులు కూడా తెలియవు...."

రాజారావు టైము చూసుకొని-"అవునూ—రాత్రి పాత అనుభవాలు నెమరువేసుకుని-కొత్త అనుభవాలు చవిచూద్దామనుకుంటూండగా వచ్చాడు కృష్ణశాస్త్రి. కొత్త మనకు అచ్చిరాలేదు. మళ్ళీ కాసేపు పాత విశేషాలు మాట్లాడుకుందాం-కృష్ణశాస్త్రి వచ్చేదాకా....ఇంతకీ నిన్న మన పాత కబుర్లు ఎక్కడ ఆగిపోయాయి...." అన్నాడు.

"బాబిగాడు నిద్రపోవడంతో-అక్కడ ఆగిపోయాయి" అంది వసుధర.

"సరేలే-వాడు నిద్రపోవడం సంగతటుంచు. మన కబుర్లు...."

"పేరవరంనుంచి రాజవరం ఇసుకలోంచీ నడుచుకుంటూ వెళ్లాం...."

"చూశావా-అయిష్టత నటిస్తావు కానీ-నేను కబుర్లెక్కడ ఆపేశానో కూడా గుర్తే." అని నవ్వి-"అదిసరే కానీ.... పేరవరానికీ రాజవరానికీ మధ్య కాలవుండాలిగదా-మన మెలా నడిచి వెళ్లాం" అన్నాడు.

"స్వామీ-అది మేనెల. ఏప్రిల్ పదిహేనునించి మే పదిహేనువరకూ మీ ఊరి కాలవ బంద్ అయిపోతుందిగా" అంది వసుంధర.

రాజారావు ఉలిక్కిపడి-"మొన్న తమ్ముడు రాసిన ఉత్తరంలో కాలవ కట్టేసినట్లుందికదూ" అన్నాడు.

"అవును." అంది వసుంధర ఆశ్చర్యంగా.

"ఈరోజు మనం ప్రయాణం కావద్దు. కృష్ణశాస్త్రిని మనం నమ్మడానికి వీల్లేదు" అన్నాడు రాజారావు.

"ఏమైందండీ." అంది వసుంధర ఆశ్చర్యంగా.

"నన్ను నమ్మించడానికనో ఏమో అతను ఉదయం మా ఊరికి సంబంధించిన కొన్ని వివరాలు చెప్పాడు. అతను చెప్పిన ప్రకారం కాలవలో ఇంకా నీరుంది. అతను రాజవరం వెళ్ళడానికి బల్లకట్టు ఎక్కాల్సి వచ్చింది. తమ్ముడు రాసిన ప్రకారం ఈ ఏడాది కాలవ ఏప్రిల్ ఇరవై ఒకటిన కట్టేశారు. అంటే మే 21 దాకా వదలరనేగదా-కృష్ణశాస్త్రి తను మే రెండున పేరవరం వెళ్ళినట్లు చెప్పాడు. ఆరోజే అతను బల్లకట్టు దాటి రాజవరం వెళ్ళాడు. కాలవలో నీరు లేనప్పుడు" అని ఆగిపోయాడు రాజారావు.

"అయితే ఏం జరిగిందంటారు?"

"కృష్ణశాస్త్రి అబద్ధమాడుతున్నాడన్న దాంట్లో సందేహం లేదు. అతనికి ఎలాగో మా ఊరు గురించిన కొన్ని వివరాలు తెలిశాయి. ఎటొచ్చీ కాలవ కట్టేస్తారన్న విషయం అతనికి తెలియదుకాబోలు. అతను తెచ్చిన ఉత్తరంలో దస్తూరీకూడా మా నాన్నగారిదికాదు. అతనితో బయల్దేరడంలో ప్రమాదముంది."

"అతనెందుకు అబద్ధమాడుతున్నా డంటున్నారు" అంది వసుంధర. సమాధానం ఇద్దరికీ తోచలేదు.

3

సరిగ్గా పన్నెండు గంటలకు కృష్ణశాస్త్రి, రాజారావు ఇంటి తలుపు తట్టాడు. రాజారావు తలుపు తీయగానే—

"రెడీయా?" అన్నాడతను.

"లోపలకు రండి." అంటూ ఆహ్వానించాడు రాజారావు. కృష్ణశాస్త్రి వచ్చి డ్రాయింగ్ రూంలో కూర్చున్నాక- "పిల్లలు పేరవరమంటే ఉత్సాహంలో ఉరకలు వేస్తున్నారు. కాలవస్నానమంటే మహా పిచ్చి వాళ్ళకి. నా మటుక్కు నాకూ చాలా ఇష్టమేననుకోండి-మీరెలా లైక్ చేశారో గానీ" అన్నాడు.

"పేరవరంలో నేను ఉన్నన్నిరోజులూ - ఉదయం, సాయంత్రం కూడా స్నానం చేసేవాడిని. అసలాస్నానం కోసమే మళ్ళీ పేరవరం...."

కృష్ణశాస్త్రిని మాటల మధ్యలో ఆపి-"కార్లో ప్రయాణం కష్టమంటోంది మా ఆవిడ. మేము ట్రయిన్లో వెళ్ళడానికి నిశ్చయించుకున్నాం. ఎప్పుడు రిజర్వేషన్ దొరికితే అప్పుడు బయల్దేరుతాం, మీకిచ్చిన శ్రమకు క్షంతవ్యుణ్ణి" అన్నాడు రాజారావు.

కృష్ణశాస్త్రి దెబ్బతిన్నట్లు ముఖంపెట్టి-ఏ ఇబ్బందీ కలక్కుండా చూసుకుంటానని హామీ ఇచ్చి వాళ్ళను తనతో బయల్దేరవలసిందిగా రిక్వెస్ట్ చేశాడు. రాజారావు కాదన్న కొద్దీ అతను బలవంత పెట్టడంలో-రాజారావు అనుమానం పెరిగింది.

తనతో వీళ్ళు కార్లో బయల్దేరి రావడంలేదని ధృవపడ్డాక కృష్ణశాస్త్రి విచారంగా ముఖంపెట్టి-"మిమ్మల్ని వెంటనే తీసుకురమ్మనమని మీ నాన్నగారు మరీ మరీ చెప్పారు. ఆయన్ను నిరుత్సాహపరిచిన వాణ్ణవుతానని నాకు బాధగా ఉంది. పోనీ ట్రయిన్లోనైనా ఈ రాత్రికే బయల్దేరండి. మీకు రిజర్వేషన్ దొరికేలా చూసే బాధ్యత నాది. ఇప్పుడే స్టేషన్‌కువెళ్ళి వ్యవహారం పూర్తిచేసుకు వస్తాను. ఇలాంటి

విషయాల్లో నాకు చాలా అనుభవముంది" అన్నాడు.

"మాగురించి మీరు చాలా శ్రమ తీసుకుంటున్నారు...." అన్నాడు రాజారావు.

"ఒక బాధ్యత తీసుకున్నాను. అది నెరవేర్చేవరకూ స్థిమితంగా ఉండదు" అంటూ లేచాడు కృష్ణశాస్త్రి. దబ్బిస్తానని రాజారావనలేదు. కృష్ణశాస్త్రి అడగనూలేదు.

కృష్ణశాస్త్రి వెళ్ళగానే-"ఈ వ్యవహారం చాలా అనుమానంగా ఉంది నాకు. ఇప్పుడే ఒక నిజం చెప్పాడు కృష్ణశాస్త్రి. ఏదైనా ఒక బాధ్యత తీసుకుంటే అది నెరవేర్చేవరకూ స్థిమితముండదుట. మనవిషయంలో అతనికి ఏదో గట్టి బాధ్యతే అప్పగించబడింది. అదేమిటో మనకింకా తెలియదు. ట్రయిన్లోనైనా మనం ప్రయాణం కావాలంటున్నాడంటే-మనని ఊళ్ళో రేపటికి ఉండకుండా చేయాలన్నది అతని తాపత్రయం. ఏమైనాసరే ఈరోజు మనం ప్రయాణం కాకూడదు" అన్నాడు రాజారావు.

"మరి అతను టికెట్ను రిజర్వు చేసుకువస్తే."

"చెబుతాను. నువ్వు మంచమెక్కు. అనారోగ్యాన్ని నటించు. నే ఆఫీసుకు వెడతాను" అన్నాడు రాజారావు.

రాజారావు ఒంటిగంటన్నరకు ఆఫీసుకు వెళ్ళి ఉదయపు పూటకు హాఫ్‌డే కాజువల్ లీవుపెట్టి-తను ఉదయం ఇచ్చిన సెలవు చీటీ వెనక్కు తీసేసుకున్నాడు.

"ఏమయింది?" అన్నాడు వసంతరావు ఆశ్చర్యంగా, ఇబ్బందిగా.

"మా ఆవిడకి ఒంట్లో బాగోలేదు. ప్రయాణం వాయిదా వేసుకున్నాం."

"బాగుందండీ. అర్జంటుగా రమ్మని మీ నాన్నగారు త్తరం రాస్తే ఆవిడ కొంట్లో బాగుండలేదని ప్రయాణం మాను

కుంటారా-ఇక్కడ మేమంతా లేమా. ఏబెంగా పెట్టుకో కుండా మీరు వెళ్ళిరండి" అన్నాడు వసంతరావు.

"నేను పక్కన లేకపోతే మా ఆవిడకు అధైర్యం పెరిగి, గోటితోపోయేదానికి గొడ్డలిదాకా వెళ్ళవలసి ఉంటుంది. ఈ పొలం వ్యవహారంలో ఇలాంటి అవకాశం మరోసారి రాకపోదు. నాజీవిత భాగస్వామికంటే ఈ వ్యవహారం నా కెక్కువకాదు" అన్నాడు రాజారావు.

వసంతరావు, రాజారావుకు నచ్చజెప్పడానికి మరికొంత ప్రయత్నంచేసి ఫెయిలయ్యాడు.

కృష్ణశాస్త్రి టికెట్సు తెచ్చి ఇంట్లో ఇచ్చి వెళ్ళిపోయాడు. రాజారావు సాయంత్రం వెళ్ళి వాటిని కాన్సిల్ చేసుకుని వచ్చేశాడు.

ఆరోజు రాత్రి ఎనిమిదిన్నర ప్రాంతంలో వసంతరావు రాజారావింటికి సతీసమేతంగా వచ్చాడు. వసంతరావు భార్య మంచంమీద ఉన్న వసుంధరను చూడ్డానికి వెళ్ళింది. వసంతరావు రాజారావూ డ్రాయింగురూంలో కూర్చున్నారు.

"సాయంత్రం మా ఇంటికోమనిషి వచ్చాడు. ఇది చాలా పెద్ద రహస్యం. మీ రెక్కడా అనకూడదు" అన్నాడు తగ్గుస్వరంలో వసంతరావు.

"ఏమిటది!"

"వందనా పెయింట్సు మన లాబరేటరీ కింతవరకూ మూడుసార్లు వచ్చాయి. స్టాండర్డు చాలదని మీరు రిపోర్టిచ్చారు. ట్రిప్పు ట్రిప్పుకీ క్వాలిటీ ఇంప్రూవ్ చేస్తూవచ్చారు వాళ్ళు. కానీ ఇంకా స్టాండర్డు చాలలేదు. వాళ్ళ పెయింట్సుని లార్జ్ స్కేల్లో కొనడానికి నాలుగు ఇండస్ట్రీలు ముందుకు వచ్చాయి. మనం ఇచ్చే టెస్టు రిపోర్టుమీద ఆ ఇండస్ట్రీల

నిర్ణయం ఆధారపడి ఉంది. రేపే ఆ ఇండస్ట్రీల ప్రతినిధులూ, వందనా పెయింట్సు ప్రతినిధీ మన లాబరేటరీకి వస్తున్నారు. ఈసారి అదృష్టబాగుండి రిపోర్ట్ అనుకూలంగా ఉంటే మనిద్దరికీ చెరో పాతికవేలూ బహుమతిగా ఇద్దామనుకుంటున్నారు" అన్నాడు వసంతరావు.

"బాగుండవలసింది అదృష్టంకాదు. పెయింట్!" అన్నాడు రాజారావు.

"నిజమే. అది బాగుండాలంటే మన అదృష్టం బాగుండాలి" అన్నాడు వసంతరావు. అతని అభిప్రాయం రాజారావుకి అర్థమైంది.

అతను వెళ్ళిపోయేక రాజారావు భార్యను సమీపించి- "మిస్టరీ విడిపోయింది వసూ, మన ఊరిగురించి చాలా వివరాలు వసంతరావుకు తెలుసును. కృష్ణశాస్త్రిని నియోగించింది అతనే అయుండాలి. యాభై వేలకోసం అతనీ తంటాలు పడ్డాడు. మన ప్రయాణం ఆగిపోవడంతో చెరిపాతికవేలూ అంటూ వాటా ఇవ్వడానికి వచ్చాడు" అన్నాడు.

అన్నీ విన్నాక-"పాతికవేలు చేదేంకాదు. చాలా కొత్త వస్తువులు కొనుక్కోవచ్చు" అంది వసుంధర.

రాజారావు భార్యవంక విచిత్రంగా చూసి-"మనకెప్పుడూ మామూలే, నీ దృష్టి కొత్త వస్తువులమీద నా దృష్టి పాత అనుభవాలమీద" అని, "అదేమంచిదయింది. అందుకే త్వరగా ఈ మిస్టరీ తెలిసింది నాకు, లేకపోతే మన లాబరేటరీకి చాలా చెడ్డపేరు వచ్చి ఉండేది" అన్నాడు.

"సరేలెండి. రిసెర్చిలో కూడా ఇలాగే పాత ప్రయోగాలు తల్చుకుంటూ పరవశించి పోకండి" అంది వసుంధర నవ్వుతూ. □□□

పద్ధెనిమిది కత్తిపోట్లు!

చావా రామకోటి

హత్యా ప్రదేశం చాలా భయంకరంగా, ఒళ్ళు జలదరించేలా వుంది.

హతుని కనుగుడ్లు బయటకు పొడుచుకువచ్చి, భీకరంగా వున్నాయి. సగం నాలుక బయటకు వచ్చింది.

శరీరంమీద మొత్తం పద్ధెనిమిది కత్తిపోట్లు. బట్టలన్నీ రక్తంతో తడిసి ఎర్రగా అట్టకట్టుకపోయివున్నాయి. శవం పడున్న గదంతా అదో అసహ్యకరమైన వాసన.

రజియా గగ్గోలుపెట్టి ఏడుస్తూంది.

ఆమె ఆరేళ్ళ కొడుకు దిగాలుపడి తల్లిని చూస్తున్నాడు.

రజియాను ఓదార్చటం చుట్టు ప్రక్కల వాళ్ళకు అసాధ్యం అయింది.

తెల్లవారిపాటికల్లా ఈ విషయం నగరమంతా దావానలంలా వ్యాపించింది. అధికారులూ, ఉన్నతాధికారులూ హత్యా ప్రదేశాన్ని సందర్శించారు. పరీక్షించారు.

వేలిముద్రల నిపుణులు ఆ గదిలో ప్రతి అంగుళం పరీక్ష చేసి పెదవి విరిచారు. ఆధారాలు ఏమీ దొరక్కుండా హంతకుడు ఎంతో తెలివిగా జాగ్రత్తపడ్డాడు.

పోలీసు కుక్కలు తేబడ్డాయి.

శవాన్ని, ఇంకా గదిలోని ఇతర వస్తువులనూ వాసన చూపిన తరువాత వాటిని వదిలిపెట్టి ఒక చురుకైన యస్.ఐ. వాటివెంట బయలుదేరాడు. ప్రక్కనున్న కాలనీలో కొద్ది సేపు ఆగి, మళ్ళీ బయలుదేరి నగర శివార్లలోవున్న ఒక పాడుబడ్డ ఇంటి దగ్గరకు వెళ్ళాయి.

అక్కడ జాగ్రత్తగా పరీక్షచేసిన మీదట రెండు సిగరెట్టు పీకలు దొరికాయి. యస్. ఐ. ఆ రెండిటినీ ఏరి జాగ్రత్తగా కాగితంలో భద్రపరిచాడు.

అంతే! కుక్కల నడక కుంటుపడింది. అక్కడినుండి ముందుకు పోవటానికి అవి నిరాకరించాయి. ఇంతకంటే పరిశోధన ముందుకు సాగే ఆధారాలు ఏమీ లభించలేదు.

2

మహ్మద్ హత్యకు ప్రత్యక్ష సాక్షి అతని భార్య రజియా ఒక్కతే!

ఆమె అందించిన సమాచారం ప్రకారం కేసు వివరాలు:

రాత్రి పదిగంటలకు ఆమె భర్త మహ్మద్ బయటనుండి ఇంటికి వచ్చాడు. అతనూ, రజియా కలిసి భోంచేశారు. అప్పటికే వాళ్ళ కొడుకు నిద్రపోయాడు. ముగ్గురూ ఒకే గదిలో పడుకున్నారు.

ఆరాత్రి మూడుగంటల ప్రాంతంలో తలుపుకొట్టిన చప్పుడయింది. ఆమె, ఆమెభర్త ఇద్దరూ మేల్కొన్నారు.

"ఎవరూ" మహ్మద్ లోననుండే ప్రశ్నించాడు.

"నేను! తలుపు తియ్యి భాయ్! నీతో కొంచం జరూరీ పనివుంది" అని బయటనుండి సమాధానం వచ్చింది.

మహ్మద్ తలుపు తీశాడు.

ఒక్కసారే ముగ్గురు వ్యక్తులు తలుపు నెట్టుకుని లోనికి వచ్చారు. అందరూ నల్లటి ముసుగులు ధరించి ఉన్నారు. ఒకడు మహ్మద్‌కు కత్తి ఆనించాడు. మరొకడు రజియా నోరు మూశాడు. వేరొకడు తలుపు దగ్గరగా మూసి లోన గొళ్ళెం పెట్టాడు.

రజియా, మహ్మదులు నిశ్చేష్టులై నోట మాటరాక వుండి పోయారు.

"బీరువా తాళా లివ్వు" అధికార స్వరంతో అడిగాడు అందులో ఒకడు.

మహ్మద్ ఇవ్వ నిరాకరించాడు.

పొట్టలో ఒక గుద్దు గుద్దాడు.

'మా(' మహ్మద్ ఆర్తనాదంచేశాడు.

రజియా ఏడ్పు లంకించుకుంది.

రజియా నోరు మూసినవాడు ఆమెను ప్రక్క గదిలోనికి నెట్టుకునివెళ్ళి, ఆమె కొడుకుని కూడా తీసుకవచ్చి, ఆమెకు ఇచ్చి, అక్కడే కాపలా కూర్చున్నాడు.

తరువాత లోన ఏమిజరిగిందో రజియా తెలియదంది.

బీరువా తెరిచిన చప్పుడు, కొద్ది నిముషాల వ్యవధిగా భర్త మూలుగులూ మాత్రం వినిపించాయంది.

అర్ధగంట తరువాత వారు ముగ్గురూ ఒక పెద్ద బ్యాగు తీసుకుని త్వరత్వరగా బయటకువెళ్ళి, బయటనుండి గొళ్ళెం పెట్టి వెళ్ళిపోయారు. వారు వెళ్ళగానే కొడుకు నెత్తుకుని పడక గదిలోకి వెళ్ళి భయంకరంగా ఆర్తనాదం చేసింది.

ఆమె భర్త రక్తపు మడుగులో పడివున్నాడు.

ఒంటినిండా కత్తిపోట్లు.

అతని ప్రాణాలు ఎప్పుడో అనంతవాయువుల్లో కలిసి పోయాయి.

బీరువా చూడగా తెరిచివుంది. దానినుండి ఐదువేల రూపాయల నగదు, రజియా 5 తులాల బంగారు నెక్లెసు మరియు ఉపురికార్డరు దొంగిలించబడినాయి. ఆమె గగ్గోలు పెట్టి ఏడ్చింది. చుట్టుప్రక్కల వాళ్ళంతా లేచి వచ్చారు.

3

డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రంజన్ చేతికి కేసు ఫైలు వచ్చే నాటికి, పరిశోధనలో హంతకుని గురించి దొరికిన సమాచారం శూన్యం.

పరిశోధనలో మొట్టమొదటి భాగంగా నేరస్థలం చూసేందుకు రజియా ఇంటికి వెళ్ళాడు.

విషాద ఛాయలు మెల్లగా ఆమెనుండి తొలగుతున్నాయి.

రంజన్‌ను నవ్వుతూ ఆహ్వానించింది.

రంజన్ ఆమెను నిశితంగా పరిశీలించాడు.

రజియా చాలా అందమైనది. ఆమెకు ఒక్కడే కొడుకు. ఎత్తైన వక్షోజాలు. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు చేసే సున్నితమైన సవ్వడి ఎదుటివాణ్ణి గిలిగింతలు పెడతాయి.

రంజన్ అలా రెప్పవాల్చకుండా చూస్తుంటే రజియా బరువుగా కళ్ళు వాల్చింది.

"ఇన్‌స్పెక్టర్ సాబ్! నా మియాను చంపినవాడి జాడేమైనా తెల్సిందా? ఎలాగైనా పట్టాలి సాబ్" ఆవేదనగా అంది.

"నీవేం బాధపడకు. నేరం చేసినవాడు చట్టం చేతి నుండి ఎప్పటికీ తప్పించుకోలేడు."

ఒకసారి ఇంటినంతటినీ పరిశీలించి, రంజన్ స్టేషన్‌కు తిరిగి వచ్చాడు.

ధన సంబంధమైన లాభాలకొరకు హత్యలుచేసే పాత హంతకుల నందరినీ తెప్పించాడు ఇన్‌స్పెక్టర్ రంజన్.

ఒక్కొక్కడినే పరీక్షచేశాడు.

పాత నేరస్థులు, దోపిడీలు చేసేవారు, రౌడీలు అందరు స్టేషనుకు తేబడ్డారు.

ఈ కేసులో ఉపయోగపడే క్లూదొరికినా దొరక్కపోయినా పట్టణంలోని రౌడీలకు, కేడీలకూ నక్షత్రాలు మాత్రం కన బడ్డాయి. నిద్రాహారాలు కరువైనాయి. రంజన్ పేరుచెబితే ఉలిక్కిపడి కూర్చుంటున్నారు.

4

ఆరోజు రాత్రి ఇన్‌స్పెక్టర్ రంజన్ బస్తీలో జరిగిన ఒక మామూలు తగాదాను పర్సనల్‌గా అటెండు కావల్సి వచ్చింది. వివరంగా అన్ని స్టేటుమెంట్లు తీసుకొనేసరికి రాత్రి పొద్దుపోయింది.

స్టేషనుకు తిరిగి వస్తుంటే దారిలో మహ్మద్ ఇంటిని చూసి, ఒకసారి రజియాను పలుకరించి పోదామని, తలుపు తట్టాడు. వెంటనే తలుపు తెరుచుకోలేదు.

లోపలనుండి సమాధానం వచ్చిన పదినిముషాలకు ఎవరో వ్యక్తి తలుపు తెరిచి "ఆదాబ్ సాబ్" అంటూ రంజన్‌కు విష్‌చేస్తూ, తొందర తొందరగా బయటకు వెళ్ళి పోయాడు. ఎర్రగా, ఎత్తుగా, అందంగా వున్నాడు. ఉంగ రాల జుట్టు.

రజియా నెమ్మదిగా వచ్చింది.

తల చెదిరివుంది. జాకెట్టు క్రిందిభాగం విడిపోయి వుంది. చీర గజిబిజిగా నలిగుంది.

ఆమె ముఖంలో తెచ్చి పెట్టుకున్న నవ్వు, కంగారుమ దాచలేకపోతుంది. పెదవులు వణుకుతున్నాయి. ఏం మాట్లా డాలో తికమకగా తడబడింది.

"రజియా! అంతా క్షేమమేనా?" రంజనే మొదలు పెట్టాడు.

"అల్లా దయవలన అంతా క్షేమమే సాబ్."

"బయటకు వెళ్ళింది ఎవరూ?"

"మా చుట్టం సాబ్. నామియా చనిపోయినప్పటినుండి నాకు సహాయంగా వుంటున్నాడు, తొందర పనివుంది వెళ్ళాలంటుంటే నేనే ఆపుచేశాను. అందుకే జల్దీ వెళ్ళి పోయాడు. అదిసరే సాబ్. కేసు సంగతేమైనా తెల్సిందా?"

"తొందరలోనే తప్పకుండా తెలుస్తుంది. మరి వస్తా" రంజన్ బయటకు వచ్చాడు.

రజియా నిట్టూరుస్తూ తలుపు వేసుకుంది.

ఇన్‌స్పెక్టర్ రంజన్‌కు రజియా ప్రవర్తనపై, ఆమె శీలంపై ఏదో అనుమానం వేసింది.

అదే బస్తీలో వుండే రంజన్‌కు సన్నిహితుడైన శంకర్‌ను పిలిపించాడు.

"శంకర్! మొన్న మీ బస్తీలో హత్య చేయబడిన మహ్మద్ భార్య రజియా గురించి సమాచారం సేకరించి నాకు చెప్పాలి."

"మీకు వాళ్ళగురించి ఏమి సమాచారం కావాలి సార్. నాకు ఆ కుటుంబం గురించి బాగా తెలుసు."

"అదేం. రజియా ఎటువంటిది-వివరాలు కావాలి."

"సార్। రజియా మహ్మద్‌లది చాలా అన్యోన్య దాంపత్యం. మహ్మద్ బొంబాయినుండి బట్టలు చౌకగా తెచ్చి ఇక్కడ లాభాలకు అమ్ముతూ వుంటాడు. వ్యాపార నిమిత్తం ఒక్కోసారి బొంబాయి వెళ్ళేదంటే మూడు నెలలవరకూ అక్కడే వుండేవాడు.

మహ్మద్ ఇక్కడున్నంత కాలం రజియా అతనూ చిలుకా గోరింకల్లాగా వుంటారు. డబ్బుకూడా బాగా సంపాదించాడు. ఇప్పుడు వాళ్ళుంటున్న ఇల్లుకూడా కొన్నాడు.

మహ్మద్ బొంబాయిలో వుండేప్పుడు, రజియా తోడుగా వాళ్ళ బంధువుల అబ్బాయి హుస్సేన్‌ను ఇంట్లో వుంచుకుంటుంది. ఒక సంవత్సరంనుండి ఆ కుర్రోడితో అక్రమ సంబంధం పెట్టుకుందని వినికిడి. ఆ కుర్రోడు మాత్రం అందంగా జమ్‌గా ఉంటాడులే సార్।

ఈమధ్య కాలంలో మహ్మద్ ఊళ్ళో లేనప్పుడు రేయింబగళ్ళు కూడా హుస్సేను, రజియా ఇంట్లోనే వుంటున్నాడు. మహ్మద్ బ్రతికివుండగా, అతను ఇంట్లో వుండగానే వచ్చిపోతుండేవాడు. దగ్గరి బంధువు కాబట్టి అతనికేమీ అనుమానంలేదు.

ఈసారి మహ్మద్ బొంబాయినుండి రాగానే, ఇల్లు, ఆస్తీ అంతా అమ్ముకుని, మకాం బొంబాయి మార్చాలనే ఉద్దేశ్యంలో వున్నాడు. అందుకు రజియా ఇష్టపడలేదు. దాని విషయంలో వారిద్దరికీ ఘర్షణ జరిగిందని కూడా తెల్సింది. ఇంతలోకే పాపం ఈ హత్య జరిగింది. ఇంకా ఏమైనా సమాచారం కావాలంటే తెలుసుకొని వస్తా సార్।"

"మంచి సమాచారమే చెప్పావు కాని ఆ కుటుంబం

గురించి నీకు ఇంత సమాచారం ఎలా తెలిసింది."

"అదే బస్తీలో వుంటాను. ఆమాత్రం తెలియదా సార్! అదీకాక మహ్మద్‌కు నాద్వారా మంచి వ్యాపారం జరుగుతుండేది సార్. అందుకే ఏదైనా మంచి చెడ్డ వుంటే నాతో చెబుతుండేవాడు."

"సరే! ఇంకా ఏమైనా-సమాచారం తెలిస్తే వెంటనే వచ్చి చెప్పు."

"అలాగే సార్-నమస్తే-వస్తాను" శంకర్ వెళ్ళిపోయాడు.

ఆలోచనలు మళ్ళీ రంజన్ను చుట్టాయి. మనసు రేసు గుర్రంలా పరిపరివిధాలుగా పరుగెడుతూంది.

5

సమయం సాయంత్రం నాలుగయింది.

ఇన్‌స్పెక్టర్ రంజన్ స్టేషన్‌లో రొటిన్ పేపర్స్ చూస్తూ కూర్చున్నాడు.

హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి ఒక యువకుణ్ణి కాలరు పట్టుకుని తీసుకుని 'టఫీ-టఫీ' మని రెండు అంటించి, ఒక టేపు రికార్డరు రంజన్ టేబుల్ మీదుంచాడు.

"సార్! భజరంగ్‌లాల్ దుకాణంలో ఈ టేపు రికార్డరును మూడు వందలకే అమ్మకానికి బేరం జరుగుతుంది. ఇది ఎక్కడిదని అడిగితే ఏదో తిక్క సమాధానాలు చెబుతున్నాడు సార్. నాకు అనుమానంవేసి తీసుకువచ్చాను."

హెడ్డు ఏకబిగువున ఏకరువు పెట్టేశాడు పేద్ద ఘనకార్యం సాధించినట్లు. ప్రొఫైల్‌లో యస్. ఐ. గా ప్రమోషనొచ్చినట్టొక పోటు విసిరాడు.

రంజన్ అతన్ని చూశాడు.

ఒక్కసారి అదిరిపడ్డాడు.

అతన్ని ఎక్కడో చూశాడు. ఎక్కడ చూశాడు చెప్మా. వెంటనే గుర్తుకు రాలేదు. చికాకుగా జుట్టు పీక్కున్నాడు.

ఎర్రగా, ఎత్తుగా, వుంగరాల జుట్టు-అఁ-

గుర్తుకొచ్చింది.

రజియా ఇంటికి రాత్రి వెళ్ళినప్పుడు తలుపుతీసి త్వర త్వరగా విష్‌చేస్తూ వెళ్ళిపోయాడు. అతనే-అయినా ఏమీ గుర్తు పట్టినట్లు మొఖం పెట్టాడు రంజన్.

"నీ పేరు."

"హూస్సేన్."

రంజన్ మరోసారి షాక్ తిన్నాడు. శంకర్ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. అతనే-ఇతను. రజియాకు అక్రమ సంబంధముంది ఇతనితో నన్నమాట.

"ఎక్కడుంటావు?"

బస్తీ పేరు చెప్పాడు.

"ఏం చేస్తుంటావు?"

"చదువుకుంటున్నాను."

"ఏం చదువుతున్నావు?"

"M. B. కాలేజీలో బి.ఏ. రెండవ సంవత్సరం."

సమాధానాలు తడబాటు పడకుండా తకీమని చెబుతున్నాడు.

"ఈ టేపు రికార్డరు నీకెక్కడిది?"

"మా అంకుల్‌ది."

"మీ అంకుల్ ఎవరు?"

సమాధానం ఆలస్యం అయింది: "మా అంకుల్.... పేరు...." ఏదో గొణిగాడు.

"ఫట్" మని పడింది దెబ్బ హుస్సేను మెడల మీద.

హుస్సేను ఉలిక్కి పడ్డాడు.

అది వెంకటస్వామి దెబ్బ. "సాబ్ అడుగుతుంటే గొణుగుతావేంబే. సాఫ్ సీదా చెప్పు-లేదా-" హెడ్డు హుంకరించాడు.

"చెబుతాను సార్? అంతా నిజం చెబుతాను. కాని కొట్ట కండి సార్...."

"నిన్నేమనం కాని-నిజం చెప్పాలి మరి."

"అలాగే సార్."

6

ఇన్ స్పెక్టర్ రంజన్, సంకెళ్ళతో హుస్సేన్‌నూ చూసి అదిరిపడింది రజియా.

"రజియా! నిన్ను అరెస్టు చేస్తున్నాను."

"నన్నెందుకు సాబ్."

"విటునితో కలిసి భర్తను హత్య చేసినందుకు."

"నాకేం తెలియదు సాబ్" బుకాయించింది.

"నీవు చేసిన పాపం నాచేత ఎందుకు చెప్పిస్తావు రజియా. హుస్సేన్ అంతా చెప్పాడు. అవకాశం దొరికి నప్పుడల్లా హుస్సేన్‌తో పచ్చిగా కోర్కెలు తీర్చుకొనే నీకు విటుణ్ణి వదిలి భర్తతో బొంబాయి వెళ్ళటం ఇష్టంలేదు. నీ వంటి సెగలు చల్లార్చలేక పోతున్నాడు నీభర్త. బొంబా యిలో మళ్ళీ క్రొత్తవాణ్ణి వెదుక్కోవాలి.

భర్తను అడ్డు తొలిగిస్తే బోలెడంత ఆస్థికి వారసురాలు కావచ్చు. ఇంకే ఆటంకమూ లేకుండా రేయింబవళ్ళు విటు నితో కామకేళీ విలాసాలలో మునిగి తేలవచ్చు.

అందుకే నీవు హుస్సేనును ఒప్పించి పధకం తయారు

చేశావు. నీభర్త ఇంటికి రాకముందే నీ విటుణ్ణి లోపల దాచిపెట్టావు. నీవూ, నీభర్తా భోంచేయగానే, పాలలో నిద్ర మాత్రలు వేసి ఇచ్చావు. అవి త్రాగి మహ్మద్ మత్తుగా నిద్రపోయాడు.

ఆ తరువాత నెమ్మదిగా హుస్సేన్‌తో కలిపి కార్యక్రమం అమలుచేశావు. విటుణ్ణి తెలివిగా అక్కడనుండి తప్పించావు. నీవు చక్కని నాటకాన్ని సృష్టించి, పోలీసు పరిశోధనను తప్పుదోవ పట్టించావు.

కాని ఒక్కటి గుర్తుంచుకో రజియా! నేరస్తులకు శిక్ష తప్పదు చట్టం ఏనాటికీ వలదు."

రజియా కొడుకుని కౌగిలించుకుని పెద్దగా ఏడ్చింది.

దొరికిపోయాననో.... లేక .... పశ్చాత్తాపమో....

లేడీకానిస్టేబుల్ రజియాను కష్టడీలోకి తీసుకుంది.□□□

[ఈ మధ్య జరిగిన ఒక యధార్థ సంఘటన ఆధారంగా]

అనుభవం....

పుల్లయ్య:—ప్లీడరుగారూ! మీరు వయస్సులో చాలా చిన్నవారు. క్రొత్తగా ప్రాక్టీసు పెట్టారు. నా కేసు నడిపించగలరా?

ప్లీడరు:—మీకా సందేహం వద్దు. మీ కేసు కోర్టులో విచారణకు వచ్చేసరికి నేను తప్పక ముసలివాడినవుతాను. అప్పటికి నాకు బోలెడు అనుభవం కూడా వచ్చేస్తుంది!

—జి. ఈశ్వర్, గార్ల.

ఆరు+అరవై ఆరు !!

కంచర్ల రమణ

మధ్యాహ్నం రెండున్నర గంటలయింది. వేసంకాలపు సూర్యుడు చండప్రచండంగా వున్నాడు. నిప్పులే వర్షిస్తున్నాడు.

బస్సులో నీడన ఉన్నప్పటికీ, సబ్ యిన్స్పెక్టరు కృష్ణం దొరకు సుఖంగాలేదు. ఆరోజు కాస్తున్న యెండ తన కోసమే అంత తీవ్రంగా కాస్తోందనుకుంటున్నాడు.

బస్సు ఎలాగయితేనేం బయలుదేరింది, ఓ పావుగంట తర్వాత, కిటికీల్లోంచి దూసుకు వస్తున్నగాలి, చెమటలూరిన ఒంటికి తగిలి చల్లగా, హాయిగా ఉన్నట్టనిపించింది.

కాని, ఆ హాయి ఎంతో సేపులేదు. చెమట ఆరిపోయాక, మంట దగ్గర సెగలాగ భగ్గుమంటూ తగల సాగింది గాలి.

కృష్ణందొర ఆలోచనల్లో పడ్డాడు.

ఇప్పుడు అతని మనస్సు ఆ ప్రయాణానికి దారితీసిన సంఘటనలన్నీ నెమరువేయ సాగింది.

దొర కళ్ళముందు ఎస్. పీ సుందర్రామయ్య మొహం కనిపించింది. అదిప్పుడు మాట్లాడసాగింది.

"చూడు దొరా! మన డిపార్టుమెంటులో మెరికల్లాంటి కుర్రాళ్లల్లో నువ్వొకడివని నాకు తెలుసు. అందుకే నిన్ను ప్రత్యేకంగా పంపిస్తున్నాను గొప్పులపాలెం. నాకు ధైర్యం వుంది నీకు అప్పజెప్పిన పని సాధించుకొస్తావని....

పంతుల్ని యెలాగయినాసరే అరెస్టుచేసి తీసుకురావాలి. అతడు దొరికేంతవరకూ నీ మకాం అక్కడే....ఒక్కటి గుర్తుపెట్టుకో. హోం మినిస్టరుగారు యీ నగ్జలైటు విషయమై చాలా పట్టుదలగా ఉన్నారు. పంతుల్ని అరెస్టుచేసి తీసుకురా....నీకు ప్రమోషను ఖాయం....

ఇహ, నీకు సాయంగా మనుషులంటావా-ఎంతమందిని కావలిస్తే, అంతమంది జవాన్లని వెనకన తీసుకెళ్ళు. అలా గని పెద్ద గుంపుని తీసుకెళ్ళకు....ముందు చాలా తక్కువ మందిని తీసుకెళ్ళు. అంటే అరడజను మించకుండా....ఆ తరువాత అవసరమనిపిస్తే, చిన్న కబురుపంపు....అంతే! డిపార్టుమెంటు అంతా పంపమన్నా పంపించేస్తాను."

అయితే, నగ్జిలైటు పంతుల్ని అరెస్టుచేసి తీసుకురావడం, ఆకాశంలో మెరిపిన మెరుపుని పిడికిట్లో బంధించి తేవడం ఒకటే అని డిపార్టుమెంటులో అందరికీ తెలుసు.

పంతుల్ని అరెస్ట్ చెయ్యడానికి, డిపార్టుమెంటు అవలంబించని పద్ధతిలేదు, ప్రయోగించని యెత్తులేదు. చెయ్యాల్సిన ప్రయత్నాలన్నీచేసి డిపార్టుమెంటు అలసిపోయింది.

అందుచేత, ఆ కేసులో యిరుక్కోవడం యెవరికీ యిష్టంలేదు.

అయితే, ఇటీవల, పంతులుగురించి, సాధికారమైన ఓ వార్త తెలిసింది. దానిప్రకారం, పంతులు గొప్పులపాలెం వెనుకనున్న అడవుల్లో దాక్కుని ఉన్నాడు.

'పంతుల్ని పట్టితెస్తే ప్రమోషను ఖాయం' వగైరా మాటలు తనచేత పనిచేయించుకోవడానికి ఎస్. పీ చూపిన యెర మాత్రమేనని-ప్రమోషన్లు మాత్రం సామర్థ్యం మీద గాక, మంత్రుల సిపార్సులమీద జరుగుతుందని దొరకు తెలుసు.

కాని, 'పంతుల్ని అరెస్టుచేసి, తీసుకొచ్చేంతవరకూ, నీ మకాం అక్కడే' అంటూ ఎస్. పీ అన్నాడు కాబట్టి, తనీ ఆపరేషనులో విజయుడు కాకపోతే, డిపార్టుమెంటులో తను కండెమ్ కావడం మాత్రం ఖాయం.

ఈ విషయాలన్నీ జాగ్రత్తగా ఆలోచించే, తనతో తీసు కెళ్ళాల్సిన జవాన్లని చూసి చూసి ఎంపిక చేసుకున్నాడు.

యధాలాపంగా, దొర చూపులు, తనవెనుక సీట్లమీద కూచున్న జవాన్లవైపు పరుగెత్తాయి.

ఓ సీటులో ముత్యాలు, మస్తాన్‌రావు, పాపారావు కూచున్నారు. మిగతా యిద్దరూ-బంగార్రాజు, పెదబాబు ఆ వెనకాల సీటులో కునికిపాట్లు పడుతున్నారు.

2

జంక్షన్‌లో బస్సాగేసరికి పొద్దు తక్కువయేదయింది.

సూర్యుడు పూర్తిగా పశ్చిమాని కొరిగిపోయాడు. ఎండ పొడగూడాలేదు. పొలాల మీంచి వస్తున్నగాలి చల్లగా ఒంటికి తగిలి హాయిమనిపిస్తోంది.

సబ్‌యిన్‌స్పెక్టరు దొర, అయిదుగురు పోలీసులు బస్సు దిగారు. టాప్‌మీంచి, ఆరుగురి బెడ్డింగులూ, బట్టలూ

సామాన్లూ ఉన్న ట్రంకు పెట్టెలూ, సూట్ కేసూ ఎంతో జాగ్రత్తగా క్లీనరు దించి పెట్టేడు.

ఇంకో నిముషంలో క్లీనరు రైట్ చెప్పడం, బస్సు బుర్రుమంటూ ముందుకు సాగిపోవడం జరిగింది.

దొర నలువైపులా చూసాడు. కనుచూపు మేరవరకూ ఓవైపు పొలాలు. మధ్యగా రోడ్డు. ఇంకోవైపు కొంత వరకూ పొలాలు, ఆ మీదట, దట్టంగా చెట్లు.

ఇంకో పావుగంటలో చీకట్లుపడే సూచనలున్నాయి. కాని తామింకా, అరగంటసేపు నాటున ప్రయాణం చేస్తే గాని గొప్పులపాలెం రాదు.

"ఇంత సామాను పుచ్చుకుని నడిచివెళితే, ఒళ్ళు హూనమై నాలుగు రోజులు మంచానపడి ఉండాల్సివస్తుంది. ముందుగా మున్సబుకు రాసి, యేబండో తెప్పించుకోవాల్సింది"-ఓక్షణం తన పరిస్థితికి వాపోయాడు గాని వెంటనే 'యిప్పుడు విచారించి లాభంలేదు. కర్తవ్యం ఆలోచించాలి' అని సమాధానం చెప్పుకున్నాడు.

సామానుతో తాము సుఖంగా వూరు చేరుకోవడం యెట్లా అని తీవ్రంగా ఆలోచించసాగాడు.

"ఏట్రయ్యా? అలాగుండిపోనావు?....పద! పద! ఏటనుకున్నావో యేటో పిటంలో సీకటిపడిపోద్ది. బేగి అడుగెయ్యి. ఎలిపోదాం" బస్సులోంచి దిగిన ఓ పల్లెటూరి మనిషి ఆడిన మాటలు వినబడ్డాయి దొరకు.

వాళ్ళవైపు చూసాడు. వాళ్ళు మొత్తం నలుగురున్నారు. చెవుల వెనకాల పెద్ద చుట్టలూ, చేతుల్లో పొడుగాటి కర్రలూ, మోకాళ్ళవరకూ వేలాడే గోచులూ-అదీ వాళ్ళ వేషం.

బస్సుదిగి తమ వూరుపోతున్న పల్లెటూరి బైతులు అని

అర్థం చేసుకొన్నాడు దొర.

వాళ్ళచేత సామాను మోయిస్తేనో?....ఆలోచన వచ్చిందతనికి.

"మస్తాన్‌రావ్!" అంటూ మెల్లగా పిలిచి వాళ్ళవైపు కనుసైగ చేసాడు దొర. మస్తాన్‌రావు అర్థంచేసుకొన్నాడు.

"ఏవూరు నాయుడూ మందీ?" అన్నాడు బయలుదేరి వెళిపోతున్న ఆ మనుషుల్ని ఉద్దేశించి.

"మాదా?....పిరిపురం బాబయ్యా!" అన్నాడు వాళ్ళల్లో ఓ మనిషి వెనుదిరిగి.

"అయితే, ఎటువెళ్తారేటి!"

త్రోవ చూపాడు ఆ వ్యక్తి మస్తాన్‌రావుకి. 'తాము కూడా వెళ్లేది అటే.'

"ఇలారండి, యీ సామాను యెత్తుకోండి. కలిపి పోదాం" అన్నాడు మస్తాన్‌రావు చెయి ఊపి.

ఆ మనుషులు వెంటనే ముందుకు రాలేదు. సంశయాత్మకమైన చూపులతో నిలుచుండిపోయారు.

"తఁవఁరేవూరు ఎళ్తంఁడ్రు బాబూ?" అడిగాడు ఆ పల్లెటూరి మనిషి.

"గొప్పులపాలెం" చెప్పాడు ముత్యాలు.

"మాఁవు సానాదూరం యెల్లాల బాబూ?" గొణిగి ఊరుకున్నాడు ఆ వ్యక్తి. ఇంకొకడు నడవమన్నట్టుగా మిగతా వాళ్ళవైపు చూడగానే, అందరూ బయలుదేరారు.

"ఒరేయ్! ఆగండి ముందు" ఉరిమినట్టుగా అన్నాడు పాపారావు.

వాళ్ళు ఆగిపోయారు.

"ముందు యిలావచ్చి సామాను యెత్తుకోండి" పాపా

రావు గద్దించాడు.

"బాబ్బాబు!....మమ్మల్నొదిలేయండి. గొప్పులపాలెం అటు. తిన్నగా పోవాల....మావూరు పిరిపరం యిటు.... ఆ తోటలోంచి ఎలితే అదే అడ్డదోవ'' పల్లెటూరి మనిషి బ్రతిమాలుకుంటూ జవాబు చెప్పాడు.

''యేట్రా అలాగయిపోతున్నారు....మా సామాను గొప్పులపాలెంలో దించేసాక, ఒక్కక్షణం ఉంచుకోము మిమ్మల్ని."

''సామాను బట్టుకోడానిక్కాదు బాబూ మా యిది. గొప్పులపాలెం వొచ్చి, పిరిపురం పోవాలంటే, సుట్టు అయిపోతాది....యింకో ఆరుమైళ్ళు అడివిలోంచి ఎల్లాల అదీగాక అమావోస రాత్రులు....సీకటడిందంటే....కన్ను పొడుచుకున్నట్టుంటందండి యిటు....మా ఆడమనిషికో దానికి ఒంట్లో బాగానేదండి....బేగి యెల్లిపోవాలండి." వివరించాడు పల్లెటూరి మనిషి.

తను సామాను పట్టుకోవాల్సి వస్తుందనే, వాళ్ళు అలా చెప్తున్నారనీ, అదంతా ఓ కట్టు కథనీ అనుకున్నారు పోలీసులు.

"ఒరేయ్!....ముందు సామాను యెత్తుకోండి" అన్నాడు మస్తాన్‌రావు కోపంగా, వాళ్ళవైపు చూసి.

బుజాన్న తుపాకీలు, మొలనుబాకులు, కాకీ యూనిఫాంలో ఉన్న ఆ పోలీసులవైపు భయంగా చూసారు ఆ పల్లెటూరి మనుషులు. కాని సామానువైపు కదల్లేదు.

''సామాను యెత్తుకోరా అంటుంటే నీక్కాదూ?" అంటూ ఓ మనిషి మెడపట్టి ముందుకు తోసాడు పాపా రావు.

"ఎత్తుకోండ్రా.... యేటిసేస్తాం" బుర్ర గోక్కుని ఆ మనిషి అనగానే, అందరూ కలసి సామాన్లు యెత్తుకున్నారు.

సామాన్లు యెత్తుకున్న మనుషులు ముందర నడుస్తుంటే వెనకాల పోలీసులు నడవడం ఆరంభించారు.

గొప్పులపాలెం వాళ్లు చేరేసరికి, పూర్తిగా చీకటి పడి పోయింది.

గొప్పులపాలెం ఊరంతా కలిపి, రెండే రెండు వీధులు. జనాభా రెండువేలకు మించదు. మూడొంతులమంది, పొలాలమీద, అడవినుంచి వచ్చే ఫలసాయంమీద బ్రతుకుతారు.

పోలీసు దళం తిన్నగా మున్సబు యింటికి నడిచింది.

మున్సబు నరశింహులు యింటి దగ్గరే ఉన్నాడు.

సబ్‌యిన్‌స్పెక్టర్ని, పోలీసుల్ని చూడగానే, ఆదరా బాదరా వెలుపలి కొచ్చాడు మున్సబు, యింటిలోంచి.

"ఒరేయ్! ఆ సామాను ఆ అరుగుమీద దించి వెళ్ళిపోండి" అన్నాడు పాపారావు సామాను తెచ్చిన మనుషుల్నుద్దేశించి.

తక్షణం సామాన్లు మున్సబు యింటి అరుగుమీద దించేసి వెళ్ళిపోయారా మనుషులు.

3

మున్సబు నర్సింహులుకి రెండిళ్ళున్నాయి ప్రక్క ప్రక్కనే. ఒక యిల్లు కాళీచేసి పోలీసు దళం ఉండడానికి యిచ్చాడు.

సాధారణంగా పోలీసులు కేంపుకు వచ్చినపుడు స్కూలు ఆవరణో, పంచాయితీ ఆఫీసు వరండాయో వాడుకోవడం

మామ్మూలు. గొప్పులపాలెంలో పంచాయితీ ఆఫీసులేదు. ఉన్న ఒక్క ఎలిమెంటరీ స్కూలు- పేరుకు స్కూలేగాని- ఒక పెద్ద పాక. నేల మట్టిది. తాళం వేసుకుని ఉండడానికి ఓ గదంటూ లేదు.

అంచేత మున్సబు యిచ్చిన యిల్లు ఆ వూళ్లోకల్లా, అన్ని విధాలా సదుపాయంగా ఉన్నట్టనిపించింది సబ్ యిన్‌స్పెక్టర్ కృష్ణందొరకి.

పోలీసువాళ్ళ సౌకర్యాలు చూడ్డానికి, యిద్దరు పని వాళ్ళను పెట్టాడు మున్సబు. పోలీసు వాళ్ళకు నీళ్లు తెచ్చి పెట్టడం దగ్గర్నుంచి, వంట వండి వడ్డించడం వరకూ ఆ పనివాళ్ళే చూసుకోసాగారు.

ఉదయం తొమ్మిది గంటలయింది.

మున్సబు తన కచ్చేరి ఆఫీసునుంచి సప్లయిచేసిన ఒక్కగా నొక్క తాతలనాటి కుర్ర టేబిలు, కుర్చీ, ఆక్రమించి కూచున్నాడు సబ్ యిన్‌స్పెక్టర్ దొర.

అతనిచేతిలో ఓ ఫొటో ఉంది. దాన్నిప్పుడు టేబిలు మీద అందరికీ కనిపించేలా పెట్టేడు.

టేబిలు చుట్టూ నిలుచున్న జవానులు ఏకాగ్రతతో చూస్తూ వుండగా, నగ్జలైట్ పంతుల్ని అరెస్ట్ చెయ్యడానికి తను తయారుచేసిన ఆపరేషను పద్ధతి వివరించసాగాడు:

"ఈ ఫొటో జాగ్రత్తగా చూడండి. ఇది పంతులి ఫొటో. పంతులు యీ వూళ్ళో మారువేషంలో తిరుగుతూ ఉండవచ్చు. అంటే, యీ ఫొటోలో ఉన్న వ్యక్తి పోలి కలకు దగ్గరున్న వ్యక్తినల్లా అనుసరించండి. ఆరాలు తియ్యండి. అనుమానం నివృత్తి గాకపోతే, పట్టి యిక్క దకు తీసురండి. వాడు పంతులు కాదని తేలేదాకా, వాడ్ని

వదలకూడదు.

అంతేకాదు. యీ వూరికి ఆనుకుని ఉన్న అడవుల్లో ఉన్నాడు కాబట్టి, యేదో అవుసరంమీద యీ వూరు వస్తూండవచ్చు. వస్తే....యెలా వస్తున్నాడు? ఎప్పుడు వస్తున్నాడు? అతనికి సాయంచేసే యీ వూరి మనుష లెవరైనా ఉన్నారా? పంతులుగురించి యీ వూరి వాళ్ళ కెంత తెలుసునో. అంతా సేకరించాలి యేం? అర్ధమైందా?"

దొర ఆగి జవాన్ల మొహంలోకి చూడసాగాడు పరీ క్షగా. తను చెప్పింది ఒంట బట్టినట్టుగా అనిపిస్తోంది గాని, వాళ్ళ నేవో సందేహాలు బాధిస్తున్నట్టుగా కూడా అర్థం చేసుకున్నాడు.

"మీకేమన్నా సందేహాలుంటే నిర్భయంగా యిప్పుడే అడిగేయండి. తీరుస్తాను" అన్నాడు.

రెండు నిముషాల నిశ్శబ్దం తరువాత "సార్! యీ అడ విలో పంతులు ఉన్నాడన్నది కచ్చితమైన వార్తేనా?" అడి గాడు బంగార్రాజు.

"ఆ విషయం ఎస్. పీ గారు చూసుకున్నాక గాని, మనల్ని యిక్కడకు పంపి ఉండరని నా నమ్మకం. ఈఅడ వుల్లో పంతులు ఉన్నాడనే, ఆరంభిద్దాం మన ఆపరేషన్."

"అదికాదు సార్! పంతులు యీ అడవుల్లోనే ఉన్నా డనీ, యీ ఊరు తరచు వస్తుంటాడనీ, ముందు తేల్చు కున్నాకగాని, అతన్ని పట్టుకునే ఆపరేషన్ మొదలుపెట్టడం మంచిది కాదంటాను" లోన బెదురుగా ఉన్నా ధైర్యంచేసి అనేసాడు బంగార్రాజు.

"ఎందుచేత?" తనకున్న అసహనమంతా ఆ ఒక్క మాటలో ప్రకటించాడు సబ్ యిన్‌స్పెక్టర్ దొర.

"సార్! అలా చెయ్యకపోతే, మన ఆపరేషన్ అంతా

వట్టి వేస్ట్. పాతర యెక్కడుందో ఉరమరగా తెలియ కుండా, తవ్వడం ఆరంభించినట్టుగా ఉంటుంది."

"అయితే యేంచేద్దామంటావ్?" తెచ్చిపెట్టుకున్న శాంతంతో అన్నాడు దొర.

"సార్! ముందుగా యీ అడవిని వెతుకుదాం. పంతులు అంటూవుంటే, యీ వూరికి, మహా అయితే, యిరవై మైళ్ల లోపునే ఉంటాడు. అతడు యీ ప్రాంతంలో తిరుగుతున్నా డన్న గురుతులు స్పష్టంగా మనకు అగపడితేనే, పంతుల్ని అరెస్టుచేసే ఆపరేషన్ మొదలుపెడదాం," వివరించాడు బంగార్రాజు.

"సరే! అలాగే చేద్దా" తన అంగీకారాన్ని తెలిపాడు దొర.

బంగార్రాజు సలహా ప్రకారం, తను తయారుచేసిన పథకాన్ని తిరుగ తయారుచేసాడు. అందుకు సుమారు గంట వ్యవధి పట్టింది.

"ఇహ బయలుదేరండి. అడవిలోకి వెళ్దాం" అన్నాడు దొర లేచి.

జవాన్లుకూడ లేచి బయలుదేరారు.

వాళ్ళ బుజాన్న లోడ్‌చేసిన రైఫిల్స్ ఉన్నాయి. స్పేర్ ఎమ్యూనిషన్ పట్టుకున్నారు. దాహంవేస్తే త్రాగడానికి వాటర్ బాటల్స్‌నిండా నీళ్ళు నింపారు. అడివిలోంచి తిరిగి వచ్చేలోపున ఆకలేస్తే తినడానికి, చపాతీలు, కూర టిఫిను పాకట్లు పట్టుకున్నారు.

అడవిలోపలికి చేరుకోవడానికి వారికి గంటపైగా పట్టింది. వూరు దాటాక, వెళ్ళిన త్రోవలోగాని, ఆ చుట్టు పట్ల కనుచూపు మేరలోగాని, మనుషులు నివశిస్తున్నట్టుగా

ఆచూకీ లేదు.

అందరూ ఓ పెద్ద మర్రిచెట్టు వద్దకు చేరుకున్నారు. ఆ చెట్టు, ఆ చుట్టుపట్ల ఉన్న వృక్షాలన్నింటిలోనూ ప్రత్యేకంగా, విస్పష్టంగా గుర్తుపట్టడానికి వీలుగా ఉంది.

దానిక్రింద ఆగాడు సబ్ యిన్ స్పెక్టర్ కృష్ణందొర.

"మనం యిక్కడ ఆగుదాం. యిక్కడనుంచి మన కూంబింగ్ ఆపరేషన్ ఆరంభిద్దాం. ఆరుగురం ఆరు దిక్కులకు వెళదాం. ఇంచుమించు ఓ మైలు దూరం వెతికాక, వెనక్కివచ్చి, ఫలితం యేమీ కనిపించకపోతే, వేరే చోటనుంచి యిలాగే కూంబింగ్ చేద్దాం.

అలాగ నాలుగయిదు రోజుల్లో యీ అడివి యిరవై చదరపు మైళ్ళ భాగం పూర్తిగా ప్రతి అంగుళం, పంతులు ఆచూకీ కోసం-వీలుచిక్కితే, పంతుల్ని పట్టడంకోసం వెతకాలి."

దొర చెప్పిన ప్లాను అందరికీ నచ్చింది. వెంటనే, ఆరుగురు వేర్వేరు దిక్కులకు బయలుదేరారు.

'కూంబింగ్' ఆపరేషన్ ఆరంభమైంది.

4

ముప్పావు గంటసేపు ప్రతిచెట్టు, పొద వెదికాక ఓచెట్టు మొదట్లో చతికిలబడ్డాడు పాపారావు.

అప్పటికి పదకొండు గంటలయింది. ఆకాశంలో సూర్యుడు చండప్రచండంగా మండిపోతున్నాడు. చెట్ల కొమ్మలు తన నెత్తిమీద, ఓ పందిరిలాగ అల్లుకుని ఉన్నా, ఎండ తీవ్రత అతనికి తెలుస్తూనే ఉంది. ఒళ్ళంతా చెమటలు కారి, బట్టలు తడిసి ముద్దయిపోయాయి.

దాహం వేసినట్టనిపించగానే, బాటిల్ లోంచి నీళ్ళు నోట్లో

కొంచెం కొంచెం ఒంపుకుంటూ తీరుబడిగా త్రాగాడు.

పోలీసు డిపార్టుమెంటుని యేడిపించడానికి ఎవరో తప్పుడు ఫోగట్టా అందించి ఉంటాడనీ. అది నిజమనుకుని ఎస్. పీ తమని అడివిలోకి తరిమాడనీ, పాపారావుకి మొదట్నించీ అనుమానం పీకుతూనే ఉంది.

తను చూసిన కాస్త మేరలో పంతులు కాదుకదా, ఏ నరమానవుడూ - ఉన్నట్టుకూడా ఆనమాలు లేకపోగానే, అతని అనుమానం మరింత బలపడింది.

తనకు తెలిపినంతమట్టుకు పంతులు అఖండుడు. అపారమైన తెలివితేటలు గలవాడు. పోలీసుల్ని యేమార్చడంలో గజదొంగల్ని మించిన గజదొంగ. వృత్తికి ఎలిమెంటరీ స్కూలు మేష్టరవుగాక, మార్క్సిజం లెనినిజం సిద్ధాంతాలు అతనిలో బలంగా పాతుకుపోయాయి.

పంతులుమీద మూడు హత్య కేసులున్నాయి. ఇద్దరు భూకామందుల్ని, ఓ లక్షాధికార్ని, వాళ్ళ కుటుంబాల్లో ఒక్కనలుసుకూడా బయటపడకుండా, చంపిపారేసాడు.

దేశమంతటా పోలీసులు జరిపిన దాడుల్లో, చిన్నా, పెద్దా నగ్జలైట్ ఉద్యమకారులు చాలామంది దొరికిపోయారు. కాని, పంతులులాంటి గట్టి పిండాలు యింకా దొరకకుండా తప్పించుకుంటున్నారు. డిపార్టుమెంటు ఎన్ని పధకాలు వేసినా వాళ్ళు చిక్కడంలేదు.

ఈసారి కూడా పోలీసులకు పంతులు చిక్కడన్నది పాపారావు గట్టి నమ్మకం.

"ఛీ? ఎందుకూ కొరగాని యీ వెధవ ఆపరేషనులో యిరుక్కున్నాను" అనుకుంటూ బూటుకాలుతో నేలను కసిగా తన్నాడు.

ఇదే. తనకో నేరస్తుడ్ని అప్పజెప్పి నిజం పలికించ మంటేనా! వాడ్ని కసిగా, తృప్తిదీరా, నెత్తురు కారేలాగు, ఎముకలు విరిగేలాగు, పాపారావులోని సేడిస్ట్ అతడి నరాల కేంద్రంమీద పనిచేయడం ఆరంభించడంతో-ఓ నేరస్తుడ్ని ఊహించుకుని, అతడ్ని కాలితో అదేపనిగా తన్నసాగాడు. కాసేపయ్యేసరికి, అతని కాళ్ళవద్ద ఓగొయ్యి యేర్పడింది.

ఆ గొయ్యిలో యింతకుముందు యేవో కప్పబడినట్టు న్నాయి. అవి యిప్పుడు బయటికొచ్చాయి.

వాటని ఆశ్చర్యంగా పరిశీలించసాగాడు.

పొయి బూడిద, మసి అంటిన మూడు రాళ్లు, ఉల్లిపాయ తొక్కలు. కూర ముక్కలు, టీ గుండ, ఓ చార్మినారు సిగరెట్ కాళీ పేకట్టు, కొన్ని సిగరెట్టు పీకలు, ఓ గొల్ల భామ కాళీ పాలడబ్బా-యిదీ గోతిలోంచి బయటపడ్డ వస్తువులు.

ఈ నిర్జనారణ్యంలో యివెక్కడ్నించి వచ్చాయి? కచ్చి తంగా, యివి, పంతులు యిక్కడున్నట్టుగా, చాటి చెప్పే గుర్తులు.

"దొరా!" ఆనందంతో కేకపెట్టి, ఊడలమర్రి చెట్టు వైపుకు పరుగెత్తాడు పాపారావు.

పాపారావు దొరను కలుసుకుని, దొర మిగతా జవాన్లని కూడా సమీకరించుకుని, పాపారావు చూపిన స్తలానికి చేరుకునేసరికి ఓ గంట పట్టింది.

గోతిలోంచి బయటపడ్డ వస్తువుల్ని చూస్తుంటే, పంతులు తన ఉనికిని గోప్యంగా ఉంచడానికి, అవలంబిం చిన పద్ధతేమిటో దొరకు స్థూలంగా బోధపడింది.

పంతులు ఓచోట స్థిరంగా ఉండడు. స్థిరంగా ఓచోట-రహస్యంగా ఉన్నా-వచ్చే ప్రమాదమేమిటో అతనికి బాగా తెలుసేమో.

ఉదయం ఓచోట వండుకుంటే, రాత్రికి యింకోచోట. ప్రతీచోటా తను అక్కడ ఉన్నట్టుగా తెలియజేసే గుర్తుల్ని మిగలనివ్వడు. పొయి బూడిద, తను వాడి వదిలేసిన వస్తువులు, కూర ముక్కలు, ఎంగిలి మెతుకులు, గొయ్యి తీసి పాతిపెట్టేస్తాడు.

అంటే, తన వంటకు కనీసం కావల్సిన వంటపాత్రలు, ప్రక్కబట్టలు వగైరా, తనతోపాటుగ దొమ్మరివాడిలా తీసుకుపోతూ తిరుగుతున్నాడన్నమాట.

ఏది యేమైనా పంతులు యీ ప్రాంతంలో ఉంటున్నాడన్నది తధ్యం. ఇహ, పంతుల్ని కనిపెట్టి అరెస్ట్ చెయ్యటమే మిగిలి ఉంది.

తనకు దొరికిన గుర్తులు కచ్చితమైనవేననీ, రేర్ కేసు యెంతమాత్రం కాదని నిర్ధారించుకోవడానికి, జవాన్లను పంపి, ఆ చుట్టుపట్ల, పాతిక ముప్పైచోట్ల నేలను తవ్వించి చూసాడు. అన్ని ప్రయత్నాలు ఫలితాన్ని ఇవ్వక పోయినా, పాపారావుకి కన్పడినట్టుగానే, రెండు మూడు చోట్ల పొయ్యి బూడిద వగైరా వస్తువులు, నక్సలైట్ సాహిత్యం బయటపడ్డాయి,

5

గొప్పులపాలెంలో మొత్తం రెండువందల కుటుంబాలు ఉన్నాయి. అంటే సుమారు రెండువేలమంది ఉన్నారు, చిన్నా చితకా కలిపి.

రాజకీయాలు, కుట్ర, రహస్య వగైరా వంకర్లు తెలీని,

పదిహేనేళ్ళలోపు పిల్లలు సుమారు వందమంది ఉన్నారు. అలాగే వెర్రివాళ్ళు, చూపు తగ్గిపోయి, జవం ఉడిగిపోయి, చావుకోసం క్షణక్షణం యెదురుచూసే ముదివగ్గులు మొత్తం పాతిక ముప్పైవరకూ ఉంటారు. వీళ్ళని వదిలేస్తే, పద్దెనిమిది వందల పైచిలుకు జనం మిగులుతారు.

ఈ పద్దెనిమిది వందల మందిని కదిలించి చూస్తే, పంతులు ఉనికిగురించి భోగట్టా రాబట్టుకోవచ్చని దొరకి ఒక ఆలోచన.

వాళ్ళని తను ఒక్కడూ ఇంటర్రాగేట్ చెయ్యడం ఆరంభిస్తే, రోజుకు వంద మందినిమించి ప్రశ్నించే శక్తి తనకు లేదు కాబట్టి-సుమారు ఇరవై రోజులు పడుతుంది.

ఆపైన, అనుమానం కలిగినచోట ఇంకా నిశితంగా, లోతుగా వ్యక్తుల్ని ప్రశ్నించ దలుచుకుంటే-అనుమానితులు కనీసం పదిమందైనా తేలే అవకాశం ఉంది కాబట్టి-ఇంకో పదిరోజులు పడుతుంది.

ఇంటర్రాగేషన్ వంటి ప్రాథమిక ప్రక్రియలతోనే కాలం వృధా చెయ్యడం దొరకు ఇష్టంలేదు.

అందుచేత, ఇంటర్రాగేషన్ కోసం, జవాన్లమంచి ఇద్దర్ని యెన్నుకున్నాడు. అంటే, ముగ్గురు కలిపి గ్రామస్తుల్ని ఇంటర్రాగేట్ చేస్తారు. మిగతా ముగ్గురిలో ఇద్దరు, ఊరిలోని వ్యక్తుల్ని ఒకరి తర్వాత ఒకర్ని పిలుచుకువస్తే, మిగతా ఒక్కడూ ఆ వూరికి, పనిమీదో, బంధువుల కారణంగానో వచ్చే వ్యక్తుల్ని కూడగట్టి ఇంటర్రాగేషనుకు తీసుకువస్తాడు.

ఇంటర్రాగేషన్ మొదలైంది.

"పంతులుగురించి నీకు తెలుసా?" అంటే, "ఆయనెవరు

బాబూ:" అంటూ తెల్లమొహం వేసిన మనుషుల్ని మొదటి ప్రశ్నతోనే పంపించేసాడు దొర.

అయిదు రోజులపాటు నిరవధికంగా సాగింది ఇంటరాగేషన్.

ఆ గ్రామంలో పెద్ద సంచలనం రేగింది.

పంతులు యెవరు? అతనిగురించి పోలీసులు ఎందుకు ఆరాతీస్తున్నారు? తమలో యెవరికయినా పంతులుగురించి తెలుసునా? తెలిస్తే ఆ వ్యక్తులెవరు? ఇంతకూ, పోలీసుల్ని పట్నంనుంచి కదిలించి, రప్పించిన పంతులు అంత ప్రమాదస్తుడా?

అయితే, ఏమిటా ప్రమాధం?

గొప్పులపాలెం గ్రామస్తులు భయం భయంగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు తమకు తోచిన జవాబులు తడబడుతూ ఇచ్చినా, పంతులు విషయం తమలో తాము బాగా చర్చించుకోసాగారు.

ఈలోపున పోలీసులు ఓ ప్రకటన చేసారు ఊరులో.

"పంతులన్న వ్యక్తి పోలీసుల్ని యేమార్చి తిరుగుతున్న హంతకుడు. మహా నేరస్తుడు. అతడు గొప్పులపాలెంకు అనుకున్న అడవుల్లో దాక్కుని చరిస్తున్నట్టు పోలీసులకు కచ్చితమైన సాక్ష్యాధారాలు దొరికాయి.

అంటే, పంతులు తరుచుగా నిత్యావసర వస్తువులు కొనుక్కోవడానికిగాని, తన మద్దతుదారుల్నుంచి అడిగి తీసుకోవడానికిగాని, గొప్పులపాలెం వస్తుండాలి. తనెవరో స్పష్టంగా తెలిసేటట్టుగా వచ్చి వెళ్ళకపోయినా, మారు వేషంలో వచ్చిన వ్యక్తిని గొప్పులపాలెం గ్రామస్తులు చూసి ఉంటారు.

అందుచేత, పంతులుగురించి తెలిసినవాళ్ళు, ఏమాత్రం ఆలసించకుండా, తమకు తెలిసినంతవరకూ పోలీసులకు చెప్పాలి. తెలిసిన భోగట్టా, పోలీసులకు తెలియకుండా దాయడం శిక్షార్హం.

అంతేకాదు. అలా పంతులుగురించి భోగట్టా ఓవ్యక్తికి తెలిసినట్టూ, ఆ వ్యక్తి ఆ భోగట్టా పోలీసులకు చెప్పకుండా దాచుకున్నట్టు తెలిసినా, ఆ వ్యక్తిగురించి పోలీసులకు తెలియజెయ్యాలి. అలా తెలియచెయ్యని వ్యక్తికూడా, నేరస్తుడుగా, ప్రభుత్వ వ్యతిరేకిగా పరిగణింపబడుతాడు."

ఆ ప్రకటనతో ఊరు అట్టుడికినట్టు ఉడికిపోసాగింది. తమలో నేరస్తులు దాగున్నారనీ, ఆవిషయం బయటపడ్డప్పుడు ఆ వ్యక్తితో తాము రోజూ కలిసి మాట్లాడి ఉంటే, తాము దోషులుగా, నేరస్తులుగా శిక్షింపబడవచ్చునన్న భయంతో జనం వణకసాగారు.

ఈలోపున పోలీసులు ఇంకో బాణం ప్రయోగించారు జనంమీద.

పంతులుగురించి కచ్చితమైన భోగట్టా అందించి, పంతులు అరెస్టుకు దోహదంచేసిన వాళ్ళకు అయిదువేల రూపాయల నగదు బహూమతి ఇవ్వబడుతుందనీ, అలా భోగట్టా తెచ్చిన వాళ్ళపేర్లు అతి రహస్యంగా ఉంచబడతాయనీ. కావలిస్తే, వాళ్ళకు పోలీసు రక్షణ కూడా ఇవ్వబడుతుందనీ పోలీసులు ప్రకటించారు.

అయిదువేల రూపాయలు మొత్తంగా చూసిన వ్యక్తుల్ని ఆ వూళ్ళో వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అదికూడ వాళ్ళ మొత్తం జీవితాల్లో ఏ ఒకటి రెండుసార్లో అయ్యుంటుంది. అందువల్ల ఆ ప్రకటన వాళ్లల్లో ధనాశ రేకెత్తించింది.

ప్రతి ఒక్కడూ, ప్రక్కవాడ్ని శల్య పరీక్ష సాగిస్తున్నట్టు చూడసాగాడు.

ఇప్పుడు గొప్పులపాలెం గ్రామస్తుల హృదయాల్లో భయం, అనుమానం, దబ్బాశ తప్ప ఇంకో భావం మెదలడం లేదు.

అయిదు రోజులపాటు సాగిన ఇంటర్రాగేషన్ పెద్ద ఫలితాల్ని ఇవ్వలేదు. ఇంటర్రాగేషన్ చెయ్యబడ్డ మనుషుల్లో ఒక్కరంటే ఒక్కరు అనుమానితుడు దొరకలేదు.

ఇంకో అయిదురోజులపాటు ఆగి చూసాడు దొర తన ప్రకటనల ఫలితంగా, పంతులు ఉనికిగురించి యెవరైనా భోగట్టా తీసుకురాకపోతాడా అని.

కృష్ణందొర ఆశ నిరాశయ్యింది.

'వేసిన పథకాలన్నీ మట్టి కొట్టుకుపోయాయి గదా. ఇక ముందు యేంచెయ్యాలి నేను?' అని దొర తల బాదుకుంటుంటే, ఓ సలహా పారేసాడు ముత్యాలు.

"సార్! ఇంతవరకూ మనం సవ్యంగానే పోయాం. ఫలితం లేకపోయింది. పంతుల్ని మనం యెలాగయినా అరెస్ట్‌చేసి తీసుకెళ్ళాలంటే, అందుకు అవసరమైన భోగట్టా జనాభా దగ్గర్నించి రాబట్టాలంటే, కొన్ని అపసవ్య మార్గాలు కూడా తొక్కాల్సి ఉంటుంది."

"అంటే యేంచేద్దామంటావ్?"

"ఇక్కడున్న జనంలో పంతులుకి మద్దతు ఇస్తున్న వాళ్ళున్నారు. మనం యేంచేసినా వాళ్ళు బయటపడడం లేదు. మనం రోజూ ఏదో సాకుబెట్టి, కొంతమందిని బాదేస్తూ ఉంటే, దెబ్బలు భరించలేక, పంతులు మద్దతుదారు తన గురించి పోలీసులకు తెలిపిపోయిందనుకుని

బయటపడతాడు. అప్పుడు వాడ్ని ఇంకా, రాచేసి పూర్తి భోగట్టా రాబట్టుకోవచ్చు." వివరించాడు ముత్యాలు.

"అభాగ్యులు, అమాయకులు, దురదృష్టవంతులు మధ్యలో నలిగిపోతారేమో?"

"సార్! గత్యంతరం లేకపోతే యేంచేస్తాం? అయినా, మనలో యీ మెతకతనం చూసే పంతులు తప్పించుకు తిరగగలుగుతున్నాడు. అయినా, మనం యీ పనులన్నీ మనకోసం చెయ్యడంలేదు. సంఘం యొక్క స్థూల శ్రేయస్సు దృష్ట్యా ఇవన్నీ చేస్తున్నామనుకుంటే-మనకంత బాధగా ఉండదు."

6

స్పృహ కోల్పోయిన శతవృద్ధుడు అప్పలనాయుడ్ని, మస్తాన్‌రావు పెద్దబాబు యెత్తుకొచ్చి, అప్పలనాయుడి ఇంట్లో మంచంమీద పడేసి వెళ్ళిపోయారు.

పోలీసులు వచ్చి, అప్పలనాయుడ్ని పిలుచుకు వెళ్ళాక, గుబగుబ లాడుతున్న గుండెలతో- అప్పలనాయుడ్ని పోలీసులు ఇంటికి తీసుకొచ్చి పడేసేంతవరకూ, తిండి తిప్పలు మానేసి, పనీపాటా వదిలేసి, ఎదురు చూడసాగారు అతవి కుటుంబం.

ఒంటిమీద తెలివిలేని నాయుడ్ని చూడగానే, గొల్లు మంటూ గుండెలు పగిలేలా యేడవసాగారు, అప్పల నాయుడి పెళ్ళాం, ముసలి తల్లి, వయసొచ్చిన కూతురు, అతడి పదేళ్ళ కొడుకూ.

నాయుడి ఒళ్లంతా వాపులూ, తట్లూ, నాయుడి పెళ్ళాం అతడి ఒంటిమీద చెయ్యేసి చూపింది. స్పృహ తప్పినా, "అమ్మా!" అంటూ బాధగా మూలిగాడు.

పోలీసులు యేంచేసారో వాళ్లకు తెలుసుగాని, అతడి ఒళ్లంతా ఒక పెద్ద పుండులా సల్పుతోందని అర్థంచేసుకుని రోదించసాగారు.

వాళ్ల యేడుపులు విన్న ఇరుగు పొరుగులు కంగారుగా మూగారు. అప్పలనాయుడి పరిస్థితి కళ్ళారా చూసారు. వాళ్ల గుండెలు గుబగుబ లాడిపోయాయి భయంతో.

"యేం జరిగింది?" అంటూ ఆత్రంగా అడిగారు. కాని పోలీసుల చేతిలో చావు దెబ్బలుతిన్న అప్పలనాయుడికి తప్ప యేం జరిగిందో యెవరికి తెలుసు?

అప్పలనాయుడి శరీరాన్ని ఎత్తుకుని వీధిలోంచి తీసుకొచ్చి అతడ్ని ఇంటిలో పడేయడం, గుప్పెట్లో గుండెలు పెట్టుకుని చూశారు గ్రామస్తులు.

అవాళ వాళ్ళు అలా చూపింది అప్పలనాయుడ్ని ఒక్కణ్ణేకాదు. అలాగ మరో నలుగుర్ని పోలీసులు చావ బాది, తీసుకొచ్చి, వారి వారి ఇళ్లల్లో పడేయడం చూసారు ఆ వూరి ప్రజలు.

గొప్పులపాలెం గ్రామస్తుల గుండెల్లో బీభత్సం తాండవం ఆడసాగింది.

రెండు రోజులు గడిచాయి.

ఈసారి ఇంకో అయిదుగుర్ని, ఆ వూరికి ఉప్పు అమ్మ డానికి వచ్చిన మనిషిని పోలీసులు తమ ఇంటికి తీసుకుపోయి "పంతులు గురించి మాకేం తెలీదు" అని మొర్రో మంటున్న కొద్దీ రెచ్చిపోయి చావబాదారు. ఆ వూరి మనుషుల్ని, వారివారి ఇళ్లల్లో పడేసి, ఉప్పు వ్యాపారిని తీసుకొచ్చి, రామాలయం అరుగుమీద అందరికీ అవుపించేలా పడేసారు.

ఈసారి ఎవరి అదృష్టం పుచ్చబోతోంది? అదీ అందరి గుండెల్లో పలుకుతున్న ప్రశ్న.

"మీకు పంతులు యెక్కడున్నాడో తెలుసు. అయినా చెప్పడంలేదు. అతడ్ని మీరు దాస్తున్నారు. మద్దతు ఇస్తున్నారు. మీ రతనిగురించి చెప్పిన తక్షణం మిమ్మల్ని వదిలేస్తాం. అంతేకాదు. పంతు లొక్కడూ మాకు చిక్కితే చాలు మరుక్షణం యీ వూరు వదిలి వెళ్ళిపోతాం. మీ రాతనిగురించి, చెప్పినంతవరకూ, మీకేగాదు. మీ ఊళ్లో వాళ్లందర్నీ చావగొట్టి వదుల్తాం. గుర్తుపెట్టుకోండి" అని అంటున్నారు పోలీసులు.

అయితే పంతులెక్కడ? తమలోపంతులుగురించి తెలిపిన వాళ్ళు, మద్దతు ఇస్తున్న వాళ్ళెవరు? ఎందుకీ పంతులు తమనిలా బాధపెట్టేస్తున్నాడు పరోక్షంగా?

పంతులు గురించిగాని, అతనిగురించి తెలిసిన మనుషుల గురించి, నిజంగా తెలిసుంటే, పోలీసులకు వాళ్ళ గురించి చెప్పేసి, పోలీసుల బెడద తప్పించుకోవాలన్న మూడ్‌లోనే ఉన్నారు జనం.

అయితే, తమకేమీ తెలీదే!

జనం ఆలోచించలేక వెర్రెత్తిపోసాగారు.

వంతులవారీగా జనాన్ని కొట్టడం ఆపలేదు పోలీసులు.

పోలీసుల బాధ పడలేక, పంతులు తమకు తెలుసని చెప్పి, ఒకరిద్దరు, వేరెవరినో పంతులుగా గుర్తుపట్టారు.

తాత్కాలికంగా, వారి బాధలు విరగడయినా, పోలీసులు వెరిపై చేపివచ్చి "పోలీసులకు తప్పుడు సమాచారం ఇస్తావా? దొంగనాకొడకా!" అంటూ వారిని, రెండింతలు దెబ్బలు కొట్టి వదిలారు.

ఇదిలా వుండగా, పట్టపగలు, రోడ్డుమీద తిరుగుతున్న కోళ్లని, గొర్రెపోతుల్ని పోలీసులు ఎత్తుకెళ్ళి కోసి, కూరలు వండుకుని తినేయసాగారు.

"యేమిటీ అన్యాయం?" అంటూ పోలీసులకు అడ్డు చెప్పడానికి గ్రామస్తు లెవరిలోనూ ధైర్యం మిగలలేదు.

"మీ వూళ్ళో ఉండడం మాకు మాత్రం ఇష్టమనుకున్నా రేమిటి? మీ మొండితనం వల్లనే ఉండాల్సి వస్తోంది. మేం తెచ్చుకున్న సరుకులు అయిపోయాయి. మున్సబు మాత్రం ఎన్నాళ్లని మమ్మల్ని పోషించగలడు? గత్యంతరంలేక, మీ తిండి పదార్థాలు తీసుకుంటున్నాం. పంతుల్ని పట్టి ఇచ్చి మమ్మల్ని పంపేయండి. మీ ఇంటి ఛాయలకు రమ్మన్నా రాము." చెప్పారు పోలీసులు.

ఓ ప్రక్కనుంచి తమని అకారణంగా తంతున్నారు. ఇంకో ప్రక్కనుంచి, తమ ఆహారాన్ని లాగేసుకుంటు న్నారు. గ్రామస్తుల గుండెలు మండిపోసాగాయి.

7

ఆరోజు సాయంకాలం - ఏడయింది. అప్పుడప్పుడే చీకటి పడుతోంది.

పొలాలనుంచి, ఆడా మగా, జట్లుజట్లుగా ఇళ్లకు వస్తున్నారు.

ఆడవాళ్ల తలలమీద గడ్డి గంపలు, చేతుల్లో బొరిగలు ఉన్నాయి. మగాళ్ళు పశువుల్ని తోలుతున్నారు.

పోలీసులు ఆ వూరులో మకాంపెట్టి, అత్యాచారాలు ఆరంభించిన మరుచటి రోజునుంచీ, మగగానీ, ఆడగానీ, పోలీసుల ఎదుట బడడానికి జడుస్తున్నారు. వీలయినంత వరకు, పోలీసుల దృష్టికి దూరంగా వుండాలనే ప్రయత్ని సున్నారు.

అయితే, పొలాలకు వెళ్లక, ఇంటిపనులు చేసుకోక, వాళ్ళ జీవనం సాగేదెలా?

తమపనులు చేసుకోవాలంటే, వీధిలోకి రాక తప్పదు. వస్తే, పోలీసుల దృష్టిలో పడక తప్పదు. ఏమంటే, ఆ వూరికి ఉన్నది ఒకే ఒక్క వీధి.

ఓ ప్రక్క భయంతో గుండెలు గుబ గుబ లాడి పోతున్నా, మొండికేసి, తమదైనందిన కార్యక్రమం సాగించుకోసాగారు ప్రజలు.

అవాళ కూడా యెప్పటిలా, పోలీసుల మకాం రాగానే, నిశ్శబ్దంగా దాటిపోసాగారు.

మగాళ్లు దాటిపోయారు. ఆడవాళ్ళు కాస్త వెనుక బడ్డారు.

ఒక్క నిముషం గడుస్తే, వాళ్ళుకూడా గప్‌చిప్‌గా వెళ్ళిపోయేవారే?

హఠాత్తుగా అనుకోనిది జరిగింది.

పోలీసులు మెరుపుల్లాగ బయటకు వచ్చారు. యవ్వనంలో ఉన్న నలుగు రాడవాళ్ల రెక్కలు పుచ్చుకుని, తమ ఇంటిలోకి లాక్కుపోసాగారు.

ఆ క్షణంవరకూ తమ మగాళ్ళమీద పోలీసుల దౌర్జన్యం సాగితే, చూసిన వాళ్ళేగాని, ప్రత్యక్షంగా తాము గురి కాలేదు. ఆడవాళ్లు బేజారెత్తిపోయారు.

'మాఁవో!' 'నాయనో!' 'అన్నయ్యో!' అంటూ పొలి కేకలు పెడ్తూ, పెద్దగా ఏడవసాగారు.

వాళ్ల ఏడుపులు, పోలీసుల గుండెలు కరిగించలేదు. పోలీసులు నిర్దాక్షిణ్యంగా యీడ్చుకు పోసాగారు.

ముందుకు సాగిపోయిన మగాళ్లకు, ఆడవాళ్ల కేకలు

భయంకరంగా విన్పడ్డాయి. చప్పున వెనుదిరిగ్గారు.

వాళ్లల్లో, పోలీసులు యెత్తుకుపోతున్న ఆడవాళ్ల బంధువు లున్నారు. ఒక్క-క్షణం వారి ఆలోచనలు స్తంభించి పోయాయి, ఆ సంఘటన హఠాత్తుగా జరగడంవల్ల.

కాని క్షణాల్లో వాళ్లకు స్పృహ వచ్చింది.

తమని అకారణంగా తంతే భరించారు. తమ కోళ్లని, మేకపోతుల్ని యెత్తుకుపోయి మజాచేస్తే, లోలోన మండి పోయారే తప్ప, కిమ్మనలేదు. కాని ఇవాళ?

తమ అక్క-, చెల్లెళ్ళని, భార్యా, కూతుళ్లని చెరచ డానికి సిద్ధమయ్యారు యీ పోలీసులు!

అసలు పంతులన్నవాడు ఉన్నాడో లేడోగాని, ఆ మిష పెట్టి, పోలీసులు తమని దోచెయ్యడానికి రాలేదు గదా?

వాళ్ల రక్తాలు మరగసాగాయి,

వాళ్లల్లో ఒకడు తెగింపుగా "రండ్రా! యేటో ఇవాళ తేల్చుకుందారి. రోజు రోజుకీ పెచ్చు మీరిపోతంది యీాల్ల జులం," అని ముందు కడుగెయ్యగానే, తతిమ్మా వాళ్లం దరూ అతడితో అడుగేసారు ముందుకి.

మగాళ్ళు ఓ నిశ్చయానికొచ్చి, తెగింపుతో పోలీసుల ఇంటిలోకి వెళ్ళేసరికి, ఆడవాళ్ళ ఒంటిమీద బట్టలులేవు. వాటిని పోలీసులు యేనోడో వలిచేసి, మూలకు గిరవాటేసి, కాళ్ళూ చేతులు కొట్టుకుంటూ వృధాగా గింజుకొంటున్న ఆడవాళ్ళమీద పడ్డారు.

ఆ దృశ్యం, ఎంతో దుర్భరంగా, కడుపు కోతగా ఉంది మగాళ్లకు.

"ఏటీ అన్యాయం? మీరు మనుసులా? రాక్షసులా?....

మీ కాదోల్లునేరా? మీ అప్ప చెల్లెల్లని ఒవుడేనా ఇలాగ చేత్తే. మీ కెలాగుంటాది?" ఆవేశంగా అరిచారు మగాళ్ళు.

రైతు జనం కళ్ళల్లో కోపాన్ని. వారి ఒంట్లో కదులాడే ఉద్రేకాన్ని చూశారు పోలీసులు.

వాళ్ళు మొదట దెబ్బ తియ్యకముందే. తాము చెయ్యి చేసుకోవడం అవుసరం అనుకున్నారు.

మవునంగా లాఠీలు అందుకున్నారు.

క్షణాల్లో భీభత్సం చెలరేగింది.

ఒంటిమీద పడే దెబ్బలు కాచుకునే లోపల. తలమీద; తలమీద దెబ్బ నొప్పి తెలిపి 'అమ్మో' అనేలోపల. పిక్కలమీద-అక్కడా ఇక్కడా అనకుండా. వాడూ వీడూ అన్న విచక్షణలేకుండా. పోలీసుల లాఠీలు. జనంమీద దెబ్బల వర్షం కురిపించాయి.

దిమ్మ దిరిగిపోయింది జనానికి. వాళ్ళ ఆవేశం క్షణాల్లో ప్రాణ రక్షణావసరంగా మారిపోయింది.

అప్రయత్నంగానే. వాళ్ళ కాళ్ళకు రెక్కలు మొలిచాయి.

ఆ రోజు రాత్రి గొప్పులపాలెంలో కన్నీరు కార్చని కన్నులేదు. కసితో రగలని హృదయంలేదు.

8

గొప్పులపాలెం గ్రామస్తులకు ఇప్పుడొక విషయం ఖండితంగా తెలిసిపోయింది.

పోలీసులు కోరిన పంతుల్ని తాము అప్పగించేంత వరకూ. పోలీసులు ఆ వూరు వదలరు సరికదా. ఒకటి తర్వాత ఒకటి. అత్యాచారం చేస్తూనే ఉంటారు.

పంతులు విషయం తమకు తెలీదు. తమ గ్రామస్తుల్లో ఎవరికయినా పంతుల్ని తెలుసునో, తెలియదో గాని- తమకు మాత్రం తెలీదు.

పోలీసుల చేతుల్లో ఆయుధాలున్నాయి. పైగా తెలివి తేటలు, అధికారబలం, శారీరకబలం - యేవిధంగానైనా తమ ఆశయం నెరవేర్చుకోవాలన్న భీషణ నిర్ణయం వాళ్ళ పక్షాన్న ఉన్నాయి.

మరి తామో: నిరాయుధులు, బలహీనులు, అర్భకులు, అమాయకులు.

అయితే, తామూ కుట్రచేస్తే, మంది యెక్కువగా తమ కున్నారు కాబట్టి, పోలీసులపైన నెగ్గుకు రావచ్చు.

గొప్పులపాలెం గ్రామస్థులంతా ఓ అర్ధరాత్రి రహస్యంగా సమావేశమయ్యారు సూర్యనారాయణ ఇంట్లో.

సూర్యనారాయణ చదువుకున్నవాడు కాబట్టి, వాళ్లకు నాయకుడయ్యాడు.

"ఇంత అన్యాయం జరుగుతుంటే, మన మున్సబు ఎందు కూరుకుంటండో తెలవకుండా ఉంది," కొంతమంది ఆవేశంగా అన్నారు.

"ఆడేటి సెయ్యగల్డురా. ఆడేటేనా అన్నాడంటే, ఆడి పెల్లాం పిల్లలమీద కొత్తాది ముప్పు" కొంతమంది జవాబు చెప్పారు.

ఆమీదట వాళ్ల చర్చ కాసేపు, యెవరెవరి కెలాంటి అవమానాలు జరిగాయో, వెళ్లబోసుకోవడంలో గడిచినా, ఆ తరువాత మెల్లగా, పోలీసుల పీడ విరగడ కావాలంటే తామేం చెయ్యాలో అన్న విషయం మీదకు నడిచింది.

"పోలీసులవద్ద ఆయుధాలు ఉన్నాయి. కాని మనకు నైతికబలం ఉంది. మన యిళ్లల్లో, గునపమో, బళ్ళెమో, పారో, బారుకత్తో, యేమీ లేకపోతే, చాటాటికర్రో ఏదో ఒకటి ఉంది.

మగవాడయిన వాడల్లా ఏదో ఒక ఆయుధం చేత పుచ్చుకురండి. రేపు రాత్రికి ఇదేవేళకు అందరం ఒకేసారి, పోలీసుల ఇంటిమీద దాడిచేద్దాం. మనం ఇవాళ రాత్రి ఇలా సమావేశం అయి, సమాలోచన చేసినట్టుగా వాళ్లకు తెలీదు. తెలిసేలోపున మనం దెబ్బతీసేస్తాం. యేం? అర్థమైందా?" అన్నాడు సూర్యనారాయణ చర్చకు ముగింపుగా.

అందరూ ఇళ్లకు మరిలారు, తమ ఆమోదం తెలిపి.

9

మరునాడు పగలు యేలాంటి వైపరీత్యం లేకుండా నడిచింది. రాత్రయిరంది మామ్మూలుగా.

అర్ధరాత్రి కూడా అయింది. సుమారు ఒంటిగంట అయ్యుంటుంది.

ఆకాశంలో చంద్రుడులేడు. కనీసం చుక్కల వెల్తురు కూడా లేదు, మబ్బులు పట్టిన కారణంగా.

ఆ క్షణంలో గొప్పులపాలెంలో చిక్కని చీకటి తప్ప ఇంకో పదార్థంలేదు.

ఆ చీకటిలో చల్లచల్లగా, మెలమెల్లగా నీడలు కదిలాయి. ఆ నీడల చేతుల్లో గునపమో, గొడ్డలో, బాణాకర్రో, పారో, చాపాటికర్రో ఉంది.

ఆ నీడలు క్రమంగా, పోలీసుల ఇంటి దగ్గరకు నడిచాయి.

పోలీసుల ఇంటిలో హరికెనులాంతరు వెలుగుతోంది. లాంతరు ప్రక్కన కూచుని కునికిపాట్లు పడుతున్నాడు ఓ జవాను-అదే పెదబాబు.

పెదబాబుకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. కాదు-తన నెవరో లేపినట్టయింది. యేమిటది?

చూరు క్రిందనుంచి. చీకట్లోకి చూసాడు నిశితంగా. అతనికేమీ కన్పించలేదు.

ఆవేళ ఉదయంనుంచి. ఊరంతా శాంతంగా ఉంది. ఆ శాంతత యెందుకో అసహజంగా ఉన్నట్టనిపించింది అతడికి.

లాంతరు పుచ్చుకుని. బయటికి. వీధిలోకి వచ్చాడు.

అంతే! ఒక్క దెబ్బతో లాంతరు తుళ్ళిపోయింది. అతడి మెడకాయమీద గొడ్డలి వేటుపడి. తల తెగి నేల మీద పడింది.

లాంతరు తుళ్ళిపోయినప్పుడు. భయంతో అతడు వేసిన పొలికేకకు. నిద్రలో ఉన్న పోలీసులు తుళ్ళి పడి లేచారు ఒక్క ఉదటున. అప్పటికే ముత్యాలు. బంగా ర్రాజుల చావుకేకలు హృదయ విదారకంగా వినిపించాయి.

మిగిలినవాళ్ళు తుపాకులు అందుకుని. కాల్చసాగారు. జనం పిట్టల్లా రాలి పోయారు.

గ్రామస్తుల ఉద్రేకం మరింత పెరిగిపోయింది. ఫలితం-ఆరు ప్లస్ అరవై ఆరుగురు నిర్జీవులైయారు.

గొప్పులపాలెం ఒక యుద్ధరంగంగా. స్మశాన వాటికగా మారిపోయింది.

□□□

అత్యాచారం?

ఏ. వీ. మోహన్రావ్

ఝల్లుమంటూ వస్తున్న చల్లనిగాలి, నా చెవి రంధ్రాల్లోంచి ఊపిరితిత్తుల్లోకి దూరి శరీరాన్ని చల్లబరచసాగింది. కారు మెల్లగా పోతుంది. ఏక్సిలేటర్ ఎంత నొక్కినా స్పీడు మాత్రం అందుకొనటంలేదు.

గడియారం చూసుకున్నాను. ఏడయింది, చుట్టూ నల్లటి చీకటి చుట్టు ముట్టివేసింది.

"అనిల్!" పిలిచారు వెనుకసీట్లో కూర్చుని కునుకు తీస్తున్న నాన్నగారు.

"ఆఁ!" అంటూ పలికాను.

"ఇంకెంత దూరముంది బాబూ!"

"మరో పదిమైళ్ళుంటుంది నాన్నా."

"బాగా ఆలస్యమయినట్లుంది గదూ!" అడిగారు నాన్నగారు.

"అవును. కారు సరిగాలేదు. మనం వెళ్ళేందుకు రెండు గంటలన్నా ఆలస్యమవుతుంది. పాపం జనమంతా కాచుకుని వుంటారు" అన్నాను.

"అవునవును. సినిమా నటుల్ని ఇలాంటి ఫంక్షన్లకు పిలిస్తే ఒక పట్టున టైముకు రారన్నమాట. నువ్వా నిజం చేశావ్!" అన్నారు నాన్నగారు.

నేను మాట్లాడకుండా కూర్చున్నాను.

"అనిల్!" మళ్ళీ పిలిచారు నాన్నగారు.

"ఆఁ!" అన్నాను.

"ఈ ప్రదేశం చూస్తుంటే నా వయస్సు దాదాపు ఇరవై సంవత్సరాలు వెనక్కు నడిచినట్లుంది. ఆ రోజుల్లో ఇక్కడ నేను పోస్ట్‌మాస్టర్ ఉద్యోగం చేసేవాణ్ణి. ఇక్కడ పిల్లలతో వుండలేక అమ్మనూ, మమ్మల్నూ, పట్నంలోవుంచి నేనొక్కణ్ణే వుండేవాణ్ణి" అంటూ ఆపారు చెప్పడం.

నేనూ డ్రయివ్‌చేస్తూనే వినసాగాను. మామూలుగా రోజూ షూటింగ్ గొడవల్లో, ఇంటికి ఏ అర్థరాత్రికో రావడం, పోవడంవల్ల వారితో మాట్లాడే తీరికే వుండదు నాకు. కనీసం ఇప్పుడయినా ఆ అవకాశం చిక్కినందుకు నాకు ఆనందంగా వుంది.

"ఈ ప్రాంతాల ఉద్యోగంచేసిన రోజుల్లో జరిగిన ఒక సంఘటన మరచిపోదామన్నా ఎప్పటికీ మరుపురాకుండా వుంది" అన్నారు.

"అంత విచిత్రమైన సంఘటన జరిగిందా?" అడిగాను నేను.

"నిజంగా విచిత్రమే!"

"అయితే చెప్పండి!" అంటూ ఉత్సాహం చూపించాను.

"పోస్టుమాస్టర్ పనిచేస్తూనే, రాత్రిళ్ళు వయోజనులకు చదువుచెప్పేవాణ్ణి. పదిమందిదాకా వచ్చేవాళ్లు. ఒకరోజు రాజమ్మనే మధ్య వయస్కురాలు నా దగ్గరకొచ్చింది. తన కూతురికి నాలుగు ముక్కలు చెప్పమని ప్రాధేయపడింది. అలాగే చెప్తానన్నాను.

మరుసటిదినం కూతుర్ని తీసుకొచ్చింది. ఆ అమ్మాయిది కళ్ళు చెదరగొట్టే అందం. మంచి యవ్వనంలో వుంది. రాజమ్మ ఇంటినిండా వున్న దారిద్ర్యం, ఆ అమ్మాయిని సరయిన బట్టలుకూడా లేకుండా చేసింది. చాలీ చాలని జాకెట్, చీరలతో వచ్చి కూర్చుందామె.

ఆమె అందాలు అన్ని వేపులనుంచీ అందరికీ కన్పి స్తూంటే ఆకర్షితులవుతున్నారు అక్కడున్న అందరూ. చెప్పే చదువు వినడంమాని. ఆమెనే గుడ్లప్పగించి చూడ సాగారు.

రెండ్రోజులు గమనించాను. మూడోరోజు ఆమెను విడిగా వచ్చి చదువు చెప్పించుకోమని చెప్పాను. ఆమె సరేనంటూ తలూపింది. ఈలోగా మిగిలినవాళ్లు నాపైన రకరకాల నిందలు వేయడం మొదలెట్టారు. అవి నాదాకా వచ్చినా, లెక్కచేయకుండా వుండిపోయాను.

ఓరోజు నేను పట్నం వెళ్ళవలసివచ్చింది. తిరిగివస్తూ ఆ అమ్మాయికో తెల్లచీర తెచ్చి ఇచ్చాను. అది కట్టుకుని వచ్చింది. ఆ చీరలో విరిసిన బొడ్డుమల్లె పూవులా వుందా అమ్మాయి. ఆ పిల్లను ఆరోజునుండి నేను "మల్లీ" అంటూ పిలవసాగాను."

చెప్పటం ఆపి జేబులోంచి సిగరెట్ తీసుకుని కాల్చు కున్నారు.

కారు నత్త నడక నడుస్తూనే వుంది.

నాన్నగారు చెప్పే కథవింటూ, నాకు రాముని పట్నంలో జరగబోయే సన్మానంగురించి గానీ, అందుకు బదులుగా నేను చెప్పవలసిన సమాధానంగురించి గానీ, ఆలోచించడం మానివేశాను. నా కళ్ళముందు అందమైన ఆ మల్లి విగ్రహం నృత్యం చేస్తున్నట్లనిపించింది.

ముందున్న రోడ్ కేసి చూశాను. ఎత్తుగావున్న కొండ పైకి దారిచూపిస్తుందా రోడ్డు. గియిర్ మార్చాను. ఏక్సిలేటర్ బలంగా నొక్కాను.

"అనిల్! ఈ ఎత్తు ఎక్కుతుందట్రా కారు?" అడిగాడు నాన్నగారు.

"ప్రయత్నం చేద్దాం!" అన్నాను.

అతికష్టంతో ఎక్కింది కారు. అక్కన్నుంచి లోతులోకి పోతున్నట్లుంది మార్గం. బ్రేక్‌పైన కాలు తియ్యకుండా మెల్లగా క్రిందకు పోనిచ్చాను.

"ఆ మల్లి కథ పూర్తి చెయ్యనా?" అడిగారు నాన్నగారు.

"చెప్పండి నాన్నగారూ!" అన్నాను.

"ఒకరోజు ఉదయం రాజమ్మ ఏడుస్తూ వచ్చింది. ఇంటి వెనుక నున్న అడవిలో చిన్న నీటిగుంట ప్రక్కనున్న పెద్ద బండపైన మల్లి చచ్చిపడి వుందని చెప్పి ఏడ్చింది. నాకు గుండె ఆగినంత పనయింది. వడివడిగా తయారయి రాజమ్మను తీసుకుని ఆ ప్రదేశానికి వెళ్ళాను.

మల్లి శవం వెల్లకిలా పడుంది. వొంటిమీద నూలు పోగు లేదు. అక్కడక్కడా శరీరంపైన గోళ్ళతో గీచినట్లు గీతలు కనుపించాయి. నా పైకండువా ఆమెపైన

పరచాను. నాచేత్తో ఆమె చెంపలు తాకాను. మంచు ముక్కల్లా వున్నాయి. ఆ చలిలో ఆమె శరీరం గడ్డకట్టుకు పోయింది.

అందంగా. ఆనందంగా, అన్నినాళ్ళు నాముందు తిరిగిన మల్లిపూవు అలా రాలిపోవడం నాకు చాలా బాధ కలిగించింది. ఆమెను భూస్థాపితం చేయించాను. ఇది జరిగాక ఇక అక్కడ ఉద్యోగం చెయ్యలేక, బదిలీ చేయించుకున్నాను." అంటూ ఆపారు నాన్నగారు.

నా మనస్సునిండా ఏదో బాధ నిండిపోయింది.

ఎడంవేపునున్న మైలురాయి చూశాను. మరో ఆరు మైళ్ళుంది రామునిపట్నం.

టైము చూసుకున్నాను. ఏడుగంటల ముప్ఫయినిము షాలు. కిటికీలోంచి వెలుపలకిచూస్తే, దట్టమైన చీకటి.

దూరంగా రోడ్ కడ్డంగా ఎవరో నిలబడివున్నట్లు లైట్ల వెలుగులో కనుపించింది. కారు వేగం తగ్గించాను. ఇంకొంత దగ్గరకాగానే ఆ మనిషి స్త్రీ అని గుర్తించాను.

బ్రేక్ తొక్కాను. ఠక్కున ఆగింది కారు.

"ఏమయింది బాబూ!" అడిగారు నాన్నగారు.

"ఎవరో మనిషి రోడ్ కడ్డంగా నిలబడింది!" అన్నాను ముందుకు చూస్తూ.

"హారన్ కొట్టు!" అన్నాడు నాన్న.

అలాగే చేశాను. కానీ ఆమె ప్రక్కకు తొలగలేదు. తలుపు తీసుకుని దిగాను. మెల్లగా ఆమె దగ్గరకు వెళ్లాను. రెండు చేతులతో ముఖం కప్పుకుని వుంది.

"ఏమండీ!" పిలిచాను.

"ఆఁ!" పలికింది చేతులు తీయకుండానే ముఖంపై నుంచి.

"ఇలా అడ్డంగా నిలుచుని కారు క్రిందపడి ప్రాణాలు తీసుకుందామనుకుంటున్నారా?"

ఆమె జవాబు చెప్పలేదు.

"చెప్పండి! అదేజరిగితే నన్ను జైల్లో సారేస్తారు." అన్నాను ఆమెను భయపెడదామన్నట్లు.

అందుకూ ఆమె పలకలేదు.

"మీరెక్కడికన్నా వెళ్ళాలా?"

"ఆఁ!"

"ఎక్కడికి?"

"రామునిపట్నం వెళ్లాలి!"

"ఎందుకు?"

"పనివుంది."

"అయితేరండి! నాకార్లో తీసుకెళ్తాను." అన్నాను.

ఆమె ముఖంపైనుండి చేతులు తీసింది. నావెంట నడిచింది కారు దగ్గరకు. హెడ్ లైట్ల వెలుతురులో ఆమె ముఖం చూశాను. చాలా అందంగా వుందామె.

వెనుక డోర్ తెరచాను. కారెక్కి నాన్నగారి ప్రక్కన కూర్చొంది. నేనూ కారెక్కి కూర్చున్నాను.

తిన్నగా ఫంక్షను జరిగే ప్రదేశానికి పోనిచ్చాను కార్ను. జనమంతా గోలగోలగా అరుస్తున్నారు.

కారు దిగగానే కార్యకర్తలు నన్ను వేదికపైకి తీసుకెళ్ళారు. నాన్నగార్ని, వెనుకసీట్లో వున్న అమ్మాయిని, తీసుకెళ్ళి కూర్చోబెట్టమని చెప్పాను.

నాకు సన్మానం జరిగింది. నాలుగు ముక్కలు చెప్పాను. ఈ తతంగం అంతా పూర్తయ్యేసరికి అరగంటపైనే పట్టింది. తిరిగి కారు దగ్గరకు వచ్చాను.

కిటికిగుండా చూశాను. కారులో నాన్నగారు లేరు. వారు వస్తూంటారని, నా వెంటనున్న ఇద్దరు ముగ్గురు కార్యకర్తలతో కబుర్లు చెప్పసాగాను.

పదినిముషాలు నిలుచున్నా నాన్నగారి జాడలేదు. ఏమయినారో అర్థంగాక చుట్టూ చూశాను.

"ఎవరికోసమండీ చూస్తున్నారు?" అడిగాడు నా ప్రక్కనున్న కార్యకర్త.

"మా నాన్నగారికోసమండీ!" అన్నాను.

"మీతో వచ్చారా?"

"ఆఁ!"

"మేం గమనించలేదే! ఉండండి చూసొస్తాను." అంటూ వెళ్ళాడు.

రెండు నిముషాల తర్వాత వచ్చి "ఇక్కడెక్కడా లేరండీ!" అన్నాడు నాతో.

నాకేం పాలుపోలేదు. ఆ వెంటనున్న అమ్మాయి తన యింటిదాకా తోడు రమ్మంటే వెళ్ళాడేమో ననుకున్నాను. అలా వెళ్ళినా ఇంతసేపు రాకుండా ఏంచేస్తున్నట్లు? కంగారుగా వుంది. భయంగా వుంది. కొంపదీసి అదేదైనా దయ్యమేమో ననుకున్నాను.

ఊరేం పెద్దదిగాదు. చాలా చిన్నది. సన్మాన సంఘం మనుషులు అన్ని వీధులూ, ఇళ్ళూ, గాలించారు. ఎక్కడా మా నాన్నగారు లేరు.

రాత్రి పదకొండు గంటలయింది. పోలీసులకు రిపోర్టు ఇచ్చాను. వాళ్ళ యక్షప్రశ్నలకు జవాబు చెప్పేసరికి నాకు ప్రాణం విసిగిపోయింది.

"మీ కార్లో వస్తాను. ఎవరో అమ్మాయిని ఎక్కించు

కొచ్చామన్నారుగదా! ఆ ప్రదేశం నాకు చూపిస్తారా?" అడి గాడు ఇన్‌స్పెక్టర్.

"చూపిస్తాను! ఎక్కడండి?" అన్నాను.

ఇద్దరం కారెక్కాం.

వేగంగా పోనిచ్చాను. అంతకుముందా అమ్మాయి ఎక్కిన ప్రదేశంలో కారాపాను.

ఎస్.ఐ. దిగి చుట్టూ కలయచూశాడు. ఎక్కడా మను షుల జాడ లేదు.

చెట్లలోంచి కనుపిస్తున్న కాలిబాటవెంట నడవడం మొదలెట్టాడు. అతన్ని నేనూ అనుసరించాను. ఇద్దరం దాదాపు మైలుదూరం నడిచాం.

"ఎక్కడికి?" అడిగాను నేను.

"మాట్లాడకుండా వెంట రండి." అన్నాడు యస్.ఐ.

కొంతదూరం వెళ్ళేసరికి "మల్లీ! మల్లీ!"అంటూ పెద్దగా అరుస్తున్న మా నాన్న గొంతు వినవచ్చింది.

"అది మా ఫాదర్ వాయిస్ సర్!" అన్నాను.

ఆ శబ్దం వినవచ్చిన వేపు నడిచాం. నాన్నగారు కను పించారు. వెళ్ళి పట్టుకున్నాను. ఆయనపైనున్న కాశ్మీరు శాలువా కనుపించలేదు. చలి ఎక్కువగా వుంది. నాన్నగారు వణికిపోవటం గమనించాను.

"ఇక్కడికలా వచ్చారు నాన్నా?" అడిగాను.

"మల్లి తీసుకొచ్చిందిరా!"

"మల్లా? మీకెక్కడ కలిసింది?"

"ఇందాక కారెక్కింది ఎవరనుకున్నావ్. మల్లిరా! ఆమెనుచూపి అవాక్కయిపోయాను. నువ్వు దిగి వెళ్ళాక మాట్లాడింది. తను చావలేదట. భగవంతుడితో పోరా

ప్రాణాలు తిరిగి తెచ్చుకుందట. వాళ్ళ అమ్మ నన్ను చూడా లందట. వెంట రమ్మని బ్రతిమిలాడింది. అంతే మాట్లాడు కుంటూవచ్చాము.

ఆమె ఎన్ని కబుర్లు చెప్పింది. ఈ దినం నేను వస్తానని తెలుసునట. అందుకే అలా రోడ్లో అడ్డంగా నిలబడిందట. అదేంచీర కట్టుకుందనుకున్నావ్. తెల్లచీరరా! అప్పుడెప్పుడో నేను కొని తెచ్చిచ్చిన తెల్లచీరరా? నా మల్లి అందం అలాగే వుందిరా! ఆమెను చూస్తుంటే ప్రకృతిని చూపినంత ఆహ్లా దంగానూ, ఆనందంగానూ ఉందనుకో.

ఇక్కడిదాకా వచ్చాం. ఇంతలో ఎటో వెళ్ళింది. వెతుకు తున్నాను. ఈలోగా నువ్వొచ్చావ్!" అన్నారు ఆవేశంగా నాన్నగారు.

"మీ శాలువా ఏది?" అడిగాను.

"చలితో వణుకుతుంటే కప్పుకోమని ఇచ్చాను మల్లికి" అన్నారు నాన్నగారు.

నాకు మతిపోయింది.

ప్రక్కనున్న యస్.ఐ. అంతా విన్నాడు.

"ఇరవై ఏళ్ళక్రితం మీ మల్లిపైన అత్యాచారం చేసిం దెవరో చెప్పిందా?"

"ఆఁ. చెప్పింది! కడియాల వెంకటయ్య. వాడు కోర చూపులు చూసేవాడు. వాడికికూడా నేను చదువు చెప్పాను. ఒక రాత్రి వెళ్ళి ఆరుబయట నిద్రపోతున్న తనను, బల వంతంగా తీసుకెళ్ళి, అడవిలో మానభంగం చేసేందుకు ప్రయత్నించాడట. మల్లి ప్రతిఘటించిందట. వాడు గొంతు నులిపి చంపాడట. మల్లి వాడి చెవి కొరికేసిందట" అన్నాడు నాన్న.